

వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



బిజెపికి లొంగిపోయిన అన్నాడిఎంకె : రాహుల్

జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ హామీ ఏమైంది? 05

మహిళా కోటాపై మోదీది ద్వంద్వ వైఖరి



సంపుటి 09, సంచిక: 141 | మంగళవారం | 21-04-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


### వచ్చే ఎన్నికల్లో

# ప్రతిపక్ష హోదా ఊడగొడతా

“రాష్ట్రంలో ఒక సంప్రదాయం ఉంది. 1994 నుంచి 2004 వరకు టిడిపి అధికారంలో ఉంది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2014 నుంచి 2 సార్లు బిఆర్‌ఎస్ గెలుచింది. 2023లో మేము అధికారంలోకి వచ్చాము.. ఇప్పటి వరకు రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లో మేము గెలిచాము. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నేను మా మిత్రుడు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసి కాంగ్రెస్‌ను మళ్ళీ అధికారంలోకి తెస్తాం.”





- 2029 ఎన్నికల్లో నువ్వో.. నేనో తేల్చుకుందాం
- మాజీ సిఎం కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నేను, నా మిత్రుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తాం
- ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలా?
- జీవన్‌రెడ్డికి పదవి రాకపోతే.. ప్రజాప్రభుత్వం పోవాలా?
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా నస్తూర్‌పల్లి బహిరంగ సభలో బిఆర్‌ఎస్‌పై విరుచుకుపడిన సిఎం
- సభావేదిక పైనుంచి రెండో విడత రైతు భరోసా నిధులు

ప్రజాపక్షం/భూపాలపల్లి

'కెసిఆర్.. 2029లో నువ్వో నేనో తేల్చుకుందాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కెసిఆర్ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే తన పేర్చుకుంటానని శపథం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లో తామే గెలిచామని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నేతాను, తన మిత్రుడు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసి కాంగ్రెస్‌ను మళ్ళీ అధికారంలోకి తెస్తామని స్పష్టం చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండో విడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దేశంలోనే రైతులకు ఉచిత తరువాయి 2లో



# నూటికి నూరు శాతం బిఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తది

- తెలంగాణ పునఃనిర్మాణ యజ్ఞం చేయాల్సిందే
- తెలంగాణను మళ్లీ గెలిపించి నిలబెట్టాల్సిన బాధ్యత ప్రజలదే
- రైతు బంధు పథకం నెలకు ఒక కిస్తిలా మారింది
- పంటలకు బోనస్ బోగస్‌లా మారింది
- కాంగ్రెస్ పోవాలి బిఆర్‌ఎస్ రావాలి
- హైడ్రాను ఎత్తి అవతల పారేస్తాం : బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్

**బిఆర్‌ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి : పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన కెసిఆర్**

ప్రజాపక్షం/జగిత్యాల

రానున్న రోజుల్లో నూటికి నూరు శాతం బిఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ పునఃనిర్మాణ యజ్ఞం కోసం అందరూ నిలబడి సాధించుకున్న తెలంగాణను మళ్లీ గెలిపించి నిలబెట్టాల్సిన బాధ్యత ప్రజలదేనని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మిని స్టేడియంలో సోమవారం రాత్రి బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించారు. బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ హాజరయ్యారు. 40 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీలో ఉండి ఇటీవల రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డితో పాటు 100 మందికి పైగా జీవన్ రెడ్డి అనుచరులకు కెసిఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి కెసిఆర్ ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు బందు పథకానికి రాం రాం, దళిత బంధు పథకానికి జై భీం పలికిన కాంగ్రెస్ పార్టీ ప్రజలతో పాటు రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. తెలంగాణ రైతుల పరిస్థితి నెలకో రైతు బంధు కిస్తిలా మారిందన్నారు. కెసిఆర్ మళ్లీ సభ పెడితే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం మూడవ కిస్తి కింద రైతు బంధు చెల్లించరని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి చిల్లర మాటలు తప్ప నిర్మాణాత్మక కార్యక్రమాలు లేవన్నారు. యూరియా బస్తాల కోసం రైతులు కాళ్లకు వాపులు వచ్చేలా, చెప్పులు లైన్‌లో పెట్టినా పంటల సాగు కోసం సరిపడా యూరియా ఇవ్వడం లేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ పరిస్థితి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే కాంగ్రెస్ ప్రభుత్వం తరువాయి 2లో



## ఎల్లుండి కెబినెట్ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 23న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. ప్రత్యేకంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి వంటి అంశాలు అజెండాలో ఉండనున్నట్లు సమాచారం. అలాగే రానున్న వేసవి పరిస్థితులు, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్ నిర్వహణపై కూడా మంత్రివర్గం సమీక్షించనుంది. ఇదిలా ఉండగా, కొన్ని శాఖలకు సంబంధించిన విధాన నిర్ణయాలు, కొత్త ప్రాజెక్టులకు ఆమోదం, పరిపాలన సంబంధిత అంశాలపై కూడా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. కాగా క్యాబినెట్ విస్తరణ, మంత్రి అజారుద్దీన్ తిరిగి నియామకం, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు తదితర అంశాలపై కూడా మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది.

## ఒప్పందం లేకుండా గడువు ముగిస్తే

# బాంబు దాడులు

- నేటి చర్చలపై ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- కార్గో నౌక స్వాధీనంతో చర్చలపై అస్పష్టత
- ఎటూ తేల్చుకోని ఇరాన్
- నేనూ ఇస్లామాబాద్ వెళతా : ట్రంప్
- ఏకపక్షంగా హోర్ముజ్ తెరుచుకోదు : బఘాయి
- దౌత్య చర్యల్లో అమెరికాకు చిత్తశుద్ధి లేదని విమర్శ
- పాకిస్థాన్ ఒక్కటే ఏకైక అధికారిక మధ్యవర్తి : ఇరాన్





**టెహ్రాన్:** ఇరాన్ కార్గో నౌకను అమెరికా స్వాధీనం చేసుకున్న తర్వాత పశ్చిమాసియాలో కొత్త చిచ్చురేగడంతో ఇస్లామాబాద్‌లో మంగళవారం రెండో విడత చర్చలకు వెళ్ళేందుకు ఇరాన్ తిరస్కరించింది. ఐతే 'తౌస్కా' నౌక దిగ్బంధనంపై ప్రతీకారేచ్ఛతో ఉన్న ఇరాన్ చర్చల విషయంపై ఊగిసలాటలో ఉందని వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో ట్రంప్ సోమవారం సాయంత్రం ట్రూత్ సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ, ఎలాంటి ఒప్పందం లేకుండా కాల్పుల విరమణ గడువు (ఏప్రిల్ 22) ముగిసిపోతే ఇరాన్‌పై బాంబు దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఇరాన్ మమ్మల్ని ఈ యుద్ధంలోకి లాగలేదని, ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించే విషయంపై అస్సలు నెతన్యాహూ తనతో మాట్లాడలేదని కూడా ఆయన వివరణ ఇచ్చారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తర్వాత, "ఇక ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకుండా చేయాలని నాకు నేనుగా ఒక జీవితకాల నిర్ణయం తీసుకున్నా" అని పేర్కొన్నారు. ఇరాన్ కొత్త నాయకత్వం గనుక గొప్పవాళ్ళయితే, స్మార్ట్‌గా ఆలోచిస్తే, ఆ దేశ భవిష్యత్తు ఎంతో సంపద్వంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ యుద్ధంతో అమెరికాకు సంబంధం లేదని, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ పనిగట్టుకుని ట్రంప్‌ను ఈ యుద్ధం ఊబిలోకి లాగారని ఈనెలారంభంలో న్యూయార్క్ తరువాయి 2లో

## కొండపై నుంచి దొర్లిపడిన బస్సు

**21 మంది దుర్మరణం ; 51 మందికి గాయాలు**

**జమ్ముకశ్మీర్ ఉధంపూర్ జిల్లాలో ఘటన**




**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఉధంపూర్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు కొండపైనుంచి దొర్లిపడింది. ఈ ఘటనలో 21 మంది మృత్యువాత పడ్డారు. మరో 51 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. బస్సు రోడ్డుపై నుండి దొర్లి తలక్రిందులుగా పడటానికి ముందు ఒక ఆటోరిక్షాను ఢీకొట్టిందని, అందులో ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో రామ్‌నగర్ ప్రాంతంలోని కాగోర్ట్ గ్రామం సమీపంలో, కొండపై ఉన్న ఒక మలుపు వద్ద ప్రైవేట్ బస్సు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం వాటిల్లింది. ఈ బస్సులో రామ్‌నగర్ నుంచి ఉధంపూర్‌కు తమ రోజువారీ పనులకు వెళ్తున్న 50 మంది ప్రయాణికులు ఉన్నారు. వాహనం పైభాగం దాదాపు పూర్తిగా చిరిగిపోయి, నుజ్జునుజ్జు అయిన ఇనుప కుప్పగా మారడంతో సహాయక చర్యలు అత్యంత సవాలుగా మారాయి. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్ గ్రేషియాను కూడా ఆయన ప్రకటించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి తరువాయి 12లో

## మూడేళ్ల చిన్నారిని పీక్కు తిన్న కుక్కలు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి ఇటుక బట్టి లో ఘటన

ప్రజాపక్షం/పెద్దపల్లి



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో గల ఇటుక బట్టీలలో దారుణం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం మూడేళ్ల బాలికను వీధి కుక్కలు పీకుతిన్న ఘటన చోటు చేసుకుంది. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామ శివారులోని బ్రిక్స్ ఇండస్ట్రీలో ఒరిస్సాకు చెందిన తరువాయి 12లో

## అకాల వర్షాలు బీభత్సం

- ఈదురు గాలులు, వడగండ్ల వానతో పలు ప్రాంతాల్లో నేలవాలిన పంటలు
- కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోవడంతో అన్నదాతలు ఆవేదన
- రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు భిన్నమైన వాతావరణం : ఐఎండి




ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో అకాల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, వడగండ్ల వానతో కూడిన వర్షానికి పంట నేలవాలింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్మకానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబోస్తే వరదలో కొట్టుకోపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా నిజామాబాద్ జిల్లాలో సాయంత్రం వేళ ఈదురుగాలులతో తరువాయి 12లో

## మహిళా కోటా బిల్లును

# ఖూనీ చేసిన మోదీ

**ప్రతిపక్షం కేవలం డీలిమిటేషన్ బిల్లును మాత్రమే వ్యతిరేకిస్తోంది:ఖర్గే**



**కూచ్ బెహార్ :** శాసనసభల్లో 2029 నుంచి మహిళా కోటాను అమలు చేసే రాజ్యాంగ సవరణ బిల్లును ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే ఖూనీ చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ప్రతిపక్షం కేవలం డీలిమిటేషన్ బిల్లును మాత్రమే వ్యతిరేకిస్తోందని ఆయన గుర్తు చేశారు. కూచ్ బెహార్‌లో సోమవాం జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో ఖర్గే ప్రసంగిస్తూ అసెంబ్లీ ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ప్రధానమంత్రి విస్తృతంగా ప్రచారం చేయడాన్ని ఎద్దేవా చేస్తూ, మోదీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలనే కోరిక ఉందా అని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ తన అధికారిక పనులను నిర్లక్ష్యం చేస్తూ, అసాధారణంగా సుదీర్ఘకాలంగా బెంగాల్ వ్యాప్తంగా పర్యటిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. 'ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా లేక దేశ ప్రధానమంత్రిగా కొనసాగాలనుకుంటున్నారా?' అని ఆయన ప్రశ్నించారు. 2029 నాటికి శాసనసభల్లో 33 శాతం తరువాయి 12లో



03

## 'కాళేశ్వరం' దోషులను వదిలేదిలేదు

దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళతాం

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

# జపాన్‌లో పెను భూకంపం : సునామీ హెచ్చరిక



**టోక్యో :** జపాన్ ఈశాన్య తీరంలో సోమవారం ఉదయం 7.7 తీవ్రతతో పెను భూకంపం సంభవించింది. దీంతో ఇవాటే,హక్కాడో ప్రాంతాలలో హుటాహుటిన రెండో సునామీ హెచ్చరిక జారీ చేశారు. తీరప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందువల్ల పల్లపు ప్రాంతాల ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్ళాలని ముందస్తు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇలా 11 పట్టణాలలో ప్రజలకు హెచ్చరికలు ఇచ్చారు. నదీ తీర ప్రాంతాలను వదిలివెళ్ళాలని కోరారు. ప్రభుత్వం ఈశాన్య ప్రాంతంలో బులెట్ రైళ్ళను నిలిపివేసింది. రవాణా ఆగిపోయింది. రాబోయే ప్రమాదాలపై సంక్షోభ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానమంత్రి తకైచీ కార్యాలయం తెలియజేసింది. ప్రజలు పల్లపు ప్రాంతాల నుండి వలస వెళ్ళిపోవాలని ప్రధానమంత్రి మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. హక్కాడోలోని ఉత్తర,దక్షిణ ప్రాంతాలలో ఉన్న ఇవాటే, ఆమోరి ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

భూకంప ప్రాంతానికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యో నగరంలోని పెద్ద పెద్ద భవనాలు కూడా ఈ భూకంపంవల్ల ప్రకంపనలకు గురయ్యాయి. 7.7 తీవ్రతతో పెనుభూకంపం సంభవించడంతో దాదాపు మూడు మీటర్ల నుండి పది మీటర్ల ఎత్తు వరకూ అలలు ఎగసిపడి సునామీ వచ్చే ప్రమాదం ఉందని జపాన్ మెటీరియలాజికల్ ఏజన్సీ శాస్త్రవేత్తలు ప్రజలకు హెచ్చరించిన తర్వాత కుజీ ఓడరేవు వద్ద 2.60 అడుగుల ఎత్తున అలలు ఎగసిపడటాన్ని గుర్తించారు. మరికొన్ని ప్రాంతాలలో నలభై సెంటీమీటర్ల ఎత్తులో (1.30 అడుగుల ఎత్తు) అలలు ఎగసిపడ్డాయి. జపాన్‌లో ఏదో ఒక విధంగా ప్రతిఏడాదీ భారీ భూకంపం సంభవిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా సంభవిస్తున్న భూకంపాలలో రిచ్‌టర్ స్కేలుపై ఆరు లేదా అంతకంటే ఎక్కువ తీవ్రతతో 10 శాతం భూకంపాలు జపాన్‌లోనే వస్తున్నాయి. వచ్చేవారంలో కూడా ఇదేస్థాయిలో భూకంపం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరికలు వచ్చాయి.



గత ఏడాది డిసెంబరులో 7.5 తీవ్రతతో వచ్చిన భూకంపం కారణంగా అనేక డజన్లమంది ప్రజలు గాయపడ్డారు. అంతకుముందు 2011 మార్చి 11వ తేదీన 9.00 తీవ్రతతో వచ్చి అతి భారీ భూకంపంవల్ల ఉత్తర జపాన్‌లో తీవ్ర విధ్వంసం చెలరేగింది. దాదాపు 22,000 మంది ప్రజలు మరణించారు. ఐదు లక్షలమంది ప్రజలు ఇళ్ళు వదలి పారిపోయారు. వీరిలో చాలామంది ఇళ్ళు సునామీ కారణంగా ధ్వంసమయ్యాయి. ఫుకుషిమా దైచీ అణు విద్యుత్ కర్మాగారాన్ని సునామీ చుట్టుముట్టడంతో 1,60,000 మంది ప్రజలు ఫుకుషిమాలో ఇళ్ళు వదలి పారిపోయారు. అదేవిధంగా మరో 2.60 లక్షలమంది ప్రజలు తిరిగి ఇళ్ళకు వెళ్ళకుండా మరో ప్రాంతంలో స్థిరపడాల్సి వచ్చింది.

### ఏడుగురు కన్నబిడ్డలు సహా..

# పదిమందిని కాల్చి చంపిన తండ్రి

**బాటన్‌రూజ్ :** ఒక కన్నతండ్రి తన ఏడుగురు కన్న బిడ్డలు, బంధువుకాని మరో బిడ్డ సహా పదిమందిని కాల్చి చంపాడు. ఈ ఘటన అమెరికా లూసియానా రాష్ట్రం బాటన్ రూజ్‌లో జరిగింది. కుటుంబ కలహాల కారణంగానే కన్నతండ్రి ఈ విధంగా క్రూరంగా ప్రవర్తించాడని లూసియానా ష్రెవ్‌పోర్ట్ పోలీసు విభాగం ప్రతినిధి క్రిస్టోఫర్ బోర్డోలాన్ చెప్పారు. దాడికి గల కారణాన్నిపోలీసులు స్పష్టంగా చెప్పకపోయినప్పటికీ, భార్య,భర్త ఇద్దరూ విడాకులు తీసుకుంటున్నారని సమీప బంధువులు వెల్లడించారు. ఇలాంటి ఘోరమైన విషాదాన్ని తాను చూడలేదని ష్రెవ్‌పోర్ట్ మేయర్ టామ్ ఆర్సెనియాక్స్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2024 జనవరి తర్వాత అమెరికాలో జరిగిన అత్యంత దారుణమైన విషాద ఘటన మళ్ళీ ఇదే. ఐతే, తన అక్కతో కలిసి జీవిస్తున్న నిందితుడి బావమరిది ట్రాయ్ బ్రౌన్ వాషింగ్టన్ పోస్ట్‌తో మాట్లాడుతూ, భార్య విడాకులు కోరడంవల్ల తన



బావ మనస్తాపానికి గురయ్యాడని చెప్పారు. మొదటిసారి అక్క విడాకులు కోరిన తర్వాత తన బావ పిచ్చివాడిలా ప్రవర్తించాడని చెప్పారు. విడాకులు తీసుకోనున్న ఈ భార్యాభర్త నిర్ణీత ప్రకారం సోమవారం కోర్టుకు హాజరుకావాల్సి ఉన్న సమయంలో ఈ హింసాత్మక ఘటన జరిగింది. నిందితుడైన షమార్ ఎల్కిన్స్ కాల్పులు జరిపిన తర్వాత ఒక కారును దొంగిలించి దాంతో పరారీ అయ్యాడని, ఆ తర్వాత అతడి కోసం గాలించి వెంటాడి కాల్చి చంపినట్లు చెప్పారు. కాల్పుల్లో మరణించిన ఈ పిల్లలందరూ ఏడాది నుండి పద్నాలుగేళ్ళలోపు వయసుగల వారే. ఈ ప్రమాదంలో తల్లి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని పోలీసులు చెప్పారు. మొదట నిందితుడు వీధిలో ఒక మహిళను కాల్చి చంపి ఆ తర్వాత ఇంట్లోకి వెళ్ళాడు. కాల్పులకు గురైన బిడ్డలలో తొమ్మిదవ బిడ్డ ఇంటి పైకప్పుమీద నుండి కిందికి దూకి ఆసుపత్రికి వెళ్ళాడు. కాల్పుల ఘటన ప్రారంభం కాగానే కొందరు బంధువులు పరుగెత్తుకుంటూ వెళ్ళి పోలీసులకు ఫోన్ చేశారు.

## గాజా తరహాలో లెబనాన్‌లో ఇజ్రాయెల్ 'ఎల్లో లైన్' పునరుద్ధరణ

**జెరూసలెం :** దాదాపు ఇరవై ఆరు సంవత్సరాల తర్వాత లెబనాన్‌లో ఇజ్రాయెల్ మళ్ళీ దాదాపు 10 కి.మీ నిడివిగల బఫర్ జోన్ భద్రతా మండలాన్ని పునరుద్ధరించింది. కొద్దిరోజులుగా నెతన్యాహూ ప్రకటిస్తున్నవిధంగా గాజా తరహాలోనే ఇజ్రాయెల్ సైన్యం ఈ ఎల్లో లైన్ ఏర్పాటు చేసింది. గతంలో 1982–2000 కాలంలో లెబనాన్‌ను ఆక్రమించుకున్నప్పుడు ఇజ్రాయెల్ సైన్యానికి ఎదురైన కష్టాలు ఈసారి వచ్చే అవకాశం లేదని ఐడిఎఫ్ కమాండర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. దక్షిణ లెబనాన్‌లో తన సామ్రాజ్యాన్ని అక్రమంగా విస్తరించుకుంటూ బఫర్ జోన్ పెంచుకునే కుట్రలకు దిగిన ఇజ్రాయెల్ పది రోజుల కాల్పులు అమలులో ఉన్నతరుణంలోనే తన పనులు చక్కబెట్టుకుంటున్నది. హెజ్బొల్లా ఉగ్రవాదులు తమ భూభాగంలోకి రాకుండా రక్షణ వలయాన్ని పెంచుకుంటున్నామని వారు ప్రకటించారు. ఈ విషయాలు ప్రపంచానికి చాటిచెప్పేందుకు మీడియా బృందాన్ని కూడా ఆ ప్రాంతానికి ఐడిఎఫ్ కమాండర్లు తీసుకువెళ్ళారు. ఏప్రిల్ 19న ఈ ఎల్లో లైన్ లేదా భద్రతా మండలాన్ని ఇజ్రాయెల్ పునరుద్ధరించింది. గాజా తరహాలోనే ఈ ఎల్లో లైన్ కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన పేలుళ్ళలో ఒక ఇజ్రాయెల్ సైనికుడు మరణించడంతో లెబనాన్‌లో పూర్తిస్థాయి బలగాలను ప్రయోగించి హెజ్బొల్లాను అణచివేస్తామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ హెచ్చరించారు. లెబనాన్‌లో నలభై రోజులుగా యుద్ధం, దురాక్రమణ సాగిన తర్వాత ఈనెల 24 నుండి పది రోజుల కాల్పుల విరమణ ప్రారంభమైన తర్వాత ఇజ్రాయెల్ సైన్యంఈ భద్రతా మండలిని పునరుద్ధరించింది. ఇదిలా ఉండగా, మరోవైపు ఇజ్రాయెల్,పారిస్,అమెరికాలలో వందలమంది ప్రజలు నెతన్యాహూ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు జరిపారు.

## ఉక్రేన్, ఇరాన్ యుద్ధాలు ముగించండి : పోప్ విజ్ఞప్తి



**లుయాండా :** ఉక్రేన్–ఇరాన్ యుద్ధాలను దౌత్య మార్గాల ద్వారా విరమింపజేయాలని, శాంతిని కాపాడాలని పోప్ లియో–14 ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావాలన్నారు. చర్చలను పునరుద్ధరించాలని కోరారు. 11 రోజులు ఆఫ్రికాఖండ దేశాల్లో పర్యటిస్తున్న పోప్ అంగోలా, కామెరూన్‌లలో పర్యటించారు. లక్షలాదిమంది ప్రజలను ఉద్దేశించి ఆయన సామూహిక ప్రసంగాలు చేస్తున్నారు. యుద్ధ ప్రాంతాలలో తీవ్రమవుతున్న హింసపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్యపరమైన ప్రయత్నాలను ఆయన ప్రోత్సహించారు. అంగోలాలోని కిలాంబాలో ప్రార్థనల అనంతరం కొయెలీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉక్రేన్‌లో ఇటీవల మళ్ళీ యుద్ధ తీవ్రరూపం ధరిస్తోందని, ఈ దాడులు పౌరులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల తరపున ప్రార్థన చేశారు. ఆయుధాలు నిశ్శబ్దం పాటించాలన్నారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒక ఆశారేఖగా ఉందని అన్నారు. ఇదిలా ఉండగా నాలుగేళ్ళక్రితం ఉక్రేన్‌లో యుద్ధం మొదలైన తర్వాత తాజాగా రష్యా రిఫైనరీపై ఉక్రేన్ దాడి చేసింది. ఈ దాడుల్లో రష్యా రిఫైనరీ మంటల్లో దగ్ధమైంది. నల్ల సముద్రతీరం వెంట ఉన్న రష్యా మిలిటరీ, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రేన్ డ్రోన్ దాడులు చేస్తోంది. ఐతే ఆదివారం రాత్రికి రాత్రే 112 ఉక్రేన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా ప్రకటించింది.

# బల్గేరియా ఎన్నికల్లో రూమెన్ కూటమి గెలుపు

**సోఫియా :** బల్గేరియా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల తర్వాత సోమవారం మొదలైన ఓట్ల లెక్కింపులో మాజీ అధ్యక్షుడు రూమెన్ జార్జివ్ రాదేవ్ నాయకత్వంలోని "ప్రోగ్రెసివ్ బల్గేరియా కూటమి" విజయం సాధించింది. 87 శాతం ఓట్లు కౌటింగ్ పూర్తయ్యేసరికి పి.బి. కూటమి మెజార్టీని మించిన స్థాయిలో 135 సీట్లు గెలుచుకుంది.ఇంకా మరింత మెజార్టీ దిశగా కూటమి దూసుకుపోతోంది. 63 ఏళ్ళు వయసుగల రూమెన్ వైమానిక దళ మాజీ అధికారి. 2017 నుండి తొమ్మిది సంవత్సరాలపాటు దేశాధ్యక్షుడుగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో అవినీతి నిర్మూలనే ప్రధాన ఎజెండాగా ఉంది. ఇప్పటికే బల్గేరియా అతి తక్కువ సమయంలో ఎనిమిదిసార్లు ఎన్నికలను ఎదుర్కొంది, ఇకమీదట దేశాన్ని ఇలా సత్వర ఎన్నికలకు వెళ్ళనివ్వకుండా అడ్డుకుంటాం" అని ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడైన తర్వాత రూమెన్ మీడియా వద్ద వ్యాఖ్యానించారు.

దేశంలో ఒక స్థిరమైన,క్రమబద్ధమైన ప్రభుత్వం కొనసాగేలా ప్రత్యామ్నాయాలను తాము పరిశీలిస్తామన్నారు. బల్గేరియాలో రాజకీయ సంక్షోభం కారణంగా గడచిన ఐదు సంవత్సరాలలో పార్లమెంటుకు ఏడుసార్లు ఎన్నికలు జరగ్గా, ఇప్పుడు ఎనిమిదోసారి జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు చేస్తున్నారు. ఎన్నికల పోలింగ్ తర్వాత విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్‌లో కూడా రుమెన్ రదేవ్ విజేతగా నిలిచారు. పూర్తయింది. ఆదివారం జరిగిన పోలింగ్



ప్రక్రియలో రికార్డుస్థాయిలో 60 శాతం ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దేశంలో మొత్తం 60.60 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. 14 రాజకీయ పార్టీలు, 10 రాజకీయ కూటమిలకు చెందిన 4,700 మంది అభ్యర్థులు అధికార స్థానాలకోసం పోటీపడ్డారు. ఏ పార్టీ అయినా ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 240 స్థానాలున్న పార్లమెంటులో 121 స్థానాలు గెలుచుకోవాల్సి ఉంటుంది. "ఉయ్ కంటిన్యూ ద ఛేంజ్ డెమోక్రటిక్ బల్గేరియా" కూటమి, సంప్రదాయబద్ధ బోయ్కో బోరిసోవ్‌కు చెందిన సంప్రదాయబద్ధ గెర్బ్ కూటమిలను అధిగమించి పిబి కూటమి ముందంజలో ఉంది.

# ఊడగొడతా





(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. 'రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? అని ప్రశ్నించారు.

**పాపాల భైరవుడు మళ్లీ ఎందుకు రావాలి?**

ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలి అని ఒక పెద్దమనిషి అంటున్నారు. ఫామ్‌హౌస్‌లో పడుకునే పాపాల భైరవుడు మళ్లీ ఎందుకు రావాలి? లక్షలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ జెండా మోస్తే.. ఈ ప్రభుత్వం వచ్చింది. పాపాల భైరవుడు ఎందుకు రావాలో.. పార్టీ మారుతున్న పెద్దమనిషి చెప్పాలి. జీవన్ రెడ్డి చరిత్ర, ఆయన వెనకున్న మచ్చలన్నీ నాకు తెలుసు. 40 ఏళ్ల పాటు తన కుటుంబానికి ఎన్నో పదవులు ఇచ్చుకున్నారు. 14 సార్లు కాంగ్రెస్ బీ ఫామ్ ఇస్తే.. మోసం చేసి వెళ్లిపోయారు. ఓడిపోయినప్పటికీ ఎన్నోసార్లు పదవులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఆయన్ను గౌరవించింది. ఏడాదిపాటు పదవి లేకపోతే జీవన్‌రెడ్డి కార్యకర్తల గుండెలమీద తన్ని శత్రువు పంచన చేశారు.

**ఒక్కరికి పదవి రాకపోతే..ప్రజా ప్రభుత్వం పోవాలా?**

70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినందుకు ప్రజాప్రభుత్వం పోవాలా? ఒక్కాయనకు పదవి రాకపోతే.. ప్రజాప్రభుత్వం పోవాలా? నేరెళ్లలో ఎస్సీలను ఇసుక లారీలతో తొక్కించినందుకు పాపాల భైరవుడు మళ్లీ రావాలా? వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నారు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా?పేదలు.. దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలు పంచారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి.. పదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కేసీఆర్.. నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ బహిరంగ సభలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరు లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, ఎంపీ వంశీకృష్ణ, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మక్కాన్సింగ్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ నాయకులు పంతకాని సమ్మయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వమే వస్తది

(మొదటి పేజీ తరువాయి)



అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల లోపే రాష్ట్ర ఆర్థిక ఆదాయం దిగజారి పోయిందన్నారు. రైతులు పండించిన పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ మాటలు మాట్లాడం తప్ప ఇంతవరకు కార్యాచరణ లేదన్నారు. పల్లెల పరిస్థితి చాలా అధ్వాన్నంగా తయారైందని జిపిలకు నిధులు విడుదల చేయకపోవడంతో ట్రాక్టర్లు మూలకు పడ్డాయన్నారు. ఇలాంటి పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని ప్రజలు ఆలోచించి రానున్న రోజుల్లో కాంగ్రెస్ పోవాలి బిఆర్ఎస్ రావాలి అనే నినాదంతో ముందుకు సాగాలని కోరారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం చాలా బాధాకరమన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ నాయకులు విలువైన భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మెదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పారేసేలా తొలి సంతకం చేసి నిరుపేదలకు అండగా నిలుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు 420 హామీల పేరుతో ప్రజలను మోసాలకు గురిచేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చేరిన జీవన్ రెడ్డి సేవలు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి ఎంతో అవసరమన్నారు. తక్షణమే పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు సభలో ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర రావు, ఎమ్మెల్సీ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవి శంకర్, వేముల వాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మి నరసింహా రావు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, నాయకులు బాల్క సుమన్, పుట్టమధు, రసమయి బాల కిషన్, దాసరి మనోహర్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, రాజేశం గౌడ్, లోక బాపు రెడ్డి , దేశ్‌పతి శ్రీనివాస్, జీవన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, నారదాసు లక్ష్మ ణ్ రావు, రవీందర్ రావు, మధుసూదనా చారి తదితరులు ఉన్నారు.

## బాంబు దాడులు

(మొదటి పేజీ తరువాయి)

టైమ్స్ పత్రిక రాసిన వార్తకు ట్రంప్ పైవిధంగా వివరణ ఇచ్చారు.దీనికి ముందుగా న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చర్చలకు మరింత ప్రోత్సాహం కలిగించే సానుకూల ప్రకటన చేశారు. తమ ప్రతినిధుల బృంద సభ్యులు ముగ్గురూ చర్చల నిమిత్తం ఇస్లామాబాద్‌కు బయలుదేరుతున్నారని, చర్చల్లో పురోగతి కనిపిస్తే తాను కూడా ఇస్లామాబాద్ వెళ్ళి ఇరాన్ నాయకులను కలుసుకోవాలనుకుంటున్నానని ప్రకటించారు.ఒక వైపు దిగ్బంధనం విధించి, ఇరాన్ నౌకను స్వాధీనం చేసుకుని, గడువు చూ పించి యుద్ధ బెదిరింపు చేస్తూ మరోవైపు ఆయన శాంతిదూతలా మాట్లాడుతుండగా, ట్రంప్ స్వ యంగా మన దేశానికి వస్తున్నారంటూ పాకిస్థాన్ ప్రభుత్వం రెండు రోజులుగా ప్రచారం చేస్తూ ఇస్లామాబాద్–రావల్పిండి నగరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. జన జీవనాన్ని కూడా ఆ ప్రాం తంలో స్తంభింపజేసింది. మరో 24 గంటల్లో (ఏప్రిల్ 22) అమెరికా–ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ముగింపు, ఇరాన్‌పై ట్రంప్ యుద్ధ హెచ్చరికల పూర్వరంగంలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ దశలో చమురు ధరలు మళ్ళీ పెరిగాయి. చర్చలకు హాజరయ్యేందుకు తొలుత తిరస్కరించినప్పటికీ, ఇరాన్ ఇంకా పూర్తి నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ ప్రకటించింది.ట్రంప్ ప్రకటించిన విధంగా నిర్ణీత ప్రకారం చర్చల్లో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం అమెరికా ప్రతినిధులు ఇస్లామాబాద్‌కు చేరుకుంటారు.ఇరాన్ నాయకుల నుండి మిశ్రమ స్పందనలు వెలువడుతున్నందువల్ల ఈ చర్చల అవకాశాన్ని ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోదని,వారు కూడా మంగళవారం ఉదయం నాటికి ఇస్లామాబాద్ చేరుకుంటారని పాకిస్థాన్ గట్టి విశ్వాసంతో ఉంది.వేలాది మంది భద్రతా సిబ్బందిని మోహరించిన పాకిస్థాన్ విదేశీ ప్రతినిధుల రక్షణకోసం గట్టి నిఘా ఏర్పాటు చేసింది.అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,వాషింగ్టన్ అగ్రశ్రేణి ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ ఇరాన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నారు. ఐతే తన ప్రతినిధులను ఇస్లామాబాద్‌కు పంపుతున్నట్లు సోమవారం రాత్రి వరకూ ఇరాన్ ప్రకటించలేదు. అమెరికా–ఇరాన్ మధ్య పాకిస్థాన్ ఒక్కటే ఏకైక అధికారిక మధ్యవర్తి అని గుర్తిస్తూ ప్రకటన చేసిన ఇరాన్, దౌత్య చర్యల్లో అమెరికాకు చిత్తశుద్ధి లేదని, విశ్వసనీయత కనిపించడంలేదని విమర్శించింది. కాల్పుల విరమణ ఉల్లంఘన, బెదిరింపులు, తమ ఓడరేవుల దిగ్బంధం, యుద్ధ పరిస్థితుల వల్ల హోర్ముజ్ జలసంధి ప్రపంచ హవాణిజ్య నౌకల రవాణాకోసం ఏకపక్షంగా తెరచుకునే అవకాశమే లేదని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయిా హమ్‌నేహ్ సోమవారం ప్రకటించారని తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది. చర్చలకు వెళ్ళబోమని బఘాయిా మొదట చెప్పారు. కానీ హోర్ముజ్‌లో దాడులు–ప్రతిదాడులతో మళ్ళీ ఉద్రిక్తతలు పెరుగుతాయన్న అంచనాల మధ్య, "చర్చలు కొనసాగిస్తున్నాం, ఐతే తమ కార్గో నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా దళాలపై తగిన ప్రతీకార చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ ఘాలిబాఫ్ ఒక ప్రకటన చేశాక, చర్చలకు వెళ్ళాలా?వద్దా? అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని బఘాయిా చెప్పారు.

**మూసినా–తెరిచినా మాకు నష్టం లేదు:** ట్రంప్

హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచినా, తెరచి ఉంచినా అమెరికాకు ఎలాంటి నష్టం లేదని ట్రంప్ అన్నారు. మూసివేత వల్ల ఇరాన్ ప్రతి రోజూ 5000 డాలర్లు నష్ట పోతుందని అన్నారు. హోర్ముజ్‌లో బుల్లెట్లు కురిపించడం ద్వారా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడాలని ఇరాన్ నిర్ణయించుకుందన్నారు. హోర్ముజ్‌లో నౌకలను పూర్తిగా అడ్డుకుని పరోక్షంగా ఇరాన్ మాకు సహాయం చేస్తోందన్నారు.

మూసివేత వల్ల వారే పూర్తిగా నష్టపోతారు, నిజానికి మా నౌకలన్నీ ఇప్పటికే అలాస్కా,లూసియానా,టెక్సాస్‌కు చేరుకుని లోడింగ్‌కోసం సిద్ధంగా ఉఆన్నయి, అందువల్ల ఐఆర్‌జిసికి నా అభినందనలు తెలియజేస్తున్నా, వారు అలా మూర్ఖంగా ఉండాలని కోరుకుంటున్నా, మేం చాలా హేతుబద్ధమైన,న్యాయబద్ధమైన ఒప్పంద ప్రతిపాదన చేశాం, వాళ్ళు స్వీకరిస్తారని కోరుకుంటున్నా, లేకపోతే ఇరాన్ ఓడరేవులపై మా దిగ్బంధనం కొనసాగుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా టాస్ వార్తాసంస్థ వేసిన అంచనా ప్రకారం, గడచిన వారం రోజుల్లో 40 నౌకలు హోర్ముజ్ జలసంధిని దాటి వెళ్ళాయి. వీటిల్లో ఏప్రిల్ 18న రికార్డుస్థాయిలో 37 నౌకలు హోర్ముజ్‌ను దాటి వెళ్ళిపోయాయి. సముద్ర రవాణా కదలికలను పర్యవేక్షించే వ్యవస్థల ద్వారా ఈ సమాచారం సేకరించినట్లు టాస్ పేర్కొంది. అంతకుముందు ఏప్రిల్ 14న 16 నౌకలు జలసంధి దాటి వెళ్ళాయని తెలిపింది. హోర్ముజ్ మూసివేతను పునఃప్రారంభిస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడానికి ముందు ఏప్రిల్ 19న ఎనిమిది నౌకలు జలసంధి దాటి వెళ్ళాయని తెలియజేసింది.

**తౌస్కా నౌక అమెరికా స్వాధీనం ఇరాన్ ప్రతీకార దాడులు?**

హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలను స్తంభింపజేసిన అమెరికా చర్యలను ఇరాన్ ప్రతిఘటించడంతో మళ్ళీ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అమెరికా దళాల చర్యను చైనా ఖండించింది. తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్ కార్గో నౌక 'తౌస్కా'ను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నట్లు అమెరికా దళాలు ప్రకటించాయి. ఐతే ఈ నౌకను స్వాధీనం చేసుకునే దశలో ఇరాన్ సిబ్బంది పెద్దగా ప్రతిఘటించలేదు. ఎందుకంటే ఆ సమయంలో ఆ నౌకలో నావికా సిబ్బంది కుటుంబీకులు కూడా ఉన్నారు. వారి భద్రతను ఆశించే తమ నౌకాదళ సైన్యం అమెరికా దళాలను ప్రతిఘటించలేదని ఇరాన్ సైనిక దాడులను పర్యవేక్షించే ఐఆర్‌జిస ఖతమ్ అల్–అన్బియా కేంద్ర కార్యాలయం నుండి సోమవారంనాడు ఒక ప్రకటన వెలువడింది. వారిపై తదుపరి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది.

అమెరికా యుద్ధనౌకల నిఘా దిగ్బంధనాన్ని ఉల్లంఘించిన ఇరాన్ కార్గో నౌక 'తౌస్కా' శరవేగంగా వెళ్ళిపోతూ ఉండటంతో యుఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధ నౌకలో ఉన్న అమెరికా ఉభయచర నైపుణ్య సైనిక దళాలు హెలికాప్టర్ ద్వారా నౌకను వెంబడించాయి. తాళ్ళ ద్వారా నౌకలోకి దిగి తక్షణం యూ టర్న్ తీసుకోవాలని ఇరాన్ జెండాతో వెళుతున్న నౌకా సిబ్బందిని తుపాకులతో హెచ్చరించారు. నౌకను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. దీంతో ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్యకు ప్రతి చర్యలు తీసుకుంటామని, అమెరికా తగిన మూల్యం చెల్లిస్తుందని ఇరాన్ సైన్యం హెచ్చరికలు చేసింది. ఇరాన్ నాయకత్వం కూడా ఇదే హెచ్చరికలు చేయడంతో మళ్ళీ ఏదోవిధంగా యుద్ధ దాడులు ప్రారంభమవుతాయన్న వాతావరణం నెలకుంటున్నది.

# రైల్వే భద్రతపై రాజీ లేదు

జిఎం సంజయ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు కార్యకలాపాలలో భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలని, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో సోమవారం నిర్వహించిన సమగ్ర భద్రతా సమీక్షా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధికారులు పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిఎం అధికారులను ఆదేశించారు. అన్ని రైల్వే స్టేషన్లు, రైళ్లలో తాగునీటి సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవడంతో పాటు టాయిలెట్ల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. అగ్నిమాపక భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని, రైళ్ల సురక్షిత ప్రయాణానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాక్‌ల వద్ద పాయింట్లు, క్రాసింగ్‌ల భద్రతా తనిఖీలను పర్యవేక్షించాలని, లోకో పైలట్లు మరియు రైలు మేనేజర్లకు వాకీటాకీలు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ప్రైవేట్ సైడింగ్‌లలో సిసిటివి వ్యవస్థల పనితీరును కూడా సమీక్షించారు.పని ప్రదేశాలలో సిబ్బంది భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలని జీఎం ఆదేశించారు. ట్రాక్‌పై అక్రమ ప్రవేశాన్ని అరికట్టేందుకు, ముఖ్యంగా మానవ రహిత లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి కాలంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జోన్ అధికారులకు జనరల్ మేనేజర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంటరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంటరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై త్వరలోనే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' పేరుతో సిఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. రానున్న ఎంపిటిసి జెడ్‌పిటిసి ఎన్నికల్లో ఓట్ల కోసమే 'రైతు భరోసా' నిధులను విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలంటే రీయింబర్స్‌మెంట్, సాల్కర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని,లేదంటే విద్యార్థుల తల్లి దండ్రులు ఎవ్వరూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకుండా విద్యార్థులతో ప్రచారం చేస్తామని వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం ఫీజుల కోసం వేధించడంతో ఇటీవల రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం శ్రీఇందు కళాశాల విద్యార్థి ప్రణీత్ ఆత్మహత్య చేసుకున్నారని, ఇది ముమ్మాటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హత్యనే అని వారు ఆరోపించారు. విద్యార్థి ఆత్మహత్య కారణమైన శ్రీ ఇందు కళాశాల యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. బకాయిలను విడుదల చేయకుండా ఢిల్లీ పర్యటనలకు, కేరళ ఎన్నికల ప్రచారానికి, అందాల పోటీలకు నిధులు వృధా చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత విద్య కోసం నిధులను విడుదల చేయకపోతే ఈ ప్రభుత్వం ఎందుకని,? నిధులు విడుదల చేయలేని రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో బిసిలకు సరియైన వాటా దక్కాలంటే బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని జలసౌధ వద్ద బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని సవరించి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించిన విధంగానే బిసి ఉద్యోగులకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. 60 శాతం ఉన్న బిసిలకు ఉద్యోగ రంగాలలో 18 శాతం కూడా ప్రాతినిధ్యం లేదని, బిసి ఉద్యోగుల ప్రాతినిధ్యం జనాభా దామాషా ప్రకారం దక్కాలంటే ప్రమోషన్ల లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే బిసి ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపుని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేశ బోయిన రమ, కోటాజి, రాధారాణి, వారాల శ్రీనివాస్, జ్యానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# "కాళేశ్వరం" దోషులను వదిలేదిలేదు

దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళతాం

కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవడంతోపాటు తమ్మిడిహట్టి ప్రాజెక్టును సైతం నిర్మిస్తాం

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**(కాళేశ్వరం నుంచి బి.అంజన్‌కుమార్)**



కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవడంతోపాటు తమ్మిడిహట్టి ప్రాజెక్టును సైతం నిర్మిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలకు సంబంధించిన దోషులను వదిలేదిలేదని, దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళతామని సిఎం ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కూడా ఊరికే వదలబోమని, రిపేర్లు చేసి నీరు అందిస్తామని చెప్పారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో ఆర్థిక, రాజకీయ ప్రయోజనం లేదని, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాజెక్ట్ పేరు, ప్రాంతం, అంచనాలు మార్చి లక్ష కోట్లు ఖర్చుపెట్టి కనీసం లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. వర్షాకాలం రాకముందే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) సూచనల ప్రకారం మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిపోయిన 7వ నంబర్ పిల్లర్‌ను, బ్యారేజ్ మరమ్మతులు యుద్ధప్రాతిపాదికన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. నిధుల కొరత లేకుండా చూస్తామని సిఎం హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన, ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజీని మంత్రుల బృందంతో కలిసి ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. బ్యారేజీని సందర్శించిన అనంతరం బ్యారేజీ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు.

అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ "గత ప్రభుత్వ వైఫల్యాల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి పట్టిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ్మిడిహట్టి వద్ద ఉమ్మడి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.11,700 కోట్లు ఖర్చు పెట్టి దానిని గాలికి వదిలేసి ఆగమేఘాలపై కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు 2019లో పూర్తయినట్లుగా ప్రారంభించిన అప్పటి ప్రభుత్వం నిర్వహణను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో 2020లో లీకులు ఏర్పడ్డాయి. ఈ అంశాలను ఇంజనీర్లు ప్రభుత్వం దృష్టికి, నిర్మాణ సంస్థ దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం పట్టించుకోలేదు.

ఫలితంగా 2023 అక్టోబర్‌లో పగుళ్లు ఏర్పడ్డాయి. అయినా ఈ అంశాలను అప్పటి ప్రభుత్వం దాచిపెట్టింది. దీంతో ప్రకృతి ప్రకోపించడంతో బ్యారేజ్ కుంగి

### బిజెపి నేతల కాళ్లు పట్టుకునేందుకు ఢిల్లీకి హరీశ్

కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని తెలిసి బిజెపి నేతల కాళ్లు పట్టుకునేందుకు బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు ఢిల్లీకి పరుగెత్తాడని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బిజెపిని అడ్డం పెట్టుకుని అవినీతి కేసుల నుంచి బయటపడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళతామని సిఎం చెప్పారు. "మాజీ మంత్రి హరీశ్ తెలివి ఉండి మాట్లాడుతున్నాడో, తెలివి లేక మాట్లాడుతున్నాడో తెలియదు. శ్రీపాద ఎల్లంపల్లి ఈ ప్రాజెక్టుకు పాణవాయువు. హరీష్ రావు నిక్కర్ తొడక్కముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉంది. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంట పండించారు" అని సిఎం వివరించారు. "కాళేశ్వరం విచారణపై సిబిఐ ఎందుకు మౌనంగా ఉంది? మేం పదే పదే లేఖలు రాసినా ఎందుకు స్పందిచడం లేదు? హరీష్ రహస్య పర్యటన వెనక మతలబు ఏంటో తెలంగాణ ప్రజలకు చెప్పాలి. ఢిల్లీలో హరీశ్‌రావు ఎవరెవరిని కలిశారో హరీష్ బయటపెట్టాలి. జడ్జిమెంట్ ప్రకటించకముందు వాదించడానికి వీలుండదు. మరి న్యాయవాదులను కలవడానికి వెళ్లాల్సిన అవసరం ఏముంది" అని సిఎం అన్నారు.

అసలు విషయం బయటపడింది. టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుకు సంబంధించిన నాణ్యత లోపాలను ఎన్‌డిఎస్‌ఎతో పాటు విజిలెన్స్ అందజేసిందని అయినా గత ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు" అని సిఎం వివరించారు. కాళేశ్వరం దోపిడీపై జస్టిస్ పిసి ఘోష్ కమిటీ సంపూర్ణ నివేదిక ఇచ్చిందని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించాలని కేంద్రానికి తీర్మానం పంపించామన్నారు.

కెసిఆర్, హరీష్‌రావులను జైల్లో వేయాలని, ఈ కేసును సిబిఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారని, కానీ కేంద్రప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం వహించిందని సిఎం విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించిందని, నెలరోజుల ముందే అధికారులతో, సాంకేతిక నిపుణులతో నేడు సమావేశం ఏర్పాటు చేసుకోగా నిజాలు బయట పడతాయని తెలిసి కావాలని బిఆర్‌ఎస్ నేతలు పొలిటికల్ మీటింగ్ పెట్టుకున్నారన్నారు. అయినా మేం అనుమతులు ఇచ్చామన్నారు.

**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఒక స్పష్టత వచ్చింది**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఒక స్పష్టత వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన, ప్రస్తుతం వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజీని మంత్రుల బృందంతో కలిసి ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. కుంగిపోయిన 7వ నంబర్ పిల్లర్‌తో పాటు పగుళ్లు ఇచ్చిన ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి తాజా పరిస్థితులపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, గడ్డం వివేక్, ఎంపి గడ్డం వంశీ కృష్ణ, ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ అనిల్ జైన్, ఉన్నతాధికారులు ఈ పర్యటనలో సిఎం ఉన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద పియర్స్ 20, 21, 22 వద్ద బోర్ రిగ్స్ ద్వారా జియో టెక్నికల్, జియో ఫిజికల్, జిపిఆర్, శాంపిల్స్ సేకరణను సిఎం, మంత్రులు పరిశీలించారు. 520 బోర్ రిగ్స్ ద్వారా శాంపిల్స్ సేకరించి సిడబ్ల్యుపిఆర్‌ఎస్‌కు పంపనున్నామని, అక్కడ ల్యాబ్‌లో పరీక్షల అనంతరం బ్యారేజ్ డ్యామేజీపై పూర్తి అవగాహన రానుందని సిఎంకు అధికారులు వివరించారు. డ్రోన్ ఆధారిత జిపిఆర్ టెస్ట్‌కు సంబంధించిన విషయాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ టెస్ట్ ద్వారా 20 నుంచి 30 మీటర్ల లోతు వరకు పియర్స్ వద్ద నేల స్వభావానికి సంబంధించి ఫలితాలను తెలుసుకోవచ్చని సిఎంకు అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద సీకేంట్ పైల్స్‌కు సంబంధించి ప్యారలల్ క్రాస్ హోల్ సెస్మిక్ టెస్ట్ వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. బ్యారేజీని సందర్శించిన అనంతరం బ్యారేజీ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో సిఎం మాట్లాడుతూ సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని, సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న అనంతరమే అధికారులు పనులు మొదలు పెట్టాలని, సేకరించిన శాంపిల్స్ రిజల్ట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సిఎం సూచించారు. ఎన్‌డిఎస్‌ఎ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని, ప్రతీ పనిలో ఎన్‌డిఎస్‌ఎ అప్రూవల్ తీసుకుని పనిచేయాలన్నారు.

**రూ.198 కోట్లతో కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టనున్న ముక్తేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. అనంతరం కాళేశ్వరం బస్ స్టేషన్ నిర్మాణానికి కూడా సిఎం శంకుస్థాపన చేశారు.



## పర్యాటక ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి.. అందుబాటులోకి తేవాలి

పర్యాటకులు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలి

అధునాతన బోట్లను అందుబాటులోకి తీసుకురావాలి

పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రాయోజిత, ప్రభుత్వ ప్రవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలోను ఇప్పటికే చేపట్టిన, ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. హిమాయత్‌నగర్‌లోని పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) కార్యాలయంలో చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి ఆయన పర్యాటకశాఖపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ పర్యాటక ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనుల ప్రగతి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అంతేగాక వివిధ పర్యాటక ప్రాజెక్టులను ఎప్పటిలోగా పనులు ప్రారంభించి ఎప్పటికి లోగా పూర్తిచేసేది నెలవారీ టైం లైన్ వివరరాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో రూ.274.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల పురోగతిని జిల్లా వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, కొత్త ప్రాజెక్టులకు డిపిఆర్‌ల తయారీ, నూతన కాటేజీల నిర్మాణం, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాద్, సాస్కీ, సిడిబిడి ద్వారా చేపట్టిన పనులు నిధుల విడుదల, 6 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలైన ఆధ్యాత్మికం, వారసత్వం, ఎకోవెల్నెస్, హస్తకళలు, జల, బౌద్ధ సర్క్యూట్ల కోసం సమగ్ర మాస్టర్ ప్లాన్‌ల రూప కల్పన, నాగార్జున సాగర్, రామప్పవరంగల్, యాదగిరిగుట్టపోచంపల్లి, సోమశిల, ఆలంపూర్ ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్, కొత్త బోటింగ్ యూనిట్ల ప్రతిపాదనలు, గిరిజన పర్యాటకం, హరిత హోటల్స్ నిర్వహణ మరమ్మతులు, హౌస్ బోట్లు, కల్చరల్ టూరిజం, రవాణా సౌకర్యం, మౌలిక వసతుల కల్పన, తదితర అంశాలపై మంత్రి జూపల్లి అధికారులతో చర్చించారు. ఎత్తైన ప్రాంతాల్లో, అనువైన వాటర్ బాడీస్ వద్ద రష్యా, చైనా వంటి దేశాల్లో ఉన్న క్యాంటీ లివర్ వ్యూ పాయింట్స్ (గ్లాస్ స్ట్రక్చర్స్) ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... 2047 నాటికి రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సిఎం ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని, విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని మంత్రి అధికారులకు దిశానిర్ధేశం చేశారు. పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దుతూ, పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం సృష్టించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేసేందుకు అనేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. దేశవ్యాప్తంగా టూరిజం అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉండాలనేది తమ టార్గెట్ అని పేర్కొన్నారు.

## ప్రతి మనిషి సమానమే అనే భావనను వ్యాప్తి చేయడానికి.. 'బసవేశ్వరుడు' తన జీవితాన్ని అంకితం చేశారు




మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో కుల వివక్షను నిర్మూలించడానికి, ప్రతి మనిషి సమానమే అనే భావనను వ్యాప్తి చేయడానికి బసవేశ్వరుడు తన జీవితాన్ని అంకితం చేశారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బసవేశ్వరుని సంకల్పంతోనే రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ద్వారా ముందుకు కదిలారని చెప్పారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపి సురేష్ శెట్కర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, హైదరాబాద్ సిపి సజ్జనార్, బిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, మాజీ ఎంపి బిబి పాటిల్, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం, నైతిక విలువలతో కూడిన జీవన విధానాన్ని బోధించిన మహానుభావుడు బసవేశ్వరుడు అని కొనియాడారు. బసవేశ్వరుని ఆలోచన విధానంలో మారుతున్న కాలానికి అనుగుణంగా వారి జీవితాన్ని, సంకల్పాన్ని, వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కాయకమే కైవల్యం అనే ఆయన సందేశం ద్వారా కష్టపడి పనిచేయడం, స్వీయ గౌరవంతో జీవించడం అనే విలువలను ప్రజలకు అందించారన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించాలనే ఆలోచనతో ఆయన చేసిన సంస్కరణలు నేటికీ ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్నాయని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమైనదని, న్యాయం, సమానత్వం, ధర్మం అనే మూడు సూత్రాలతో ఆయన చూపిన మార్గం ప్రస్తుత తరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, బసవేశ్వర భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు.

దీనిలో ప్రభుత్వమే కాదు, బసవేశ్వర వారసులు భాగస్వామ్యం కావాలని, వచ్చే తరం బసవేశ్వరుని ఆలోచన విధానాలు తెలియజెప్పుదామని సూచించారు. ప్రజలందరూ బసవేశ్వరుడు బోధించిన విలువలను ఆచరణలో పెట్టి, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## బసవేశ్వరుడి స్ఫూర్తితో నూతన రాజకీయ పార్టీ

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బసవేశ్వరుడి స్ఫూర్తితో తాము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీ సామాజిక న్యాయం కోసం పనిచేస్తుందని, మహిళలకు 33 శాతం పదవులను, టికెట్లను కేటాయిస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందకుండా అనేక శక్తులు కుట్రలు చేసి అడ్డుకున్నాయన్నారు. 'బసవేశ్వరుడి 839వ జయంతి' హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పైన ఉన్న బసవేశ్వరుని విగ్రహానికి కవిత సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కుల, వర్ణ, లింగ బేధాలు లేకుండా సమానత్వం ఉండాలని ఆరోజుల్లోనే బసవేశ్వరుడు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ మహిళలకు ఎనిమిది సీట్లు కేటాయిస్తే, మరో పార్టీ పది సీట్లను కేటాయించిందని, తద్వారా మొత్తంగా అసెంబ్లీలో ఎనిమిది మంది మహిళా ఎంఎల్‌ఎలు ఉన్నారని కవిత తెలిపారు.



## ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్‌ఆర్‌టిసిలో ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మె జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మెను నివారించేందుకు కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 9 కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టి సంపూర్ణంగా ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారని, ప్రభుత్వ విధానాల వల్ల సమ్మె చేయాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఆర్‌టిసి జెఎసి నాయకత్వాన జరుగుతున్న ఈ సమ్మెను పరోక్షంగా విచ్ఛిన్నం చేసే కుట్ర ఒక కార్మిక సంఘం ప్రయత్నిస్తుండటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నిత్యం కార్మికుల ఐఖ్యత వర్ధిల్లాలన్న కార్మిక సంఘాల నేతలే ఆర్‌టిసి సమ్మె విచ్ఛిన్నం కావాలని, విఫలం కావాలని పరోక్షంగా కోరుకుంటూ కార్మికవర్గానికి తీవ్రమైన నష్టం కల్గిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆర్‌టిసి జెఎసికి ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి అన్ని జిల్లాల్లో, అన్ని డిపోలలో కార్మికులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణమైన మద్దతు, సంఘీభావం తెలపటమే కాకుండా ప్రత్యక్షంగా ఈ సమ్మెలో పాల్గొని, సమ్మెను విజయవంతం చేస్తామని ఆయన చెప్పారు. ఆర్‌టిసి జెఎసి కూడా మొక్కవోని ధైర్యంతో ఈ సమ్మెను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సమ్మెను విజయవంతం చేయాలని, అన్ని కార్మిక సంఘాలను, అన్ని రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య వాదుల, ప్రజా సంఘాల, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల సహకారం, తోడ్పాటుతో ఈ సమ్మె చరిత్రలో నిలిచిపోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమ్మెను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా మహాలక్ష్మి పథకం మహత్తరంగా నడిపేందుకు ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, ఈ సమ్మెను ఆపేలా చర్యలు చేపట్టాలని ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు.


## 'సెన్సెస్ శిక్షణ' తరగతులు ఉదయం సమయంలోనే నిర్వహించాలి

ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాలుల నేపథ్యంలో 'సెన్సెస్ శిక్షణ' తరగతులను రోజంతా కాకుండా కేవలం ఉదయం సమయంలోనే నిర్వహించాలని 'జనగణన' తెలంగాణ రాష్ట్ర డైరక్టర్‌ను ఎస్‌టియు టిఎస్ కోరింది. ఈ మేరకు సోమవారం ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ హైదరాబాద్‌లో 'జనగణన' తెలంగాణ రాష్ట్ర డైరక్టర్ భారతి హొళికెరిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ మొదటి దశ గృహాల జాబితా, గృహగణన కింద ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులకు నాలుగు దశల్లో మే 5వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతుందని, వడగాలులు వీస్తున్నాయని, ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయని వివరించారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచించిన నేపథ్యంలో, రోజంతా జరిగే శిక్షణ తరగతుల వల్ల ఉపాధ్యాయుల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం సమయంలోనే శిక్షణ తరగతులను నిర్వహించాలని వారు కోరారు.

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఫోన్ నెం. 0878-2243438, ఫ్యాక్స్ నెం. 0878-2240624, ఇమెయిల్: knrcmnr@rediffmail.com
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్
NIT No. E1/DB/MCK/8201/262/MCK/2026-27 తేది: .04.2026
కరీంనగర్ పరిధిలో వివిధ గ్రాంట్ల కింద 7 రకాల అభివృద్ధి పనులు మొత్తం అంచనా వ్యయం రూ. 30.04 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 20.04.2026న సా.4.00గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 28.04.2026న సా.4.00గం.లకు, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 1048-PP/CL/ADVT/2026-27, Date: 20-04-2026

**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, కాప్రా సర్కిల్-7, ఎంఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. MMC/KC-7/E/3/2026-27 తేది: 18.04.2026
క్ర.సం.1, NIT No. MMC/KC-7/E/3/2026-27, తేది: 18.04.2026, పని పేరు: ఎంఎంసి, కాప్రా సర్కిల్-7లో సివిల్ పనులు (1 నెం.లు), మొత్తం విలువ: రూ.20.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 20.04.2026న మ.3.00గం.లకు, బిడ్ సమర్పణకు ఆఖరి తేది: 23.04.2026న మ.3.00గం.ల వరకు, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 23.04.2026న మ.3.00గం.ల వరకు, ప్రైస్ బిడ్ ప్రారంభ తేది: 23.04.2026న మ.3.01గం.ల నుండి, కార్యాలయం పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-7, ఎంఎంసి, ఇసిఐఎల్, హైదరాబాద్. ఫోన్ నెం. 8790374055. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-7, ఎంఎంసి.
DIPR R.O. No. : 1056-PP/CL/ADVT/2026-27, Date: 20-04-2026



## జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి

ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని,సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు చేరవేస్తూ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపే జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రెస్ అకాడమీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆయన రాకను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.ప్రెస్ అకాడమీ ద్వారా జర్నలిస్టులకు మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, వారి వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మరింత చేయూత అందించాలని,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ ప్రతినిధులు,పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

కోదాడలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామీణ జల సరఫరా, మున్సిపల్ ఇంజనీరింగ్, ప్రజా ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోదాడ పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న తాగునీటి, పారిశుద్ధ్య, రహదారి, మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిపై విపులంగా ఆరా తీశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమయానికి అందేలా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం కాలువల సమస్యల పరిష్కారం, పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్న పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొని తమ తమ విభాగాల పనుల పురోగతిని వివరించారు.

## నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/యాదాద్రి :** పాఠశాలలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో సోమవారం భువనగిరి కేంద్రంలో కేజీబీవి బాలికల పాఠశాలను సందర్శించారు. మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యత ను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో ఉండాలని తెలిపారు.పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్యం పరిస్థితిని పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోడలి ఆత్మహత్యకు కారణమైన మామ అరెస్టు..



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కోడలిపై వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని టు టౌన్ సీఐ రాఘవరావు హెచ్చరించారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూనాంపల్లి మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన ఐశ్వర్య(20)కు ఐదు నెలల క్రితం పానగల్లుకు చెందిన శివశంకర్‌తో వివాహం జరిగిందని తెలిపారు.భర్త ఇంట్లో లేని సమయంలో మామ వర్రే లింగయ్య తరచూ ఐశ్వర్యను వేధింపులకు గురి చేసేవాడని ప్రతి చిన్న విషయానికి తప్పుపట్టడం,అవమానించడం,మానసికంగా హింసించడం చేసినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారని వివరించారు.వెంటనే టూ టౌన్ ఎస్ఐ సైదులు దర్యాప్తు ను వేగవంతం చేశారని నువ్వు చస్తే నా కొడుకుకు ఇంకా మంచి భార్య వస్తుంది" అంటూ తీవ్రంగా వేధించినట్లు విచారణలో తేలిందని తెలిపారు. మామ వేధింపులు తట్టుకోలేక ఈ నెల18న పట్టణ పరిధిలోని పానగల్లులో గల తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఐశ్వర్య ఆత్మహత్యకు పాల్పడిందని వెల్లడించారు.మృతురాలి తండ్రి చింతల వెంకటయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేయడం జరిగిందని నిందితుడు లింగయ్య అతని నివాసంలో అరెస్టు చేసిన కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.

# అంగన్‌వాడీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

ఎమ్మెల్సీ సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

357 మంది అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు ఉచిత మొబైల్‌ల పంపిణీ



**ప్రజాపక్షం/మునుగోడు:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా పనిచేస్తున్న 357 మంది అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు ఉచిత మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లను అనేక ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. సిపిఐ అనుబంధ సంస్థగా పనిచేస్తున్న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు,రాస్తారోకోలు,రిలే నిరాహార దీక్షలు చేపట్టామని గుర్తుచేశారు. అంగన్వాడీ,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో పలుమార్లు ప్రస్తావించామని తెలిపారు.అంగన్వాడీ టీచర్లకు కనీస వేతన చట్టం అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామీణ స్థాయిలో అంగన్వాడీలు చేస్తున్న సేవలు ఎంతో కీలకమని, వారి పాత్ర ప్రశంసనీయమని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు సమాజంలో గొప్ప బాధ్యతను నిర్వహిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్,చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దొటి నారాయణ,తహసీల్దార్ నరేష్, ఎంపిడిఓ యుగంధర్,మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి,అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.2400 మద్దతు ధర కల్పిస్తుందని, మార్కెట్‌లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పంటను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా బార్డర్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, సివిల్ సప్లయ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పనిచేస్తూ బయట నుండి ధాన్యం రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతుల కోసం ఏర్పాటు చేసిన రూ.5ల భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5 అన్నపూర్ణ భోజనాన్ని కలెక్టర్ ప్రారంభించి రైతులకు స్వయంగా వడ్డించారు. దూరం నుండి పంటను అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు మంచి క్వాలిటి భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నం, కూర, పప్పు, పచ్చడితో రైతులకు నాణ్యత భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని, సీజన్ సమయంలో భోజనంతోపాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎంఓ నాగేశ్వరశర్మ, డిసిఓ ప్రవీణ్, ఎఎంసి డైరెక్టర్స్, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకం ఆపాలి



రైతులకు న్యాయం చేయాలి : సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్

**ప్రజాపక్షం/నల్లగొండ :** వరిధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.చిట్యాల మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్దఎత్తున వరి ధాన్యాన్ని పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నప్పటికీ, కొనుగోలు ప్రక్రియలో అధికారులు,మిల్లర్లు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.సివిల్ సప్లై, ఐకేపీ అధికారులు క్వింటాలుకు అదనపు తూకం పేరుతో రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని అధికంగా తీసుకుంటున్నారని తెలిపారు. వడ్లలో తేమ లేకుండా పూర్తిగా ఎండబెట్టి తీసుకువచ్చినప్పటికీ, క్వింటాలుకు 3 నుంచి 5 కిలోల వరకు తరుగు పేరుతో కోత విధించడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందన్నారు.మార్కెట్ అధికారులు,మిల్లర్లు కలిసి వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడం వల్ల రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అదనపు తూకం విధానాన్ని పూర్తిగా నిలిపివేసి, కొనుగోలు కేంద్రాలను జిల్లా అధికారులు స్వయంగా తనిఖీ చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దూది గ్రామ మల్లయ్య,నర్రాశేఖర్ రెడ్డి,బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్టు

రూ.3లక్షల విలువైన 5 కేజీల గంజాయి స్వాధీనం

జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా వెల్లడి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ.3లక్షల విలువైన 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె. నరసింహ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నమ్మదగిన సమాచారంతో ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులో ఉన్న క్రషర్ మిల్లు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 5 కేజీల గంజాయి, ఒక కారు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారణ చేయగా నెమ్మికల్ గ్రామానికి చెందిన వీరబోయిన భరత్, జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన ఆరె విజయ్, సూర్యాపేట మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన చెవుల మనోజ్, నెమ్మికల్ గ్రామానికి చెందిన కొడిదల శివగా గుర్తించారు. జలసాలకు అలవాటు పడ్డ వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి వినియోగించే అలవాటు ఉండడంతోపాటు గంజాయిని తెచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరుకు వెళ్ళి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి తెచ్చారు. దీనిని అమ్మగా వచ్చిన డబ్బును పంచుకునేందుకు క్రషర్ మిల్లు వద్దకు రావడంతో నమ్మదగిన సమాచారం మేరకు వలపన్ని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సిఐ రాజశేఖర్, ఆత్మకూర్ ఎస్ఐ శ్రీకాంత్‌ను ఆయన అభినందించారు.

## నర్సింహ్మా మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన నోముల నర్సింహ్మా మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. సోమవారం నర్సింహ్మా ఆకాల మరణం చెందడంతో సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన భౌతిక కాయం పై ఎర్రజెండాను కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం పార్టీ శ్రేణులు మృతిడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యాదగిరిరావు మాట్లాడుతూ నర్సింహ్మా చిన్నతనం నుండి కమ్యూనిస్టు పార్టీ భావజాలానికి ఆకర్షితులై నాటి నుండి నేటి వరకు ఎర్రజెండా పక్షాన నిలిచారన్నారు. ఎన్నో ఇబ్బందులకు గురైన కమ్యూనిస్టు పార్టీ పక్షాన నిలిచిన వ్యక్తి నర్సింహ్మా అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని యుగేందర్ రావు, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ మురళీకృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు కొడిదల వెంకటయ్య,జోగు శ్రీరాములు, గ్రామ శాఖ కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలకు ఆదేశం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న యూటర్న్ వద్ద వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నివారణకు చర్యలు చేపట్టాలని పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు సోమవారం కమిషనర్‌ను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఒక వ్యక్తి బైక్ కారు ఢీకొని ప్రమాదానికి గురయ్యారు వెంటనే పాదాచార్యులు ఘటనస్థలికి చేరుకొని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చైర్మన్ ఘటన స్థలానికి వచ్చి కమిషనర్ను పిలిచి హాట్ స్పాట్లను గుర్తించి రోడ్డు వెంట అడ్డుగా ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ అంజన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది యువ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

# ఆరేళ్ల తర్వాత ఆ గ్రామానికి ఉపాధి హామీ


**ప్రజాపక్షం/హాలియా:** సరైన ఉపాధి లేక పనుల కోసం అల్లాడిపోతున్న ఆ గ్రామానికి ఆరేళ్ల తర్వాత ఎట్టకేలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2వేల సంవత్సరంలో హాలియా మున్సిపాలిటీ ఏర్పాటు అయినప్పుడు పక్కనే ఉన్న ఇబ్రహీంపేట గ్రామానికి కూడా మున్సిపాలిటీలో విలీనం చేశారు. మున్సిపాలిటీలు భాగమైన ఆ గ్రామానికి ఉపాధి హామీ పనులు రద్దు కావడంతో రోజువారి కూలీలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేసుకునేందుకు పనిలేక చేతిలో డబ్బులు లేక అల్లాడిపోయిన ఆ ఊరి ప్రజలు పలుమార్లు జిల్లా కలెక్టర్ కి తమ గ్రామానికి ఉపాధి హామీ పనులు చేసుకునే అవకాశం కల్పించాలంటూ మొరపెట్టుకున్నారు. కానీ నిబంధన ప్రకారం మున్సిపాలిటీలలో ఉపాధి హామీ పనులు కల్పించే అవకాశం లేక పోవడంతో అధికారులు కూడా చేతులెత్తేశారు. దీంతో గత ఆరేళ్లుగా ఇబ్రహీంపేట గ్రామస్తులు ఉపాధి హామీ పనులకు దూరమయ్యారు. అయితే ఇక్కడ ప్రజల పరిస్థితి ఆలకించిన స్థానిక నాయకులు ఎడవల్లి నరేందర్ రెడ్డి చొరవ తీసుకొని మున్సిపాలిటీ లో భాగమైన ఇబ్రహీంపేట ప్రజలు కొన్ని పథకాలకు దూరమై ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి గుర్తుచేసి తమ గ్రామాన్ని మున్సిపాలిటీ నుంచి వేరు చేయాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి వినతి చేశారు. దీనిపై



స్పందించిన జానారెడ్డి గ్రామంలో ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి ఉన్నారని గుర్తించారు. అనంతరం గత ఏడాది క్రితం ఇబ్రహీంపేట గ్రామాన్ని హాలియా మున్సిపాలిటీ నుండి వేరుచేసి తిరిగి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. దీంతో ఇన్నాళ్లుగా కనీస పనులు లేక నిత్యం ఖర్చులు వెళ్లక పలు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. గ్రామపంచాయతీ ఏర్పడిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు అవకాశం కల్పించారు.ఆరేళ్ల తర్వాత సోమవారం ఉపాధి హామీ అధికారులు గ్రామాల్లోకి వచ్చి పనులు గుర్తించి ప్రజలకు ఉపాధి హామీ పనులు చేసుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఆరేళ్ల తర్వాత తమకి ఉపాధి హామీ పనులు చేసుకునే అవకాశం రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# ప్రభుత్వ భూములను కాపాడండి..

**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమాలకు తెగబడుతున్నారని, వీరికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు కల్లూరి రామచంద్రా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాజాపేట, యాదగిరిగుట్ట మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాజాపేట మండలం చల్లూరు గ్రామంలోని సర్వే నంబర్ 322లో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జిల్లా మైనింగ్ శాఖ గానీ, స్థానిక గ్రామ పంచాయతీ గానీ అక్కడ క్రషర్ నడపడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తాము ఆర్టీఐ ద్వారా సేకరించిన పత్రాలే నిదర్శనమని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి క్రషర్ నడుపుతుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలోని సర్వే నంబర్ 726లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, అక్కడ అక్రమంగా వెంచర్లు వేసి అమాయక పేద, మధ్యతరగతి ప్రజల నుండి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ఈ అక్రమాలను ప్రశ్నిస్తున్న వారిపై ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రజావాణికి వస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు కలెక్టరేట్ గేట్ల వద్దే అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ నాయకులు గేట్లను తోసుకుని లోపలికి వెళ్లి కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. చల్లూరు, మాసాయిపేటల్లో ఆక్రమణకు గురైన భూములపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడే వరకు తమ పోరాటం ఆగదని కల్లూరి రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కర్రె వెంకటయ్య, సట్టు తిరుమలేష్, బాబురావు, కర్ణాకర్, మైలారం స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన ఓపెన్ పరీక్షలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓపెన్ ఇంటర్మీడియట్, టెన్త్ పరీక్షలు పట్టణంలోని ఐదు కేంద్రాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఓపెన్ టెన్త్ పరీక్షకు 412 మందికి గాను 352 మంది హాజరు కాగా ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షకు 494 మందికిగాను 437 మంది హాజరైనట్లు ఎంఈవో ధర్మానాయక్ తెలిపారు. టెన్త్ పరీక్షలు రెండు పరీక్షా కేంద్రాల్లో, ఇంటర్మీడియట్ పరీక్షలు మూడు పరీక్షా కేద్రాల్లో జరిగాయి. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పరీక్షల్లో చూసిరాతలు జరిగినట్లు కొంతమంది పరీక్షలు రాసిన వారే తెలిపారు. కిందిస్థాయి ఉద్యోగాల్లో ఉన్న వారు పదోన్నతుల కోసం వారు మరొకరితో పరీక్షలు రాయించినట్లు తెలిపారు.


## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 55 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 40, మున్సిపాలిటీ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 2, జిల్లా పంచాయతీ 2, జిల్లా విద్యా శాఖ 2, కోఆపరేటివ్, ఎస్సీ కార్పొరేషన్, చేనేత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, శాఖలకు ఒక్కటి



చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ
# హామీ ఏమైంది?
### కేంద్రాన్ని నిలదీసిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా



**జమ్ము :** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని మండిపడ్డారు. శాసనసభలలో మహిళా రిజర్వేషన్ల అమలు విషయంలో కూడా ముఖ్యమంత్రి బిజెపిని లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై స్పష్టమైన సమాధానం లేదని, సరైన సమయంలో అని అంటోందని, సరైన సమయం అంటే ఏమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీ వాగ్దానాలను మేము అంత తేలికగా తీసుకోవాలా? వాటిని మీరు సుప్రీంకోర్టులో, పార్లమెంటులో, ర్యాలీలలో, ఎన్నికలలో ఇలా ప్రతిచోటా పునరావృతం చేసి, ఆ తర్వాత వెనక్కి తగ్గుతారా?' అని రాజౌరి జిల్లాలోని నౌషెరా సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఒక బహిరంగ సభలో అబ్దుల్లా అన్నారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను వెల్లడించాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. 'ఈ సరైన సమయం ఏమిటో మాకు వివరించండి, అప్పుడే మేము దాని కోసం కృషి చేయగలం. పిల్లలకు పరీక్షలు పెట్టినట్లే పాస్ అవ్వడానికి, ఫస్ట్ డివిజన్‌కు, డిస్టింక్షన్‌కు ఎన్ని మార్కులు కావాలో వారికి చెబుతాం. వారు ఏమి సాధించాలో వారికి తెలుస్తుంది. అదేవిధంగా, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏ షరతులు నెరవేర్చాలో మాకు చెప్పండి' అని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. జమ్ముకశ్మీర్‌కు జరిగిన అన్యాయాన్ని పరిష్కరిస్తారనే ఆశతో ప్రజలు ఓటు వేశారని ఆయన అన్నారు. మమ్మల్ని రాష్ట్రం నుండి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం ఒక శిక్షలా అనిపించిందని చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో వారి ప్రభుత్వం ఏర్పడలేదు, కానీ కేంద్ర ప్రభుత్వం వారిదే. వారి వాగ్దానం ఏమిటి?' ఎన్నికల్లో పాల్గొనండి, ఆ తర్వాత జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని వారు చెప్పారన్నారు. జమ్ముకశ్మీర్‌లో జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియను ప్రస్తావిస్తూ, అబ్దుల్లా ఇలా అన్నారు, 'ఇక్కడ డీలిమిటేషన్ ఎలా జరిగిందో మనం మర్చిపోయామా? ఏడు సీట్లు సృష్టించబడ్డాయి వాటిలో ఆరు బిజెపి గెలుచుకుంది. నియంత్రణను పటిష్టం చేసుకోవడానికే డీలిమిటేషన్ జరిగింది' అని అన్నారు.

# బిజెపికి లొంగిపోయిన అన్నాడిఎంకె

**తమిళనాడును పాలించాలనే ఉద్దేశంలో ఆర్ఎస్ఎస్: రాహుల్**



**కన్యాకుమారి :** తమిళనాడులోని అన్నాడిఎంకె అవినీతి కారణంగా బిజెపికి లొంగిపోయిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుతం ఆ పార్టీ తమిళనాడులోకి బిజెపి ప్రవేశానికి వాహనంలా మారిందని విమర్శించారు. మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలోని అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ కన్యాకుమారిలో జరిగిన సభలో పాల్గొన్న రాహుల్, బిజెపి, అన్నాడిఎంకెపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర రాజకీయాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, ద్రవిడ సిద్ధాంతాన్ని ఆర్ఎస్ఎస్ ద్వేషిస్తోందని, అదే తమిళనాడుపై పాలన సాధించాలనే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ప్రతి రాష్ట్రానికి సొంత స్వరూపం, సంస్కృతి, భాష ఉంటాయని గుర్తుచేసిన ఆయన, ఆ రాష్ట్ర ప్రజలే తమ రాష్ట్రాన్ని పాలించాలి అన్నది కాంగ్రెస్ సిద్ధాంతమని తెలిపారు. బిజెపిమాత్రం ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే చరిత్ర అనే విధానాన్ని ముందుకు తీసుకెళ్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఇది భారత దేశంలోని విభిన్నతను దెబ్బతీసే ప్రయత్నమని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడు ప్రజలే తమ రాష్ట్రాన్ని పాలించాలని, ఢిల్లీ నుంచి నియంత్రణ ఉండకూడదని స్పష్టం చేశారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభావంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడుపై నియంత్రణ సాధించాలనుకున్నారని ఆరోపించారు. ఆ క్రమంలో ఎఐఎడిఎంకె నాయకుడు పళనిస్వామి ద్వారా రాష్ట్రాన్ని ప్రభావితం చేయాలని ప్రయత్నించారని పేర్కొన్నారు.

**అగ్నికి ఆ హుతి చేశారంటూ ఆరోపణలు**

తమిళ భాష, సంస్కృతి, చరిత్రను కాపాడేందుకు డిఎంకె, కాంగ్రెస్ పార్టీలు కట్టుబడి ఉన్నాయని రాహుల్ గాంధీ అన్నారు. ప్రజల స్వాభిమానాన్ని కాపాడే పోరాటంలో ఈ కూటమి ముందుంటుందని చెప్పారు. అదే సమయంలో, మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మణిపూర్‌లో శాంతియుత పరిస్థితులను బిపిపి ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని అగ్నికి ఆహుతి చేశారని ఆరోపించారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ అక్కడ గృహయుద్ధ వాతావరణం కొనసాగుతోందని అన్నారు. మణిపూర్‌లో ఇటీవల జరిగిన దాడిలో ఐదేళ్ల బాలుడు, ఐదు నెలల శిశువు మృతి చెందడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపిందని తెలిపారు. ఈ ఘటనల అనంతరం అక్కడి పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయని, ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారని చెప్పారు. భద్రతా దళాలు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి టియర్ గ్యాస్, స్మోక్ బాంబులను ఉపయోగించాల్సి వచ్చిందని వివరించారు. మణిపూర్‌లో హింస 2023 మే 3న ప్రారంభమైందని గుర్తుచేసిన రాహుల్ గాంధీ, మెయితీ, కుకీ సముదాయాల మధ్య జరిగిన ఘర్షణలు భారీ నష్టం కలిగించాయని చెప్పారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, ప్రజల నిరాశ్రయత్వం వంటి సమస్యలు తీవ్రంగా పెరిగాయని అన్నారు. ఈ పరిణామాలను తమిళనాడుతో పోల్చుతూ, బిజెపి దేశంలోని రాష్ట్రాలను ఢిల్లీ నుంచి నియంత్రించాలనే ఉద్దేశంతో పనిచేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ అధికారాన్ని కైవసం చేసుకుని, రాష్ట్రాలను కేంద్రం నుంచి నడపాలని బిజెపి ప్రయత్నిస్తోంది' అని అన్నారు. ఎఐఎడిఎంకె గతంలో తమిళనాడులో కీలక పాత్ర పోషించిన పార్టీ అని, ప్రజల అభివృద్ధికి ఎంతో సేవ చేసిందని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ తన స్వరూపాన్ని కోల్పోయి, బిజెపి చేతుల్లో ఒక సాధనంగా మారిపోయిందని విమర్శించారు. అవినీతి కారణంగా ఆ పార్టీ నాయకత్వం పూర్తిగా లొంగిపోయిందని ఆయన ఆరోపించారు.

## ముగిసిన ఉపరాష్ట్రపతి శ్రీలంక పర్యటన



**కొలంబో:** భారత ఉపరాష్ట్రపతి వి.పి.రాధాకృష్ణన్ రెండు రోజుల శ్రీలంక పర్యటన ముగిసింది. ఈ పర్యటనలో ఆయన పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. పర్యటన సందర్భంగా రెండు దేశాలమధ్య మరింత లోతైన ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకునేందుకు పలు అవగాహనా పత్రాలు, ఒప్పందాలపై రెండు దేశాల నాయకులు సంతకాలు చేశారు. రెండు దేశాలమధ్యా ఉత్తర రైల్వే లైన్‌లో రైళ్ళ రాకపోకల పునరుద్ధరణపై క ప్రకటన చేశారు. అదేవిధంగా మూడు బెయిలీ బ్రిడ్జీలను కూడా ఏర్పాటు చేసే విషయాన్ని ప్రకటించారు. ఉపరాష్ట్రపతి మొదటిసారి శ్రీలంకలో పర్యటించారు.శ్రీలంకలో భారత్ నిర్మిస్తున్న ప్రాజెక్టుల పురోగతిపై కూడా అక్కడి నాయకత్వంతో రాధాకృష్ణన్ చర్చించారు. శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన దిత్వా తుఫాను నుండి కోలుకునేందుకు 450 మిలియన్ డాలర్ల సహాయం ద్వారా జరుగుతున్న పనులను సమీక్షించారు. భారత్ సహకారాన్ని ఆయన పునరుద్ఘాటించారు. పొరుగుదేశాలకే భారత్ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన చెప్పారు. భారత్ తలపెట్టిన ఇళ్ళ నిర్మాణంపై చర్చించారు. అదేవిధంగా రెండు దేశాల జాలర్ల మధ్య సరిహద్దు ప్రాంతీయ జల్లాల్లో ఎదురవుతున్న సమస్యలపై కూడా చర్చించారు.

## మహిళా కోటాపై
# మోదీది ద్వంద్వ వైఖరి
### నరేంద్ర మోదీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండరు
### కర్నాటక సిఎం సిద్ధరామయ్య విమర్శ



**మైసూరు :** మహిళా రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ద్వంద్వ వైఖరి'ని అవలంబిస్తున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. ముందే చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, కేంద్రం అమలును ఆలస్యం చేసిందని మండిపడ్డారు. సోమవారం సిద్ధరామయ్య మైసూరులో విలేకరులతో మాట్లాడారు. గతంలో బిజెపి, మోదీ సంక్షేమ హామీలను వ్యతిరేకించారని, ఇప్పుడు అవే పద్ధతులను పునరావృతం చేస్తున్నారని సిద్ధరామయ్య అన్నారు. అలాగే మహిళా రిజర్వేషన్ల నిర్ణయం వెనుక ఉన్న సమయం, ఉద్దేశాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. 'దీన్నే నేను ద్వంద్వ వైఖరి అంటాను. నరేంద్ర మోదీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండరు. ఒకవేళ ఆయన కట్టుబడి ఉంటే, ఇది ఎప్పుడో జరిగి ఉండేది. ఆయన అధికారంలోకి వచ్చి ఎన్ని సంవత్సరాలు అయ్యింది? 12 సంవత్సరాలు అయ్యింది. ఇంతవరకు ఎందుకు చేయలేదు?' అని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఈ అంశాన్ని కేంద్రం రాజకీయం చేస్తోందని ఆయన ఆరోపించారు. 'మేము మహిళా రిజర్వేషన్ గురించి మాట్లాడాము. మా వైఖరి ఏమిటని ప్రధానమంత్రి నన్ను అడిగారు. మేము మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉన్నామని చెప్పాను' అని ప్రధానమంత్రితో ఇటీవల జరిగిన చర్చలను ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. రాష్ట్రాల మధ్య సమాన ప్రాతినిధ్యం కల్పించేందుకు, కొత్త జనాభా లెక్కల తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. 'నా దృష్టిలో, కొత్త జనాభా లెక్కల తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అందుకే మేము దానిని వ్యతిరేకించాము. మేము మహిళా రిజర్వేషన్‌ను వ్యతిరేకించలేదు. మేము దానికి ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చాము' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ గత పాత్రను ప్రస్తావిస్తూ, '73వ, 74వ సవరణలను ఎవరు తీసుకొచ్చారు? అని ప్రశిస్తూ రాజీవ్ గాంధీ, కాంగ్రెస్ పార్టీనే అని చెప్పారు. ఆ సవరణలు స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌ను కల్పించాయని, మేమెందుకు దానిని వ్యతిరేకిస్తాము?' అని ఆయన ప్రశ్నించారు. 'నరేంద్ర మోదీ రాజకీయాలు చేసి 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేశారు. దానిని వెంటనే ఎందుకు అమలు చేయలేదు? మరి ఇంతకాలం ఎందుకు వేచి చూశారు? ఆయన వెంటనే అమలు చేసి ఉండవచ్చు. ఆయనకు మహిళా రిజర్వేషన్‌పై నిబద్ధత ఉంటే, దానిని అమలు చేసి ఉండాల్సింది' అని ఆయన అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల మధ్య సంబంధంపై ఆయన ప్రశ్నిస్తూ, 'కేంద్రం దీనిని పునర్విభజనతో ఎందుకు ముడిపెట్టింది? రాజ్యాంగ సవరణకు ఎందుకు వెళ్ళింది?' అని అడిగారు. జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు ఇటువంటి చర్య ప్రతికూలంగా మారవచ్చని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభాను సమర్థవంతంగా నియంత్రించాయి, కానీ ఉత్తరాది రాష్ట్రాలు అలా చేయలేదు. సహజంగానే, ఇది వారికి లాభం చేకూరుస్తుంది, మాకు మాత్రం నష్టం కలిగిస్తున్నారు.

## తమిళనాడు అభ్యర్థుల్లో
# 18 శాతం మందిపై క్రిమినల్ కేసులు

**25% మందికి రూ. కోటి కంటే ఎక్కువ ఆస్తులు : ఎడిఆర్**

**న్యూఢిల్లీ :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులలో సుమారు 18 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 25 శాతం మంది రూ. కోటి కంటే ఎక్కువ విలువైన ఆస్తులను కలిగి ఉన్నారు. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సోమవారం ఓ నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, విశ్లేషించిన మొత్తం 3,992 మంది అభ్యర్థులలో 722 మంది (18 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉ న్నట్లు ప్రకటించారు. వీరిలో 404 మంది (10 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. 2021 అసెంబ్లీ ఎన్నికలలో విశ్లేషించిన 3,559 మంది అభ్యర్థులలో 466 మంది (13 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్న ట్లు, 207 మంది (6 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. కాగా, ప్రధాన పార్టీల విషయానికి వస్తే— ఎఐఎడిఎంకె నుండి విశ్లేషించిన 170 మంది అభ్యర్థులలో 118 మంది (69 శాతం), 'తమిళగ వెట్రి కజగం' నుండి 231 మందిలో 92 మంది (40 శాతం), డిఎంకె నుండి విశ్లేషించిన 175 మందిలో 70 మంది (40 శాతం), బిజెపి నుండి 33 మందిలో 16 మంది (48 శాతం), కాంగ్రెస్ నుండి విశ్లేషించిన 28 మందిలో 14 మంది (50 శాతం), 'పట్టాలి మక్కల్ కచ్చి' నుండి విశ్లేషించిన 18 మం దిలో 9 మంది (50 శాతం), 'దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం' నుండి విశ్లేషించిన 10 మందిలో 5 మంది (50 శాతం), సిపిఐ నుండి విశ్లేషించిన 5 మందిలో 3 మంది (60 శాతం), అలాగే సిపిఐ(ఎం) నుండి విశ్లేషించిన 5 మందిలో 4 మంది (80 శాతం)— తమ అఫిడవిట్‌లలో తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. అదే సమయంలో, విశ్లేషించిన 170 మంది ఎఐఎడిఎంకె అభ్యర్థులలో 60 మంది (35 శాతం), 231 మం ది తమిళగ వెట్రి కజగం అభ్యర్థులలో 43 మంది (19 శాతం), 175 మంది డిఎంకె అభ్యర్థులలో 32 మంది (18 శాతం), 33 మంది బిజెపి అభ్యర్థులలో తొమ్మిది మంది (27 శాతం), 28 మంది కాంగ్రెస్ అభ్యర్థులలో ఐదుగురు (18 శాతం), 18 మంది పట్టాలి మక్కల్ కచ్చి అభ్యర్థులలో ఆరుగురు (33 శాతం), 10 మంది దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం అభ్యర్థులలో ఒకరు (10 శాతం), ఐదుగురు సిపిఐ అభ్యర్థులలో ఒకరు (20 శాతం) — తమ అఫిడవిట్‌లలో తమపై తీవ్రమైన నేర కేసులు ఉన్నట్లు ప్రకటించారు.

**981 మంది కోటీశ్వరులు ...**

విశ్లేషించిన అభ్యర్థులలో 981 మంది (25 శాతం) కోటీశ్వరులు కాగా, 22 మంది (0.55 శాతం) బిలియనీర్లుగా ఉన్నారు. వీరి ఆస్తుల విలువ రూ. 100 కోట్లుగా ఉంది. ప్రధాన పార్టీల విషయానికి వస్తే, విశ్లేషించిన 28 మంది కాంగ్రెస్ అభ్యర్థులలో ఇద్దరు (7 శాతం), 175 మంది డిఎంకె అభ్యర్థులలో ఏడుగురు (4 శాతం), 170 మంది ఎఐఎడిఎంకె అభ్యర్థులలో ముగ్గురు (2 శాతం), 18 మంది పట్టాలి మక్కల్ కచ్చి అభ్యర్థులలో ఒకరు (6 శాతం), 11 మంది అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం అభ్యర్థులలో ఒకరు (9 శాతం), 231 మంది తమిళగ వెట్రి కజగం అభ్యర్థులలో ఎనిమిది మంది (3 శాతం) — తమ ఆస్తుల విలువ రూ. 100 కోట్లకు పైగా ఉన్నట్లు ప్రకటించారు. అదే విధంగా కాంగ్రెస్ నుండి విశ్లేషించిన 28 మంది అభ్యర్థులలో 27 మంది (96 శాతం), డిఎంకె నుండి విశ్లేషించిన 175 మందిలో 170 మంది (97 శాతం), ఎఐఎడిఎంకె నుండి విశ్లేషించిన 170 మందిలో 160 మంది (94 శాతం), బిజెపి నుండి విశ్లేషించిన 33 మందిలో 31 మంది (94 శాతం), పట్టాలి మక్కల్ కచ్చి నుండి విశ్లేషించిన 18 మందిలో 16 మంది (89 శాతం), డిఎండికె నుండి విశ్లేషించిన 10 మందిలో 10 మంది, తమిళగ వెట్రి కర్ఝగం నుండి విశ్లేషించిన 231 మందిలో 156 మంది (68 శాతం), సిపిఐ నుండి విశ్లేషించిన ఐదుగురిలో ముగ్గురు (60 శాతం) అభ్యర్థులు తమ ఆస్తుల విలువ ఒక కోటి రూపాయల కంటే ఎక్కువగా ఉందని ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తుల విలువ రూ. 5.17 కోట్లు కాగా, 2021లో ఈ విలువ రూ. 1.72 కోట్లుగా ఉంది. కనీసం నలుగురు అభ్యర్థులు — మోహన్ కుమార్, స్వతంత్ర అభ్యర్థులైన టి. సెల్వరాజ్, పి. గుణశేఖరన్, జె జగన్ సాలమండోస్‌లు తమకు ఎటువంటి ఆస్తులు లేవని (సున్నా ఆస్తులు) ప్రకటించారు.

**1711 మంది 12వ తరగతిలోపు చదిన-వారే...**

ఈ నివేదిక ప్రకారం, 1711 మంది (43 శాతం) అభ్యర్థులు తమ విద్యా అర్హత 5వ తరగతి నుండి 12వ తరగతి మధ్య ఉందని ప్రకటించగా, 1822 మంది (46 శాతం) అభ్యర్థులు తమ విద్యా అర్హత గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువ ఉందని ప్రకటించారు. అలాగే 301 మంది అభ్యర్థులు డిప్లొమా కలిగి ఉండగా, 95 మంది అభ్యర్థులు నిరక్షరాస్యులు ఉన్నారు. 56 మంది అభ్యర్థులు కేవలం అక్షరాస్యత మాత్రమే కలిగినవారుగా ఉన్నారు. అభ్యర్థులలో కేవలం 442 మంది (11 శాతం) మాత్రమే మహిళలు.

## పేదరికంలో ముర్షిదాబాద్ బీడీ కార్మికులు
### టిఎంసి, కాంగ్రెస్, బిజెపి గేమ్‌లో వారంతా సమిధలే
### పోలింగ్ జరిగాక 25 లక్షలమంది కార్మికులను ఎవ్వరూ పట్టించుకోరు

**సంసేర్‌గంజ్:** పశ్చిమబెంగాల్ ముర్షిదాబాద్‌లో ఈనెల 23వ తేదీ మొదటి విడతగా పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ముర్షిదాబాద్‌లోకి వలసలు రాకుండా అడ్డుకుంటామని, సర్ ప్రక్రియ వల్ల తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చేలా చూస్తామని తృణమూల్ కాంగ్రెస్,బిజెపి,కాంగ్రెస్ పార్టీలు అక్కడి ప్రజలకు భారీగా వాగ్దానాలు చేస్తుంటే అక్కడ నివసించే బీడీ కార్మికులు మాత్రం దశాబ్దాలుగా పేదరికంలో, అతి తక్కువ వేతనాల దోపిడీలో నలిగిపోతూ అప్పులు,అనారోగ్యంతోపాటు ప్రపంచానికి అధికారికంగా తెలియని బాలకార్మిక వ్యవస్థ, గొడ్డుచాకిరీల కబంధ హస్తాల్లో నలిగిపోతున్నారు. ముర్షిదాబాద్‌లో దాదాపు 25 లక్షలమంది బీడీ కార్మికులు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలు ఇళ్ళల్లో ఉండే బీడీలు చుడుతూ ఉంటారు. వారు అధికారికంగా కర్మాగారాలకు వెళ్ళి పనులు చేయరు కాబట్టి వారికి చట్టబద్ధమైన నిబంధనలు, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, వేతనాలు వంటివన్నీ వర్తించవు. ఇళ్ళల్లో ఆడవాళ్ళు రోజుకు 1000 బీడీలు చుడితే వాళ్ళకు దక్కే రోజు కూలీ కేవలం రూ.160లు లేదా రూ.180 లు మాత్రమే. ఈ పనులు ఇంట్లో ఉన్నవాళ్ళందరూ చేసినాగానీ వారికి వచ్చేది కేవలం నెలకు రూ.5 వేలలు వంతున మాత్రమే. ఆ సొమ్ము అంతా కలిపినా వారి నెల అవసరాలు తీరవు. వారికి సామాజిక భద్రత, చట్టపరమైన భద్రత లేదు. పైగా వారి ఇళ్ళల్లో ఉంటే పిల్లలు కూడా స్కూలుకు వెళ్ళక ముందు, స్కూలు నుండి తిరిగి వచ్చిన తర్వాత బీడీలు చుట్టే పనిలో తల్లులకు, ఇతర కుటుంబ సభ్యులకు సహాయం చేయాలి. వారు సహాయం చేయకపోతే ఎట్టిపరిస్థితుల్లోనూరోజుకు నిర్దేశించిన 1000 బీడీల లక్ష్యం చేరడం కష్టం. ఆ లక్ష్యం చేరకపోతే వారికి ఆ రోజు రూ.160 లు దక్కవు. ఒక్కొక్కసారి ఈ చిన్న పిల్లలు స్కూళ్ళు మానేసి మరీ బీడీలు చుట్టడంలో సహాయం చేస్తారు. వారు ఐదో తరగతి పాసైన తర్వాత పూర్తిగా స్కూళ్ళు మానేసి ఇళ్ళల్లో తల్లులకు బీడీలు చుట్టడంతో పూర్తిస్థాయిలో సహాయం చేస్తారు. కానీ చట్టం దృష్టిలో బాల కార్మికులు పని చేయకూడదు. అసలు అక్కడ బాల కార్మికులు లేరని అర్థం. బాల కార్మిక వ్యవస్థ లేదని అర్థం. కానీ అక్కడ ఉండేది ఎక్కువగా బాల కార్మికులే. కానీ వారు కర్మాగారాలకు వెళ్ళి అధికారికంగా పనిచేయరు కాబట్టి ఇళ్ళల్లో ఉండే పని చేస్తారు కాబట్టి వారు బాల కార్మికుల జాబితాలోకి రారు. మగ్గిపోవాల్సిందే. ఈ బీడీ కాంట్రాక్టర్లకు, యజమానులకు ఎక్కువగా తృణమూల్ కాంగ్రెస్,బిజెపి, కాంగ్రెస్ పార్టీలతోనే సంబంధాలు ఉంటాయి. వారు చెప్పినట్టే అందరూ వినాలి. కార్మికులు ఎంత కష్టపడినాగానీ వారి పేదరికం పోదు. వారి వేతనాలు పెరగవు. వారి ఇళ్లల్లో బాలకార్మికుల బానిసత్వం పోదు. వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు ఉండవు. వారు అనేక దశాబ్దాలపాటు అలా బ్రతుకులు గడుపుతూ ఉండాల్సిందే. ఈ బాధలు భరించలేక గత ఏడాది సెప్టెంబరులో లాల్‌గోలా బ్లాక్‌లో 10,000 మంది బీడీ కార్మికులు తిరగబడ్డారు. వారు నిరసన ప్రదర్శనలు చేశారు. అప్పుడే ప్రపంచానికి వారి సమస్య గురించి కొద్దిగా తెలిసింది. వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.

## ప్రారంభానికి ముందే
# రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభం కావాల్సిన రాజస్థాన్‌లోని రిఫైనరీ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రిఫైనరీలోని క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్‌లో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. మంగళవారం ప్రధాని మోదీ అక్కడ పర్యటించి రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండటంతో అక్కడ వేల మంది పోలీసులు మోహరించారు. ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ కూడా సోమవారం సాయంత్రం రిఫైనరీని సందర్శించాల్సి ఉన్నదని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని, అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు.2013లో సోనియాగాంధీ ఈ రిఫైనరీకి శంకుస్థాపనబలోత్రాలోని ఈ రిఫైనరీని దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీకమ్‌పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దారు. హిందుస్థాన్ పెట్రోలియం, రాజస్థాన్ ప్రభుత్వం మధ్య జాయింట్ వెంచర్‌గా ఇది ఏర్పాటైంది. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 2013లో సోనియా గాంధీ ఈ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. అప్పుడు ప్రాజెక్ట్ వ్యయం రూ.43,129కోట్లు. అనంతరం జనవరి 16, 2018లో నరేంద్ర మోదీ ప్రభుత్వం దీనిని రీలాంచ్ చేసింది. ఈ మొత్తాన్ని రూ.79,459 కోట్లకు సవరించి ఈ ప్రాజెక్ట్ చేపట్టారు. 4,400 ఎకరాల్లో విస్తరించిన ఈ రిఫైనరీలో ఇంధనంతో పాటు భారీగా పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయా రు చేస్తారు. ప్లాస్టిక్, వ్యవసాయ పైపులు, ప్యాకేజింగ్ ఫిల్మ్‌లు, ఆటో విడిభాగాలు, సింథటిక్ ఫైబర్, వైద్య పరికరాలు, పెయింట్లు, డిటర్జెంట్ల తయారీకి ఇక్కడ తయారయ్యే పెట్రోకెమికల్స్ ఉపయోగపడతాయి. ఇది మంగళవారం అందుబాటులోకి వస్తే దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు మొత్తం వార్షిక సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా ఇందులో పెట్రోరసాయనాల ఉత్పత్తుల సామర్థ్యం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది. రిఫైనరీ ప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆందోళన మరోవైపు రిఫైనరీలో జరిగిన అగ్నిప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రిఫైనరీ రాజస్థానీయులందరికీ గర్వకారణమైన ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న తరుణంలో ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారందరూ సురక్షితంగా ఉండాలని గహ్లోత్ ఆకాంక్షించారు.

## 'సర్'పై కోల్‌కతా హైకోర్టు సి.జె విమర్శలతో తక్షణ నివేదిక కోరిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర తనిఖీ (సర్) ప్రక్రియకోసం ఏర్పాటు చేసిన రాజ్యాంగబద్ధమైన అత్యున్నతస్థాయీ పాక్షిక న్యాయ విచారణా సంస్థలు పని చేయడం లేదని కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సి.జె) ఆరోపణ చేసిన తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సోమవారం స్పందించారు. ఈ విషయంపై ఒక నివేదిక ఇవ్వాలని ఇప్పుడే ఈ రోజే ఆ న్యాయస్థానాన్ని అడుగుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్,న్యాయమూర్తి జ్యోమాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలను జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ""ఇది పశ్చిమ బెంగాల్‌కు చెందిన "సర్" విషయం. ఈ ధర్మాసనం ఈ కేసును ఏప్రిల్ 24వ తేదీకి వాయిదా వేసింది. అత్యున్నతస్థాయీ ట్రిబ్యునల్స్ పని చేయడంలేదు. న్యాయవాదులను అనుమతించడంలేదు. వారు కేవలం ఇంటర్నెట్‌పైన ఆధారపడి కంప్యూటర్ ఆధారిత దరఖాస్తులను మాత్రమే తీసుకుంటున్నారు" అని న్యాయవాది కామత్ తెలియజేశారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దాదాపు ప్రతిరోజూ పశ్చిమ బెంగాల్ "సర్"కు సంబంధించిన అంశాలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువస్తూనే ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. "మేం ఇప్పుడే ఈరోజే కోల్‌కతా హైకోర్టు నుండి ఒక నివేదికను అడుగుతాం" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23వ తేదీన రెండు దశల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 29న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. మే నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేస్తారు. గతంవారం సుప్రీం కోర్టులో పశ్చిమ బెంగాల్ 'సర్' విషయంపై విచారణ జరిగినప్పుడు ఎన్నికల సంఘానికి ధర్మాసనం ఒక ఆదేశం జారీ చేసింది. ఓటర్ల జాబితా నుండి తొలగించిన వారి పేర్లకు సంబంధించిన సమస్య పరిష్కారానికి వీలుగా సవరించిన అనుబంధ ఓటర్ల జాబితాను అత్యున్నతస్థాయీ ట్రిబ్యునల్ వద్ద అనుమతించాలని పేర్కొంది. అదేవిధంగా సర్ ప్రక్రియ సందర్భంగా తమ ఓట్లను తొలగించారంటూ 13 మంది బృందం సుప్రీంకోర్టు జోక్యం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు తీసుకోవడానికి ధర్మాసనం తిరస్కరించింది.

# మోదీ విదేశాంగ విధానానికి భారీ ఎదురుదెబ్బ

**శాంతి చర్చలపై కాంగ్రెస్**



**న్యూఢిల్లీ :** అమెరికా ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ పరిణామాలు ప్రధానమంత్రి నరేంద్ర విదేశాంగ వ్యూహానికి భారీ ఎదురుదెబ్బగా నిలిచాయని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ దగ్గరవడం ఆందోళనకరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఇది దేశ విదేశాంగ ప్రయోజనాలకు నష్టం కలిగించే అంశమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఒకప్పుడు విదేశాంగ మంత్రి పేర్కొన్న దలాల్ దేశం ఇప్పుడు అమెరికా–ఇరాన్ శాంతి చర్చలకు వేదికగా నిలవడం విచిత్రమని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 11, 12 తేదీల్లో ఇస్లామాబాద్‌లో జరిగిన తొలి దశ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిసినా, మరో విడత చర్చలు జరగనున్నట్లు అమెరికా ప్రకటించడం గమనార్హమన్నారు. మొదటి దశ చర్చల అనంతరం సౌదీ అరేబియా, ఖతార్ దేశాల నుంచి 6 బిలియన్ డాలర్లు రుణంగా పాకిస్థాన్ తీసుకుందని అన్నారు. యుఎఇ నుంచి తీసుకున్న 3.5 బిలియన్ డాలర్ల అప్పును చెల్లించడంతో పాటు 1.43 బిలియన్ డాలర్ల యూరో బాండ్ బకాయిలను తీర్చిందని పేర్కొన్నారు. పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయంగా కీలక దౌత్య పాత్ర పోషించడం ఆశ్చర్యకరమన్నారు. గతంలో ఒసామా బిన్ లాడెన్ వంటి ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర పాక్‌కు ఉందని జైరాం రమేశ్ అన్నారు. అంతేకాకుండా, అఫ్గానిస్థాన్‌లో డ్రగ్ రిహాబిలిటేషన్ కేంద్రాలపై దాడులు జరిపిన దేశంగా పేరొందిందని చెప్పారు. ఇక ఇటీవల పహల్గాం ఉగ్రదాడికి కూడా కారణమైందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికపై కీలక పాత్ర పోషించడం మోదీ విదేశాంగ వైఫల్యాన్ని చూపుతుందని జైరాం రమేశ్ విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడికి ఆజ్యం పోసి, రెచ్చగొట్టే, ఉద్రేకపూరిత వ్యాఖ్యలు చేసిన ఆర్మీ చీఫ్ అసీం మునీర్, అధ్యక్షుడు ట్రంప్‌నకు దగ్గరవడం భారత్‌కు తీవ్రమైన ఎదురుదెబ్బ అని అన్నారు. ట్రంప్‌నకు దగ్గరగా ఉండే వర్గాలను పాకిస్థాన్ సమర్థంగా ప్రభావితం చేస్తోందని, భారత్ మాత్రం ఈ విషయంలో వెనుకబడిందని విమర్శించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2008 ముంబయి ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఒంటరిగా నిలబెట్టగలిగామని గుర్తు చేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. మోదీ ప్రభుత్వ ప్రాంతీయ, అంతర్జాతీయ దౌత్య విధానాలు పాకిస్థాన్‌ను ఒంటరిగా చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఈ పరిణామాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని భారత్ తన విదేశాంగ విధానాన్ని పూర్తిగా పునర్విమర్శించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఆ మార్పులు తీసుకురావడానికి సామర్థ్యం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# ప్రధాని మోదీ మొసలి కన్నీరు

లోక్‌సభ,శాసన సభల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లును నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడాన్ని వ్యతికుస్తూ ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా ఓడించటాన్ని తమకు రాజకీయ లాభసాటిగా మార్చుకునే వ్యూహంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళల పట్లమొసలి కన్నీరు కారుస్తున్నారు. ప్రభుత్వం అనుసరించిన అహంకార పూరిత ఎత్తుగడలను పరిశీలిస్తే , రాజ్యాంగ సవరణ తదితర బిల్లులు ఆమోదించటానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని పిలవటం కూడా రాజకీయ ఎత్తుగడగానే తోస్తుంది. బిల్లు ఓడిపోగానే బిజెపి శ్రేణులు ఢిల్లీలో ఎంపీలు సహా , దేశవ్యాప్తంగా 'ప్రతి పక్షాలు మహిళా ద్రోహులు' అంటూ వీధుల కెక్కటం–అందుకు వారు ముందుగానే సన్నద్ధంగా ఉన్నట్లు విదితమవుతున్నది. కాంగ్రెస్ , టిఎంసి, డిఎంకె,సమాజ్‌వాది పార్టీలను పేరుపెట్టి నిందిస్తూ ఊరేగటం బిజెపికి రాజకీయ చిత్తశుద్ధి లేమిని వెల్లడిస్తున్నది. ప్రచారంలో సిద్ధహస్తుడైన ప్రధాని నరేంద్ర మోదీ ఆ మరునాడు దేశ ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో , 19వ తేదీన పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సభల్లో ప్రసంగాల్లో మహిళా రిజర్వేషన్ చట్టం కన్నా, ఆపేరుతో మహిళల ఓట్లు పొంది రాజకీయంగా లబ్ధిపొందాలన్న తాపత్రయం వ్యక్తమైంది. మహిళా రిజర్వేషన్ చట్టం పట్ల మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే , 2023లో సంబంధిత బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినపుడు, 'కండిషన్‌లు'వర్తిస్తాయి అనే క్లాజు పెట్టి ఉండేది కాదు. రాజ్యాంగరీత్యా , చట్టరీత్యా ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించేందుకు ప్రయత్నించేది.దక్షిణాది , ఉత్తరాది రాష్ట్రాలకు సమన్యాయం కోసం తొలుత ఇందిరాగాంధీ ప్రభుత్వం,పాతికేళ్ల తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం మరో పాతికేళ్లు నియోజక వర్గాల పునర్విభజనను స్తంభింపజేశాయి. ఆప్రకారం 2026 తర్వాత చేబట్టే(సెన్సెస్) తర్వాత నియోజక వర్గాల విభజన చేపట్టాలి. 2023బిల్లును అన్ని పార్టీలు బలపరచటంతో రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదించబడింది. కాబట్టి ప్రధాని దుష్ప్రచారం చేస్తున్నట్లు ఏపార్టీ వ్యతిరేకం కాదు. ఆబిల్లును వెంటనే 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలని నాడు ప్రతి పక్షాలు డిమాండ్ చేయగా , పై'కండిషన్'తో మోదీ మోకాలు అడ్డుపెట్టారు. రెండు, నారీశక్తి వందన్ అధినియం బిల్లుకు 2023 సెప్టెంబరు 28 రాష్ట్రపతి ఆమోద ముద్రతో అది చట్టమైంది. కానీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ చేయకుండా ఆ చట్టం అమలును కోల్డ్ స్టోరేజిలో పెట్టింది.ఇప్పుడు ఆ చట్టానికి సవరణ బిల్లు తదితరాల మీద 16 వ తేదీన లోక్‌సభ చర్చిస్తుండగా, ప్రభుత్వం ఆ అర్ధరాత్రి ఆదరా బాదరా నోటిఫై చేసింది. ప్రతిపక్షం 2023లో వలె ఇప్పుడు కూడా కండిషన్‌లను తిరస్కరించాయి. ప్రస్తుత లోక్‌సభ సంఖ్యాబలం 543ప్రాతిపదికపై మహిళలకు 33శాతం రిజర్వేషన్ వెంటనే అమలు జరపాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. లోక్‌సభ సీట్లను850కి పెంచి మహిళా రిజర్వేషన్ అమలు జరపాలని ప్రతిపక్షాలు కోరలేదు. నియోజక వర్గాల పెంపుదలకు రిజర్వేషన్ అమలుతో ముడిపెట్టడంలో బిజెపి రాజకీయ వ్యూహాన్ని గ్రహించిన ప్రతిపక్షాలకు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు చేయటం తప్ప మరో మార్గంలేదు. 2026 సెన్సెస్ ఫైనల్ కావటానికి కనీసం రెండేళ్ల పడతాయి. ఆ తదుపరి డీలిమిటేషన్ ఉత్తర్వు చేస్తే కనీసం మరో నాలుగేళ్లు పడుతుంది. నియోజక వర్గాల పెంపుదల , దక్షిణాది , ఉత్తరాది మధ్య దామాషా ప్రాతినిధ్యం దెబ్బతినకుండా చూసే మార్గాలపై ఏకాభిప్రాయ సాధన అప్పటిమాట. 2026 సెన్సెస్ తర్వాతనే మహిళా రిజర్వేషన్ అమలు అని చట్టంలో కండిషన్ పెట్టిన మోదీ ప్రభుత్వానికి , వాటిని 2029 ఎన్నికల నుంచే అమలు జరపాలన్న ఆకస్మిక ఆలోచన రావటంలోని ఆంతర్యం చిదంబర రహస్యం. అన్ని రాష్ట్రాలకు సమంగా 50శాతం నియోజక వర్గాలు (లోక్‌సభ, అసెంబ్లీ) పెంచుతామన్న ప్రతిపాదన నోటిమాట తప్ప బిల్లులో మచ్చుకైనా కానరాదు. ఎందుకీ మోసపూరిత ఎత్తుగడ.'మీరు బిల్లును బలపరుస్తామంటే, ఒక గంట సమయంలో ఆహామీని బిల్లులో చేర్చుతా' నని హోంమంత్రి అమిత్ షా సభలో అనటం సిగ్గుచేటు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇంతటి ప్రభావవంతమైన బిల్లు ప్రతిపాదనలపై పబ్లిక్ చర్చను , ప్రతిపక్షపార్టీలతో లోతైన చర్చలను కోరుకునేది.

ఒకవైపు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా , వాటి మధ్యలో పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచటంలో ఉద్దేశం ఏమిటీ? తమిళనాడు ,పశ్చమబెంగాలులో పోలింగ్ ముగిశాక (ఏప్రిల్23,29) అఖిలపక్ష సమావేశం పిలవాలన్న కాంగ్రెస్ తదితర పార్టీల సూచనను ఎందుకు తిరస్కరించినట్లు? బిల్లు ఓడినా,ఆమోదం పొందినా తమకే లాభం అన్న బిజెపి రాజకీయ వ్యూహాన్ని ప్రతిపక్షం పసిగట్టింది. బిల్లు ఓడితే ప్రతి పక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమని తమిళనాడు, బెంగాల్ మహిళలను రెచ్చగొట్టి వారి ఓట్లకు ఎర వేసి లబ్ధిపొందవచ్చు. లేక బిల్లు ఆమోదం పొందితే , తాము2029 నుంచే మహిళలను అందలం ఎక్కిస్తున్నామని చెప్పి మహిళల సానుభూతి పొంది ఓట్లు కొల్లగొట్టి లబ్ధి పొందవచ్చన్నది నిరాకరించలేని బిజెపి ఎత్తుగడ . అది భగ్నమైనందున బిజెపి నాయకులు , శ్రేణులు దేశవ్యాప్తంగా అదే ఆక్రోశిస్తున్నారు. మరోవారం కొనసాగిస్తారట. ఈలోపు ఎన్నికల ముగింపునకు వస్తాయి. నియోజక వర్గాల పెంపు , భౌగోళిక హద్దుల మార్పు ద్వారా దేశరాజకీయ ముఖ చిత్రాన్ని మార్పు చేసి అధికారాన్ని శాశ్వతం చేసుకునే బిజెపి దుష్ట వ్యూహాన్నిలోక్‌సభ తిరస్కరించి దేశ ప్రజాస్వామ్యాన్ని , బహుళత్వాన్ని కాపాడింది. ఇది ప్రతిపక్షాల విజయం.బిజెపి స్వార్థపూరిత ప్రయోజనాలను, చిత్తశుద్ధి రాహిత్యాన్ని గ్రహించలేనంత అమాయకులా దేశ ప్రజలు! లోక్‌సభ , శాసన సభల్లో ప్రస్తుత సీట్ల సంఖ్య ప్రాతిపదికగా మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు జరిపి మోదీ ప్రభుత్వం మహిళల రుణం తీర్చుకోవాలి . మోసకారి మాటలు, దగాకోరు ప్రచారాన్ని దేశ ఓటర్లు, ముఖ్యంగా మహిళా లోకం సహించరు. ఇది బిజెపికి బెడిసి కొడుతుంది. ●



## విశ్వగురువు పదం ఉపయోగించొద్దు

**మనం 'విశ్వగురువు' అనే భావన విషయంలో, వ్యక్తిగతంగా నా అభిప్రాయం ఏమిటంటే... ఈ రోజుల్లో మనం ఆ పదాన్ని ఉపయోగించడం మానుకోవాలి. ప్రస్తుతం మనం ఇప్పుడు 'విశ్వగురువు' కాదు. మనం 'విశ్వగురువు' కావాలి. ఒకప్పుడు విశ్వగురువుగా ఉండేవాళ్ళం. కానీ ఇప్పుడు మనం అలా లేము.**

– మురళీ మనోహర్ జోషిబిజెపి మాజీ అధ్యక్షుడు

## ఒక చిన్న పిలుపు జీవితంలో గొప్ప మార్పు!

ఆధునిక యాంత్రిక జీవనశైలిలో మనిషి భౌతికంగా అందరికీ చేరువగా కనిపిస్తున్నప్పటికీ, భావోద్వేగ పరంగా ఒంటరితనం పెరుగుతున్నదనే ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక యుగంలో పరస్పర అనుసంధానం పెరిగిన కొద్దీ, మానవ సంబంధాల లోతు తగ్గుతున్నదనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. 2023 మే నెలలో అమెరికా ప్రభుత్వ ప్రధాన ఆరోగ్య అధికారి డాక్టర్ వివేక్ మూర్తి విడుదల చేసిన మన ఒంటరితనం, ఏకాంతం ఒక మహమ్మారి నివేదిక ప్రకారం, దీర్ఘకాలిక ఒంటరితనం రోజుకు 15 సిగరెట్లు తాగడంతో సమానమైన ఆరోగ్య నష్టాన్ని కలిగిస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. అదే సమయంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ సామాజిక ఒంటరితనాన్ని ఒక ప్రధాన ప్రజా ఆరోగ్య సమస్యగా గుర్తించి, దీనిపై అంతర్జాతీయ చర్చలు ప్రారంభించింది. 2020–2022 మధ్య కాలంలో అమలైన లాక్‌డౌన్‌ల వల్ల సమస్య మరింత జటిలమైందని వివిధ అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. పాత మిత్రుడిని పలకరించడం కేవలం సంభాషణ మాత్రమే కాదు, అది ఒక ప్రాణరక్షక 'సంజీవని' లాగా పనిచేస్తుంది.

ఎనిమిది దశాబ్దాల పరిశోధనలో వెల్లడైన రహస్యాలు

1938లో ప్రారంభమైన హార్వర్డ్ వయోజన వికాస అధ్యయనం, మానవ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా కొనసాగుతున్న పరిశోధనగా గుర్తింపు పొందింది. ఈ అధ్యయనం ఎనిమిది దశాబ్దాలుగా ఒక విస్మయకర వాస్తవాన్ని ప్రపంచానికి చాటిచెబుతోంది. వ్యక్తి జీవితంలో ఆనందం, ఆరోగ్యం మరియు దీర్ఘాయువును నిర్ణయించేది అతని ఆర్థిక స్థితి లేదా పదవి కాదు, కేవలం అతను కలిగి ఉన్న 'బలమైన మానవ సంబంధాలే'. అధ్యయన నిర్దేశకులు డాక్టర్ రాబర్ట్ వాల్డింగర్ నిరూపించినట్లుగా, ఒంటరితనానికి దూరంగా ఉండి ఆత్మీయులతో కలిసుండే వారిలో మెదడు పనితీరు చురుగ్గా ఉండటమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. 2022లో ప్రచురితమైన మానసిక శాస్త్ర పరిశోధనల ప్రకారం, మనం చాలా కాలం తర్వాత ఒక మిత్రుడికి చేసే ఆశ్చర్యకరమైన పిలుపు అవతలి వ్యక్తిలో మనం ఊహించిన దానికంటే 40 శాతం ఎక్కువ సంతోషాన్ని కలిగిస్తుంది. నరాల విజ్ఞాన శాస్త్రం ప్రకారం, ఇటువంటి సానుకూల సంభాషణలు మెదడులో ఒత్తిడిని తగ్గించే 'ఆనంద రసాయనాలను' విడుదల చేస్తాయి.

వ్యవస్థాగత పరిష్కారాల దిశగా అడుగులు

ఒంటరితనం ఒక సామాజిక సవాలుగా మారుతున్న నేపథ్యంలో, పలు దేశాలు వ్యక్తిగత స్థాయి నుంచి ప్రభుత్వ స్థాయి వరకు చర్యలు చేపట్టాయి. బ్రిటన్ ప్రభుత్వం 2018లోనే ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఒంటరితన నిర్మూలన మంత్రి అనే ప్రత్యేక బాధ్యతను ఏర్పాటు చేసి, సామాజిక సంబంధాలను పెంపొందించే విధానాలను అమలు చేస్తోంది. అదే బాటలో జపాన్ 2021లో ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రత్యేక మంత్రిత్వ స్థాయి సమన్వయాన్ని ప్రారంభించింది. అమెరికా వంటి దేశాలు సామాజిక కార్యక్రమాలు, ప్రజా ఆరోగ్య చైతన్య యాత్రల ద్వారా మానవ అనుబంధాలను బలోపేతం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఒంటరితనం ఇకపై కేవలం ఒక వ్యక్తిగత మానసిక సమస్య మాత్రమే కాదు, అది సమాజం మొత్తం సమష్టిగా ఎదుర్కోవాల్సిన యుద్ధం. ఇందులో గెలవాలంటే పరస్పర గౌరవం, అవతలి వ్యక్తి వ్యక్తిగత గోప్యతను పాటిస్తూనే పాత సంబంధాలను పునరుద్ధరించుకోవాలి.

ఆత్మీయ అనుబంధాలకు ఒక కొత్త ప్రారంభం

వృత్తిపరమైన ఉరుకుల పరుగుల జీవితంలో, ఒక 'సెలవు దినం' కేవలం విశ్రాంతి కోసం మాత్రమే కాదు, పాత మిత్రులను గుర్తు చేసుకునే అద్భుతమైన సందర్భం కావాలి. 2024లో ప్రపంచ ఆరోగ్య సంక్షేమ సంస్థ విడుదల చేసిన నివేదికలు స్పష్టం చేస్తున్నట్లుగా, వ్యక్తుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు పెరిగినప్పుడు మానసిక కుంగుబాటు తగ్గుముఖం పడుతుంది. సాంకేతిక ప్రపంచంలో మనం ఇచ్చే 'లైక్‌లు', చేసే 'కామెంట్‌లు' ఎప్పటికీ ఒక వ్యక్తి గొంతు ఇచ్చే ఆత్మీయతకు సాటిరావు. మనసులో పొరలు పొరలుగా దాగున్న జ్ఞాపకాలను మళ్లీ మేల్కొలిపే అద్భుత శక్తి ఒక్క చిన్న ఫోన్ కాల్‌కే ఉంది. అది సంవత్సరాల మౌనాన్ని ఒక్క నిమిషంలో చెరిపివేసి, జీవితంలో కొత్త ఉత్సాహాన్ని, భరోసాను నింపగలదు. మనల్ని మనం మానసికంగా కాపాడుకోవడమంటే, మన పాత సంబంధాలను మళ్లీ చిగురింపజేసుకోవడమే. అందుకే, కనీసం సెలవు రోజైనా మొహమాటాలను వీడి ఒక పాత మిత్రుడికి ఫోన్ చేయండి.

ఫిరోజ్‌ఖాన్



# కార్మికులపై ప్రభుత్వ, యాజమాన్య నిర్లక్ష్యమే ఆర్టీసి సమ్మెకు కారణం!





ఎస్.బాబు
అధ్యక్షుడు
టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

తెలంగాణ ఆర్టీసి జెఎసి 2204–2026 మొదటి డ్యూటీ నుండి సమ్మె సమర భేరీ మోగించింది. రాష్ట్రం ఏర్పడిన తరువాత నుండి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అనేక సమ్మెలు జరిగాయి. ఆత్మ బలిదానాలు చేసుకుని ఒరిగిన అమరులెందరో. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని 2012 సంవత్సరంలో మొట్టమొదట చెప్పింది కాంగ్రెస్ పార్టీ. ఆ సమయంలోనే యూనియన్ నాయకులు ఇతర రాష్ట్రాలకు వెళ్ళి విలీనంపై అధ్యయనం చేశారు. 2019 లో ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి ప్రెసిడెంట్ గా ఉన్న కాలంలో అన్న మాటలను పాఠకులకు ఒకసారి గుర్తు చేస్తున్నాను. "ఆర్టీసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థ. దీన్ని కేసీఆర్ భ్రష్టు పట్టించారు. ఆర్టీసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ ను కాంగ్రెస్ పార్టీ ఆమోదిస్తోంది. సంస్థలో డ్రైవర్, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తాము. అదనంగా కొత్త బస్సులు కొనుగోలు చేస్తాము. ఖాళీలు భర్తీ చేసే విధంగా రిక్రూట్మెంట్ చేపడతాము. ఆర్టీసి కార్మికులు చాలా కమిట్మెంట్, డెడికేషన్ ఉన్నవారు. వారి డిమాండ్స్ అంగీకరిస్తూ మా ఎన్నికల మేనిఫెస్టోలో పెడతాము. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విలీనం చేస్తాము". దురదృష్టవశాత్తు ఆయన పిసిసి ప్రెసిడెంట్ గా ఉన్న కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేదు. వస్తే ఆయనే ముఖ్యమంత్రి అయ్యేవారేమో. ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చేవారో లేక కేసీఆర్ మార్గాన్నే అనుకరించేవారో. ఎవరు అధికారంలోకి వచ్చినా ఆర్టీసి కార్మికులకి ఒరిగింది శూన్యం.

టిఆర్ఎస్ పార్టీ 2వ సారి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2019 లో అన్న మాటలు కూడా పాఠకులకు గుర్తుండే ఉంటాయి. "ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడం 100 కు 100 శాతం అసంభవం. ఇది భూగోళం ఉన్నంతకాలం జరిగే పని కాదు. ఇతర రాష్ట్రాల్లో కూడా విలీనం చేయలేదు. ఆంధ్రప్రదేశ్ లో కేవలం కమిటీ వేసి కాలక్షేపం చేస్తున్నారు". ఆ తరువాత ఏం అద్భుతం జరిగిందో కాని 31.07.2023న తెలంగాణ కేబినెట్ లో అనూహ్యమైన నిర్ణయం తీసుకుని తెలంగాణ ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తాం అంటూ కేసీఆర్ ప్రకటించారు. విలీనం 100 కు 100 శాతం అసంభవం అన్నారు పెద్దాయన. భూగోళం ఉండగా విలీనం జరగదన్న మేధావి, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం విలీనం నెత్తికెత్తుకున్నారా? 4 నెలల్లో సాధారణ ఎన్నికలు వస్తున్నందున 3వ సారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనే కేసీఆర్ వ్యూహం. ఆ వ్యూహంలో భాగంగానే ప్రతి వర్గానికి ఆయన తాయిలాలు ప్రకటించారు. దానిలో భాగమే ఆర్టీసి ఉద్యోగుల విలీనం. అంతే తప్ప ఆర్టీసి కార్మికులపై ప్రేమ కాదని రచ్చబండల వద్ద చర్చలు జరిగాయి. ఆ తరువాత సీన్ కట్ చేస్తే, ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఓడిపోయింది. దీనికి కారణం ఆర్టీసి కార్మికులే అంటూ తండ్రీ కొడుకులు గుండెలవిసేలా ఏడ్చారు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం అంటే ఇదేనేమో.

ఎ.రేవంత్ రెడ్డి 2022 లో పిసిసి ప్రెసిడెంట్ బాధ్యతలు తీసుకొన్న తరువాత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన అన్న మాటలు కూడా ఒక్కసారి నెమరు వేసుకుందాం. "2019 లో సమ్మె సందర్భంగా 50 మంది ఆర్టీసి కార్మికులను పొట్టన పెట్టుకున్న కేసీఆర్ అంతు చూస్తా. చనిపోయిన ఆ కుటుంబాలను కేసీఆర్ పరామర్శించలేదు. వారి ఉసురు ఆయనకు తగిలి పోతాడు. కాని నేను మాత్రం ఆర్టీసి కార్మికులను కడుపులో పెట్టి చూసుకుంటా. మా ఆర్టీసి కార్మికులకు నేను మాట ఇవ్వదలచుకున్నా. 40 వేల మంది ఆర్టీసి కార్మికులను గుండెల్లో పెట్టి చూసుకుంటా. మీ జీతభత్యాలు, పీఆర్సీలు ఇచ్చే బాధ్యత మేం తీసుకుంటాం. ఆర్టీసిని కాపాడి ప్రతి నెల మొదటి తారీకున జీతాలిస్తాం". పిసిసి అధ్యక్షుడిగా ప్రజలకు 6 గ్యారెంటీలు ఎలాగైతే ఇచ్చారో, మరో 6 గ్యారెంటీలను ఆర్టీసి కార్మికులకు కూడా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో 28వ పేజీలో కార్మికులకిచ్చిన 6 గ్యారెంటీలు ఇలా ముద్రించబడి ఉన్నాయి. "1.ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తాం. 2. 2013 పిఆర్సీ బకాయిలు చెల్లిస్తాం. 3. రెండు పీఆర్సీలు అమలు చేసి బకాయిలు కూడా చెల్లిస్తాం. గవర్నమెంట్ ఉద్యోగుల పరిధిలోకి ఆర్టీసి పిఆర్సీలు తెస్తాం. 4. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తాం. 5. ఆర్టీసి బస్సులను ఆధునీకరిస్తాం. అధునాతనమైన సౌకర్యాలతో కొత్త సర్వీసులను ప్రారంభిస్తాం. 6. ఆర్టీసి యూనియన్ల పునరుద్ధరణకు అనుమతిస్తాం". ఆర్టీసి జాయింట్ యాక్షన్ కమిటీ ఈ 6 డిమాండ్ల గురించే ప్రభుత్వాన్ని అడుగుతోంది. మిగిలిన డిమాండ్లు మేనేజిమెంట్ పరిధిలోనివి.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి రెండున్నర సంవత్సరాలు అవుతోంది. ఒకే ఒక్కసారి ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ తో మాట్లాడారు. అక్టోబర్ 2024న ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు ఒక్కసారి గుర్తు చేస్తాను. "ఆర్టీసి చాలా పెద్ద సంస్థ. ఇంత పెద్ద సంస్థలో ట్రేడ యూనియన్లు లేకుండా ఎలా? కార్మికుల కష్టాలు ఎవరికి చెప్పుకుంటారు? ట్రేడ యూనియన్లు సంస్థలో తప్పక ఉండాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల వైపే ఉంటుంది. యూనియన్లను తప్పకుండా పునరుద్ధరించే బాధ్యత నాది". ఆ తరువాత యూనియన్లతో ఆయన మాట్లాడిన సందర్భాలు లేవు. 07.05.2025న జెఎసి సమ్మెకు సిద్ధమైనప్పుడు కూడా ఆయన యూనియన్లతో మాట్లాడలేదు.

ప్రతి సందర్భంలో రవాణా శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతున్నారు. వారి మాటలు కూడా ఒక్కసారి గుర్తు చేసుకుందాం. "నేనూ ట్రేడ యూనియన్ లీడర్నే. కార్మిక పక్షపాతిని. నా డోర్లు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. విలీనం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కమిటీ వేశాం. కొత్త బస్సులు ఇస్తున్నాం. డి.ఎ లు ఇచ్చాం. ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చాం. ఒక పీఆర్సీ ఇచ్చాం. ఇప్పుడిప్పుడే సంస్థ నష్టాలు పోయి లాభాల్లోకొస్తోంది. సమ్మె చేయవద్దు. నన్ను నమ్మండి. రిటైరైన నాయకులు టిఆర్ఎస్ మాటలు విని కార్మికులను రెచ్చగొడుతున్నారు" అని పాడిన పాటే పాడుతున్నారు. డోర్లు తెరిచే ఉంటాయంటారు. మనస్సు మాత్రం తెరవరు. ఆర్టీసి లాభాల్లో ఉందంటున్నారు. మరి సంస్థ లాభాల్లో ఉన్నప్పుడు పేస్కేల్ ఎందుకివ్వరని కార్మికులు అడుగుతున్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం, ట్రేడ యూనియన్ యాక్ట్ ప్రకారం ఎన్నికలు ఎందుకు నిర్వహించరని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఒక పీఆర్సీ ఇచ్చామన్నారు. ఆ పీఆర్సీలో రిటైరైన ఉద్యోగులకు ఇంతవరకు దాన్ని అమలు చేయలేదు. 2017 పీఆర్సీకి సంబంధించిన బకాయిలు కూడా ఉద్యోగులకు ఇవ్వలేదు. పీఆర్సీకి సంబంధించిన అలవెన్సులు, ఫ్రింజ్ బెనిఫిట్లు నేటి వరకు అమలు చేయలేదు. రిటైరైన నాయకులు టిఆర్ఎస్ మాటలు విని కార్మికులను రెచ్చగొడుతున్నారు అని రవాణాశాఖ మంత్రి అంటున్నారు. కాని అది వాస్తవం కాదు. ఆర్టీసిలో టిఆర్ఎస్ అమలు చేసినవే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేస్తోంది. ఆర్టీసి యాజమాన్యం యూనియన్లను బూచిగా చూపిస్తూ వారి భుజాలపై తుపాకులు ఉంచి ప్రభుత్వాన్ని కాల్చివేస్తోంది అనే విషయాన్ని రవాణాశాఖామాత్యులు గుర్తించడం లేదు. ఇక్కడ గవర్నమెంట్ ఒక లాజిక్ మిస్ అవుతోంది. కేసీఆర్ చెప్పిన మాటలే ఆర్టీసి యాజమాన్యం ఆచరిస్తోంది. అవే మాటలు ఈ ప్రభుత్వానికి చెప్పి, ఆచరింపచేస్తూ ఓ పథకం ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల్లో, ఆర్టీసి కార్మికుల్లో అన్ పాప్యులర్ చేస్తోంది. సమ్మె నోటీసులో 32 డిమాండ్లు ఉన్నాయి. వాటిలో 6 డిమాండ్లే గవర్నమెంట్ నెరవేర్చేవి. మిగిలిన 26 డిమాండ్లు ప్రభుత్వ పరిధిలోనివి కావు. ఈ 26 డిమాండ్లు పరిష్కరించాల్సిన బాధ్యత మేనేజిమెంట్ ది. మొత్తం డిమాండ్లకు ప్రభుత్వమే బాధ్యత వహించడమంటే మేనేజిమెంట్ పన్నిన ఉచ్చులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కోవడమే. ఈ చిన్న లాజిక్ ను మిస్ అయి ప్రభుత్వ పెద్దలు పరమానందయ్య శిష్యుల్లా తయారయ్యారు.

సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత జాయింట్ యాక్షన్ కమిటీని చర్చలకు ఆహ్వానించాల్సిన బాధ్యత ఆర్టీసి మేనేజిమెంట్ దే. కన్సిలేషన్ ఆఫీసర్ మేనేజిమెంట్ ను చర్చలకు ఆహ్వానించినా హాజరవకపోవడం మేనేజిమెంట్ తప్పిదం. ఈ రెండు విషయాలు గుర్తించి ప్రభుత్వం, ఆర్టీసి మేనేజిమెంట్ మరియు జెఎసిల మధ్య కన్సిలేషన్ ఆఫీసర్ తో చర్చలు జరిపిస్తే సమస్య అక్కడే పరిష్కారం అవుతుంది. అందువల్ల ప్రభుత్వంపై కార్మికుల్లో కూడా ఒక నమ్మకం ఏర్పడుతుంది. మేనేజిమెంట్ కోర్టులో ఉన్న సమ్మె బాల్ ను ప్రభుత్వంపై విసిరి మేనేజిమెంట్ వేడుక చూస్తోంది. ఈ వ్యూహం ప్రభుత్వానికి అర్థం కావటం లేదా?

ఆర్టీసి యాజమాన్యం పరిస్థితి ఒకసారి చూద్దాం. 2019 డిసెంబర్ న ఆర్టీసిలో ట్రేడ యూనియన్లు లేవని, 2 సంవత్సరాల పాటు ఎన్నికలు నిర్వహించవద్దని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు, కాబట్టి ట్రేడ యూనియన్లను అనుమతించడం లేదు, వాటికి ఎన్నికలు నిర్వహించడం లేదు". యాజమాన్యానికి జెఎసి ఎన్ని లేఖలు వ్రాసినా స్పందించదు. ప్రత్యక్ష కార్యాచరణ చేసినా ఉలుకు పలుకు ఉండదు. సమ్మె నోటీసిచ్చినా కనీసం పిలిచి మాట్లాడదు. కన్సిలేషన్ ఆఫీసర్ చర్చలకు రమ్మని ఆహ్వానించినా మేనేజిమెంట్ హాజర్ కాదు. ట్రేడ యూనియన్లకు ఎన్నికలు పెట్టమని కోర్టు తీర్పులు చెప్పినా వినదు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుంది. 16 గంటలు డ్యూటీ చేయిస్తూ ఎంటిడబ్ల్యు యాక్ట్ ని ఉల్లంఘిస్తుంది. కార్మికులకు వారి లీవ్ అకౌంట్‌లో లీవ్ బ్యాలెన్స్ ఉన్నా, లీవులు ఇవ్వకుండా లీవ్ వితవుట్ పే చేస్తుంది. ఇంట్లో ఎవరైనా చనిపోయిన సందర్భంలో సెలవు కావాలంటే శవం దగ్గరుండి సెల్ఫీ పంపమంటుంది. రిక్రూట్మెంట్ చేయదు. పనిభారాలు పెంచుతుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆర్టీసి యాజమాన్యం ఓ జడపదార్థం. ఇక లేబర్ కమిషనర్ అయితే సమ్మె నోటీసు ఇవ్వగానే వెంటనే అడ్మిట్ చేసుకుంటారు. ఇదొక వ్యూహం ప్రకారం చేస్తారు. ఎందుకంటే కన్సిలేషన్ క్లోజ్ కాకుండా సమ్మె లోకి పోకూడదు. అది చట్టం. వాళ్ళంతట వాళ్ళు క్లోజ్ చేయరు. యూనియన్లు కన్సిలేషన్ క్లోజ్ చేసుకుంటే ఇల్లీగల్ అంటారు. కన్సిలేషన్ మీటింగుకు మేనేజిమెంట్ హాజర్ కాకపోయినా వారిపై ఏ చర్యలూ ఉండవు. లేబర్ కమిషనర్ కు మేనేజిమెంట్ ను ప్రాసిక్యూట్ చేసే అధికారం ఉన్నా, వారు ఆ పని చేయరు. కోర్టులేమంటాయంటే వాదోపవాదాలు వింటారు. ప్రభుత్వ, యాజమాన్యాలదే తప్పు అంటూ వాయిదాల మీద వాయిదాలు వేస్తూ ఉంటారు. కోర్టులు న్యాయం పక్షమే వహిస్తాయంటూ హైప్ తీసుకొచ్చి, చివరకు నీరు గారుస్తారు. పస లేని తీర్పులిస్తారు. మరి కార్మికుల పరిస్థితేమిటి? 18 వేల మంది రిటైరైనా, రిక్రూట్మెంట్ లేకపోవడం వల్ల ఆ పనిభారాన్ని కూడా మిగిలిన కార్మికులే మోస్తున్నారు. అలా పనిభారాలు పెరగడం, యాజమాన్యపు వేధింపులతో దిక్కుతోచని స్థితి. ఫలితంగా గుండె పోట్లతో స్టీరింగులపై అకాల మరణం. కండక్టర్లు పక్షవాతం, కిడ్నీ వ్యాధులతో మృత్యుకూపంలోకి పోతున్నారు. ఆర్టీసిలో జరుగుతున్న చరిత్ర ఇది. ప్రజలారా! మేధావులారా! రాజకీయ నాయకులారా! పాఠక మహాశయులారా! ఇప్పుడు చెప్పండి ఈ పాపం ఎవరిది? ఆర్టీసి కార్మికులను ఓటు బ్యాంకుగా చూసే రాజకీయ నాయకులదా? కార్మికులను నమ్మబలికి మేనిఫెస్టోలో వారి సమస్యలు పెట్టి, అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోని ప్రభుత్వ పెద్దలదా? భారత రాజ్యాంగం ఇచ్చిన ట్రేడ యూనియన్ల హక్కులను నోటిమాటతో ఉక్కుపాదం మోపినా న్యాయం చెప్పలేని, కళ్ళున్నా చూడలేని న్యాయ వ్యవస్థదా? సమస్యల పట్ల మధ్యవర్తిత్వం వహించి ఇరు వర్గాలను కూర్చోబెట్టి చర్చించలేని లేబర్ కమిషనర్ దా? సమస్యలు పరిష్కరించకుండా దీర్ఘకాలికంగా కార్మికుల శ్రమశక్తిని దోచుకుంటున్నవారి చేష్టలకు కారణమైన యాజమాన్యానిదా? ఇన్ని ఒత్తిళ్ళు తట్టుకుంటూ నెట్టుకొస్తున్న కార్మికులు సమ్మె చేయక మరేం చేస్తారు? సమ్మె లోకి వెళ్ళకుండా చూసే బాధ్యత ప్రభుత్వ, యాజమాన్యాలదే.

# అన్ని వర్గాల ప్రజలకు 'తేనీరు' ఓ దివ్య కానుక


ప్రపంచవ్యాప్తంగా చాయ్ ప్రియులకు కొదవలేదు. చాలా మందికి తేనీరు పడందే రోజు గడవదు. తెల్లవారక ముందే టీ సుగంధం ఊరు వాడల్లో కవాతులు చేస్తున్నది. అతిథి మర్యాదలకు టీ ఒక సర్వసాధారణ పానీయం. వేడి వేడి తేనీరు లేదా టీ రుచి తగలందే దినం ప్రారంభం కాదు. ధనిక, పేద భేదం లేకుండా అందరి అమృత పానీయం చాయ్. తేయాకును నీటిలో మరిగించి కషాయంగా మార్చి చక్కెర కలిపితే గరం గరం చాయ్ రుచులు గుప్పున వ్యాపిస్తాయి, మెదడు ఉత్తేజితం అవుతూ, నాసికాపుటాలు చైతన్యం అవుతాయి. రోజుకు పదుల సార్లు టీ తాగే జనులు ఉన్నారు. ఒకరి ఏకాగ్రతను పెంచడానికి, ఒకరి నిద్ర మబ్బును తరమడానికి, ఒకరిలో శక్తిని నింపడానికి, మరొకరికి నిద్రకు ఉపక్రమించడానికి తేనీరు ఉపయోగపడుతున్నది. తేనీరు మన జీవన విధానంలో ఒక అవిభాజ్య భాగం అయ్యింది. చాయ్ అలవాటు లేని వారు అతి తక్కువ. తేనీరు ప్రాధాన్యాన్ని అవగాహన చేసుకునేందుకు ప్రతి ఏటా 21 ఏప్రిల్ రోజున క్వీన్ ఎలిజబెత్ జన్మదినం సందర్భంగా జాతీయ తేనీరు దినోత్సవం (నేషనల్ టీ డే) పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ టీ దినోత్సవ ఇతివృత్తంగా అధికంగా మరుగబెట్టడం అధికంగా వాడడం (బ్రివ్ మోర్, డూ మోర్) అనే అంశాన్ని తీసుకున్నారు.

**ప్రపంచ టీ చరిత్ర:**

భారతదేశానికి టీని పరిచయం చేసిన ఘనత 'రాబర్ట్ ఫార్చ్యూన్'కు దక్కుతుంది. భారతీయుల జీవనశైలిలో సహితం ఒక భాగమైన చాయ్ పానీయం బలహీనతగా కూడా మారిపోయింది. తేన్చుకున్నా చైనా మాండరిన్ భాషలో 'చా' అంటారు. అలాగే పార్టీలో 'చాయే' అని అంటారు. వీటి నుంచే 'చాయ్' అనే పదం వచ్చి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అరాబిక్‌లో 'షా' అని, రష్యన్ భాషలో 'చాయే' అని, స్వాహిలిలో 'చాయ్' అని పిలుస్తారు. పలు ప్రాంతాల్లో 'టీ' అని పిలుస్తారు. టీ తాగడం ఒక అలవాటుగా కూడా మారకపోవడం చూస్తున్నాం. 'కామెల్లియా సినెన్సిస్' అనే పేరుగల చెట్టు ఆకులను ఎండబెట్టి పొడి చేసి నీటిలో వేసి మరిగిస్తే గరం గరం సుగంధ పానీయం 'చాయ్' తయారు అవుతుంది. క్రీ పూ 59లో చైనాలో నమోదు అయిన టీ పానీయం వేగంగా ప్రపంచంలో విస్తరించింది. చైనా వైద్యుడు 'హూడా టువో' తొలిసారి తన రచనలో టీ ప్రస్తావన తీసుకువచ్చారు. 16వ శతాబ్దంలో పోర్చుగీస్‌లో, 17వ శతాబ్దంలో బ్రిటీష్‌లో టీ తాగడం ఒక ఫ్యాషన్ అయ్యింది. తర్వాత బ్రిటీస్ వలస పాలనలో భారత్‌లోకి టీ ప్రవేశించడం, ప్రజలకు అలవాటుగా మారడం జరిగింది.

**భారత్‌లో టీ రకాలు:**

రసాయన పరంగా టీ పొడిలో దాదాపు 3 శాతం కెఫీన్ ఉంటుంది. కెఫీన్‌తో పాటు టీలో పాలిఫినాల్స్, థియోబ్రోమిన్, థియోఫిలిన్ అనే క్లాంథైన్, ఉత్ప్రేరకాలు తక్కువ పరిమాణంలో ఉంటాయి. టీలో ఉన్న కెఫీన్ రసాయనం వల్ల చురుకుదనం పెరగడం జరుగుతుంది. తేనీరు పలు రకాలుగా ఉంటుంది. వీటిలో బ్లాక్, గ్రీన్, ఓలాంగ్, వైట, డార్క్, యెల్లో టీలు అతి ముఖ్యమైనవి.




ప్రాంతీయంగా మట్కా, మసాలా, బెల్లం, ఎర్ల్ గ్రే, హెర్బల్, పుయర్, ఫ్లేవర్డ్ టీ లాంటివని కూడా ఉంటాయి. సామరస్యం, గౌరవం, స్వచ్ఛత, ప్రశాంతత అనే నాలుగు సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది.

**టీ క్యాపిటల్ ఆఫ్ ఇండియా – అస్సాం:**

డిబ్రుగఢ్‌ను భారత టీ నగరంగా, అస్సాంను భారతదేశ టీ కేపిటల్‌గా వ్యవహరిస్తారు. మొదట చేదుగా, తర్వాత తీపిగా. అంతిమంగా నోటిలో చాలా సేపు నిలిచిపోయే రుచిని టీ అందిస్తుంది. భారత్‌లో తొలిసారి 1839లో అస్సాం టీ కంపెనీ ప్రారంభం అయ్యింది. భారత్‌లో అత్యధికంగా అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, కర్నాటక లాంటి రాష్ట్రాలు టీ ఉత్పత్తిలో ముందున్నారు. మన వంటింటి అత్యవసర పానీయంగా టీ పేరు అత్యంత ప్రజాదరణ పొందింది. మనం నిత్యం అధిక మొత్తంలో లేదా ఎక్కువ సార్లు టీ తాగకుండా కొన్ని పరిమితులు విధించుకొండి. చాయ్ వాలా అనబడే సాధారణ పదంతో మన ప్రధాని నరేంద్ర మోదీ జీవితానికి విడదీయరాని సంబంధం ఉన్నది. టీ చప్పరిస్తూ బాతాకా నీ కొట్టడం, ఒప్పందాలు చేసుకోవడం, స్నేహితులను పెంచుకోవడం, ప్రపంచ ముచ్చట్లను చర్చించడం, టీ కొట్టు పెద్ద రచ్చబండ కావడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం

అందోల్ జోగిపేటలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పేదల సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు బస్వాపురం మల్లయ్య, మల్లయ్య, విజయలక్ష్మి, జగదీశ్వర్‌ల ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇల్లు కల నిజమవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి మంత్రి దామోదర్ రాజనర్సింహాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల గృహావసరాలను తీర్చేందుకు ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి ఎవరూ ఇల్లు లేకుండా ఉండకుండా



చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అందోల్‌జోగిపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మా ణం శరవేగంగా నిర్మాణం పూర్తి అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ రేఖ ప్రవీణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త: మంత్రి దామోదర్ రాజనర్సింహా**

విశ్వగురు మహాత్మా బసవేశ్వర 893వ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సోమవారం జోగిపేట చౌరస్తాలో ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికుడు, కవి, రాజనీతిజ్ఞుడు, అందరికి ఆదర్శనీయుడని కొనియాడారు. వారి బోధనలు, ఆశయాలు ఆచరణీయమన్నారు. పనే ప్రత్యేక దైవం అని వారు బోధించారన్నారు. ప్రతి వ్యక్తి తన కష్టార్జితంతో జీవించాలని, శ్రమకు గౌరవం ఇవ్వాలని వారు చాటి చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు , లింగాయత్ సమాజం , సామాజిక వేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరవలేనివని, వారి పోరాట స్ఫూర్తి తోనే సమాజంలో న్యాయం, సమానత్వం కోసం ఉద్యమించాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కొమరం భీం ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. సోమవారం మం డల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆమె ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ఇంద్రవెల్లి సంఘటన ఆదివాసీ హక్కుల కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటానికి ప్రతీక అని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఈ సంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని ఆమె తెలిపారు. ఇంద్రవెల్లి చరిత్రకు దేశవ్యాప్తంగా గుర్తింపు రావాల్సిన అ వసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు, వారి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, ఆదివాసీ పెద్దలు పాల్గొన్నా రు.

## డిఎంఇ కార్యాలయం వద్ద మహాధర్నా

రిమ్స్ డైరెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు 21న హైదరాబాద్‌లోని డిఎంఇ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు రిమ్స్ కార్మికులు తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో సోమవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు అనుమతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కోఠిలోని డిఎంఇ కార్యాలయం వద్ద చేపట్టే ఈ నిరసన కార్యక్రమానికి ఆదిలాబాద్ రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుండి సుమారు 30 మంది కార్మికులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పర్యటనకు కార్మికులకు సహకరించాలని డైరెక్టర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దోంగ్రే చందు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ముజీబ్, సహాయ కార్యదర్శి కన్నల లక్ష్మి , జిల్లా నాయకురాలు యు. నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 91 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్‌డీఓ సాయన్న, ఆర్డీఓ రాజేంద్రకుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కెలక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## బసవేశ్వరుడు సమాజానికి స్ఫూర్తి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** వృత్తిని దైవకార్యంగా భావించి కష్టపడి పనిచేయటమే నిజమైన దేశభక్తి అని చెప్పిన అభ్యుదయ బసవేశ్వరుడు సమాజానికి స్ఫూర్తిదాయకమని జిలా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కలెక్టరేట్ కార్యలయంలో బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ తరఫున నిర్వహించిన బసవేశ్వర 893 వ జయంతోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీసీఈఓ ఎల్ల య్య, జిల్లా అధికారులు వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బసవేశ్వరుడు సాంప్రదాయక సమాజంలో కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన ఒక అభ్యుదయ వాది అని తెలిపారు. మానవతా విలువలను ఆచరణలో పె ట్ట డం ద్వారా ఆ మహనీయుడి ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని తెలపారు. కష్టపడి పని చేయడమే నిజమైన దేశభక్తి అనే బసవన్న గారి సందేశం నేటికీ కాలానుగుణ ఔచిత్యాన్ని చాటి చెబుతుందన్నారు. ఈ కా ర్యక్రమంలో వీరశైవ లింగాయత్ మెదక్ జిల్లా లింగాయత్ సమాజం అధ్యక్షుడు లింగన్న గారి మల్లప్ప, గౌరవ అధ్యక్షులు పి డి ఆనందం, జిల్లా జనరల్ సెక్రెటరీ వీరేశం, కోశాధికారి ప్రభు కుమార్, శెట్టి శ్రీకాంత్ తప్ప, న త్త టి సందీప్ కుమార్ తదితరులు వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నా రు.

## భక్తులకు శుద్ధజలాలు అందించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** గూడూరు శ్రీగురుపీఠానికి వచ్చే భక్తులకు శుద్ధజలాలు అందించాలనే ఉద్దేశ్యంతో భక్తుల సౌకర్యార్థం వాటర్‌ప్లాంట్‌ను శ్రీగురుపీఠం ఛైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం శివకుమార్‌గౌడ్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధనీటిని భక్తులు వినియోగించుకోవాలన్నారు. శ్రీగురు పీఠంలోని శ్రీషిరిడి సాయిబాబా, దత్తాత్రేయ మహాస్వామిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వస్తున్నారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్‌లు బేగరి నర్సయ్య, రాజిపేట వెంకటేశ్వర్, ట్రస్టు సభ్యులు సూర్యంకుమార్‌గౌడ్, వేద పండితులు వామనశర్మ, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యం భిక్షపతి, అడ్మిన్ కొంతాన్‌పల్లి సత్యనారాయణగౌడ్, యాదాగౌడ్, మొలుగు నాగేశ్వర్‌రావు, కొండల్, పోచాగౌడ్ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయం

ఎమ్మెల్యే సునీతా రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలల్లోనే రైతులు ధాన్యాన్ని అమ్మాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని ఖాజీపేట గ్రామంలో గ్రామమహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మితే మద్దతు ద్వారా వస్తుందని అన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాని కి ఏ గ్రేడ్‌కు రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి రూ.2,369 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో. మమ్మద్ మోజంహుస్సేన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మధుకర్ రెడ్డి, సర్పంచులు యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ కరుణాకర్, ఎంపీడీవో ,ఆర్ఐ సిద్ధిరామిరెడ్డి, ఏవో దీపిక, వివో ఏ సప్న గ్రామస్తులు మైపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే పాల్వాయి

రూ.2400 మద్దతు ధర పొందాలని సూచన



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మక్కలు పండించిన రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కాగజ్ నగర్ బీట్ మార్కెట్‌లో మార్క్ ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావులతో మాట్లాడి నియోజకవర్గానికి రెండు కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. కాగజ్ నగర్‌తో పాటు త్వరలోనే కౌటాలలో మరో కేంద్రాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన 2,400 రూపాయల మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఈ కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, డిసిఒ మోహన్, వ్యవసాయ అధికారులు రామకృష్ణ, నాగరాజు, గిరిషన్, కార్తీష, ప్రేమలత, సతీష్ గౌడ్, రేష్మిత, సృజన, జ్ఞానేశ్వర్, విశాల్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు అంటూ ఫీజుల కోసం సరికొత్త దందా

విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సమ్మర్ క్యాంపుల పేరిట ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల అన్నారు. సోమవారం టిఎస్ఎ ఆధ్వర్యంలో డీఈఓ అశోకకు వినతిపత్రం అందజేసి జ్వాల మాట్లాడారు. జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ విపరీతమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ఇంటింటా కరపత్రాలు పంచుతూ పబ్లిసిటీ చేస్తూ అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సమ్మర్ క్యాంపులంటూ స్కూల్ ఫ్యాకల్టీతోనే స్పెషల్ ఆక్టివిటీస్ చేయిస్తూ నిపుణుల చేత ఆర్ట్ క్రాఫ్ట్స్ డాన్స్ నేర్పుతున్నామని విద్యార్థుల వారి తల్లిదండ్రులు మోసం చేస్తూ సబ్జెక్టు చెప్పే టీచర్లతో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నారన్నారు. విపరీతమైన ఎండలు ఉన్న పరిస్థితుల్లో విద్యార్థుల ఆరోగ్యాలతో ఆటలాడుతున్న కొన్ని కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్లపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎండ తీవ్రతను విద్యార్థులు తాళలేక పోతే వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందన్నారు. నిజామాబాద్‌లో పుట్టగొడుగుల్లా సమ్మర్ క్యాంపుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు.



## అశోక్ మహుల్కర్‌కు డాక్టరేట్




**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రానికి చెందిన భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్‌కు అమెరికాలోని ఇంటర్నేషనల్ లూసియానా రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆదివారం రాత్రి పూణేలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన ఈ పట్టాను అందుకున్నారు. గత మూడు దశాబ్దాలుగా ఉచిత వైద్య శిబిరాలు, గిరిజన అభ్యున్నతి, అంబేద్కర్ మరియు బుద్ధుడి బోధనల ప్రచారంలో ఆయన చేసిన సేవలను గుర్తించి యూనివర్సిటీ ఈ గౌరవాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయడం తన లక్ష్యమని, ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి శివదాస్, యూనివర్సిటీ డైరెక్టర్లు అన్నీ కృష్ణ భరద్వాజ్, రమేష్ బినోకేర్ పాల్గొన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కుల, మత, లింగ, వర్ణ, వర్గ బేధాలకు వ్యతిరేకంగా బసవేశ్వర చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అందుకే ఆయనను విశ్వగురువుగా దార్శనికుడిగా, సంస్కారవాదిగా ప్రపంచం కీర్తిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నర్సయ్య, ప్రశాంత్, చంద్రశేకర్, బస్వరాజ్, రాములు, రాజు, సంతోష్, నాగరాజు, సదాశివ్, కాశీనాథ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మంచిర్యాల పట్టణం రాజీవ్ నగర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తూ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కాలేజ్ రోడ్డులో రూ.129.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, రూ.23.75 కోట్లతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ విభాగం పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ నిధులు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో వ్యవహరించి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదర్శ పాఠశాలల వసతి గృహ నిర్మాణ పనులను కూడా పరిశీలించి వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి

**ప్రజాపక్షం/నర్సాపూర్:** మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి లేదని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్ర నర్సాపూర్ పట్టణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్నని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి ప్రధాని మోదీయే కారణమని అన్నారు. మోదీ ప్రభుత్వం కుట్రతో మహిళా బిల్లు చట్టం ముసుగులో 131 సవరణతో డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ చట్టం తీసుకువచ్చిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మహిళలకు రిజర్వేషన్ తీసుకురావడం కాదని అన్నారు. ఈ మేరకు ప్రధానిమోదీ, బిజెపి నాయకులు మహిళలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 33 రిజర్వేషన్ తీసుకొచ్చిందని అంతేగాక పలు రాష్ట్రాలకు మహిళలను ముఖ్యమంత్రులుగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ అన్నారు.మహిళా రిజర్వేషన్ చట్టం ముసుగులో డీలిమిటేషన్ కు ముడి పెడితే కాంగ్రెస్ పార్టీ సహకరించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్, శివ్వంపేట్ మండల అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సర్పంచ్ రవీందర్ యాదవ్, దాడిగా నరేష్, మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొనారు.

## బసవేశ్వరుడి చరిత్రను భావితరాలకు అందించాలి

జిల్లా కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మహర్షి శ్రీ బసవేశ్వరుడి జీవిత చరిత్రను నేటి తరం తెలుసుకోవడంతో పాటు భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మంగతో కలిసి కలెక్టర్ బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప తత్వవేత్త, సంఘ సంస్కర్త అని కొనియాడారు. సమాజంలో కుల వివక్ష, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది అని పేర్కొన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ‘సిగాచి’ బాధితుల గళం



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పాశమైలారం ‘సిగాచి’ పరిశ్రమ ప్రమాద బాధితులకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించిన మహాదర్నా కొనసాగింపుగా నేడు తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బాదితులు ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా బాదితుల దీనస్థితిని చూసి జిల్లా అదనపు కలెక్టర్ స్వయంగా బయటకు వచ్చి వారి సమస్యలను విన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దీర్ఘకాలికంగా వైద్యం పొందుతున్న రాజేష్ కుమార్ చౌదర్ సుష్మ ,దివ్వల పరిస్థితిని అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఈఎస్ఐ వైద్యుల సలహా మేరకు ఆసుపత్రిలో వైద్యాన్ని తప్పనిసరిగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని దీనిపై కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి చికిత్సకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే వీరికి రావాల్సిన పెండింగ్ వేతనాలను కూడా కంపెనీ ద్వారా ఇప్పించడం జరుగుతుందని బాదితులకు భరోసా ఇచ్చారు. మరణించిన 54 మంది కార్మికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రకటించిన ఒక కోటి రూపాయల పరిహారం గురించి అదనపు కలెక్టర్ స్పందిస్తూ ఈ అంశం ప్రస్తుతం హైకోర్టులో ఉన్నందున కోర్టు తీర్పు ప్రకారమే పరిహారం చెల్లింపు ఉంటుందని తెలిపారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభు గౌడ్ తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట ఇచ్చిన తరువాత మళ్లీ కోర్డు తీర్పుల కోసం భాదితులు వేచి చూడమనడం అంటే అది ముఖ్యమంత్రి మాటను అవమనపరచడమే అవుతుందన్నారు. అశోక్ కుమార్ , ప్రభుగౌడ్ మండిపడ్డారు. కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి హామీ మేరకు ప్రతి భాదిత కుటుంబానికి ఒక కోటి రూపాయల నికర పరిహారం అందేలా ప్రభుత్వం కంపెనీపై ఒత్తిడి తీసుకురావాలని లేదంటే ప్రభుత్వమే చెల్లించాలని టిపిజెఎసి బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కార్మికుల హక్కులైన పీఎఫ్ ,ఈఎస్ఐ లను పరిహారంలో కలిపి చూపించే కంపెనీ కుట్రలను అడ్డుకోవాలని కోరిం ది. ఈ కార్యక్రమంలో టిపిజెఎసి జిల్లా ప్రతినిధులు శ్రీధర్, మహేంద్ర (కోఆర్డినేటర్) ఆర్.లక్ష్మి, (కో.కన్వీనర్) ఎ. మానస (కో కన్వీనర్) బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున్ పాటిల్, బిసి కార్యదర్శి, సుదాకర్, ప్ర ధాన కార్యదర్శి కోటి వీరమణి, కార్యదర్శి ముత్యాన్ని శ్రీనివాసులు, సిగాచి బాధితులు ప్రీతి కుమారి , ఇందు ,సోనియాకుమారి, జుంరుమియా, మున్మున్ సింగ్, అనిరుద్, రాజేష్ చార్మినాదేవి , 22 మంది బాధితులు పాల్గొన్నారు.

## పాఠశాలలో నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** పాఠశాలలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యతపై అవగాహన కింద సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలికల పాఠశాల, వసతి గృహంను మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత ఉపాధ్యాయులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంట విధానం, వంట తయారీ ప్రక్రియను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం శుభ్రంగా, రుచికరంగ ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో సరైన ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు.అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించాలని సూచించారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగిరి మండలం 8 ఇంక్లైన్ కాలనీ కు చెందిన కే.రాజమ్మ 69/ఈ సర్వే నెంబర్లు గల 26 గంటల భూమి ఉందని, తన భూమిని తప్పుడు కాగితాలతో అమ్మినట్లు కాగితాలు చూపించి పట్టా చేయించుకోవాలని చూస్తున్నారని తన సంతకాలు ఫోర్జరీ చేశారని, తన పట్టా ఎవరి పేరు మీద చేయవద్దని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జూలపల్లి మండలం కుమ్మరి కుంట గ్రామానికి చెందిన ఏ. భూమయ్య తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిందని,ఇంటి నిర్మాణానికి 10 నుంచి 12 లక్షలు ఖర్చు అవుతుందని, అదనంగా డబ్బులు పెట్టే కట్టుకుని స్తోమత తనకు లేదని, ప్రభుత్వం అందించే ఐదు లక్షల రూపాయలతో రేకుల షెడ్డు నిర్మాణం కోసం వెసులుబాటు కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఎస్. మదన్ మోహన్ తనకు ఆరు సంవత్సరాల క్రితం రైలు ప్రమాదంలో ఒక కాలు పోయిందని, తనకు ఇంతవరకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు కాలేదని, తనకు దివ్యంగుల పెన్షన్, అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పౌరసరఫరాల శాఖ అధికారిక రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రజావాణి సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర: తెలంగాణ రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. సోమవారం గంగాధర మండలం మధురానగర్‌లో హాక నిర్వామకుడు జాగిరపు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాక ఫార్మర్స్ సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసిఎంఎస్, రైతు సేవా కేంద్రాల మాదిరిగానే హాక సర్వీస్ సెంటర్‌లోనూ వ్యవసాయ సేవలు అందుతాయని తెలిపారు. రైతులు హాక సర్వీస్ సెంటర్లను వినియోగించుకుని వ్యవసాయ సేవలు పొందాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచులు కడారి రేణుక కనుకయ్య, వేముల భాస్కర్, రేండ్ల శ్రీనివాస్, బాసవేణి శ్రీనివాస్, తూం రాజు, సత్తు కనుకయ్య, సాగి అజయ్ రావు, మేర్గ కొండయ్య, ప్రేమ్ కుమార్, మంత్రి మహేందర్, పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలు కొనసాగించాలి



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : మహనీయుల ఆశయాలను కొనసాగించాలిసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం తత్వవేత్త, సామాజిక సంస్కర్త మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. 12వ శతాబ్దపు తత్వవేత్తగా బసవేశ్వరుడు సమానత్వాన్ని బోధించారని, అనునభవ మంటపం స్థాపించారని అన్నారు.కుల,లింగ, వర్ణ విభేదాలను వ్యతిరేకించిన మహాత్మా బసవేశ్వరుని తత్వాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు లత, రాజ గౌడ్, జిల్లా బి.సి వెల్ఫేర్ అధికారి సునిత తదితరులు ఉన్నారు.

## రెండు రోజుల్లో విక్రయించకుంటే ఆందోళన

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కొత్తపల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను అనేక ఇబ్బందులు పెడుతున్నారని, రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంబించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి, నగునూరులోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనేక రోజుల నుంచి కల్లాల్లో ధాన్యం ఆరబోసారని, ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల ఆ ధాన్యం ముమురాలుగా మారే అవశాం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వాన కురిస్తే గాలి దుమారం లేస్తే మాత్రం రైతుల నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. సిపిఐ మండల నాయకుడు రైతులు మునిగంటి రాజు, గాందె లక్ష్మణ్‌రావు, రాజయ్య, సాయిబాబు, రాములు, నాంపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎమ్మార్వోగా బాధ్యతలు



ప్రజాపక్షం /మల్లాపూర్ : మల్లాపూర్ మండలం నూతన ఎమ్మార్వో గా రామచందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లగా ములుగు జిల్లాలో డిప్యూటీ తాసిల్దారుగా పనిచేసి తహసిల్దారుగా పదోన్నతి పై మల్లాపూర్ మండలంకు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మార్వోకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# ‘జగిత్యాలలో’ కెసిఆర్‌కు జననీరాజనం

### గులాబీమయమైన రోడ్లు.. హోరెత్తిన నినాదాలు

ప్రజాపక్షం/ జగిత్యాల : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు జగిత్యాల జిల్లా కేంద్రంలో అపూర్వ స్వాగతం లభించింది. పర్యటనలో భాగంగా పట్టణానికి చేరుకున్న కేసీఆర్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.ఉప్పెనలా తరలివచ్చిన జనం కేసీఆర్ రాకను పురస్కరించుకుని జగిత్యాల పట్టణం గులాబీ రంగును పులుముకుంది. ముఖ్య కూడళ్లన్నీ ఫ్లెక్సీలు, తోరణాలతో నిండిపోయాయి.కేసీఆర్ కాన్వాయ్ పట్టణంలోకి ప్రవేశించగానే జనం జై తెలంగాణ జై కేసీఆర్ అనే నినాదాలతో హోరెత్తించారు. వేలాది మంది కార్యకర్తలు బైక్ ర్యాలీలతో ఆయనకు రక్షణ కవచంలా నిలిచారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ తదితరులు కేసీఆర్‌కు గజమాలతో స్వాగతం పలికారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని తలపించారు. దారిపొడవునా మహిళలు కేసీఆర్‌కు మంగళహారతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు భారీ సంఖ్యలో ద్వితీయ శ్రేణి నాయకులు పాల్గొన్నారు. ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న కేసీఆర్‌ను చూసేందుకు జనం పోటీ పడ్డారు.జగిత్యాల గడ్డ ఎప్పుడూ కేసీఆర్ కవచంలా ఉంటుంది. ఈ జనసందోహమే దానికి నిదర్శనం అని స్థానిక నేతలు పేర్కొన్నారు.



### కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులకు కెసిఆర్ దిశానిర్దేశం

రాబోయే రాజకీయ పరిణామాల నేపథ్యంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కీలక సమావేశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకులతో భేటీ అయి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయానికి చేరుకున్న కేసీఆర్‌కు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. సమావేశంలో ప్రధానంగా జిల్లాలోని అభివృద్ధి పనులు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన పురోగతిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై చర్చించారు.ప్రజల పక్షాన నిలబడి పోరాడటమే మన లక్ష్యం. గెలుపోటములు సహజం, కానీ ప్రజాక్షేత్రంలో మనం ఎప్పుడూ ముందుండాలి అని కేసీఆర్ దిశా నిర్దేశించారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను, హామీల అమలులో జరుగుతున్న ఆలస్యాన్ని ప్రజలకు వివరించాలని కేసీఆర్ స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ పట్టును కోల్పోకుండా ఉండేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై జిల్లా ముఖ్య నేతలతో కేసీఆర్ విడివిడిగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కేసీఆర్ రాకతో జగిత్యాల బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## శిశుమందిర్ అభివృద్ధికి సహకరిస్తా

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలపై వివరణ ఇవ్వడానికి పాఠశాల ప్రతినిధుల బృందం సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ బృందంలో కార్యదర్శులు ఎలగందుల సత్యనారాయణ, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, గట్టు శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర రణధీర్ పాల్గొన్నారు. శిశుమందిర్ పాఠశాలలు మెరుగైన విద్యతో పాటు సద్గుణాలు, సంస్కారాలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి ప్రశంసించారు. తాను కూడా శిశుమందిర్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ శిశుమందిర్ పాఠశాలల బలోపేతం దేశ నిర్మాణానికి శుభ సూచకమని అభిప్రాయపడ్డారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## చివరి ఆయకట్టు వరకు సాగునీరు..

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి నియోజకవర్గంలో రోళ్లవాగు, అక్కపెల్లి ఎత్తిపోతల పథకంతో పాటు నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించే బాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి అక్కెపెల్లి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి సందర్శించారు. ధర్మపురి నియోజకవర్గంలో 90 శాతం మంది వ్యవసాయ ఆధారితంగా జీవనం సాగిస్తున్నారని అన్నారు.నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించడానికి రోళ్ళవాగుతో పాటు అక్కెపల్లి ఎత్తిపోతల పథకం,వెల్గటూర్ చెరువు, స్తంభంపల్లి, రంగదామంపల్లి, యశ్వంతరావుపేట చెరువు పూడికతీత పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతుల ప్రయోజనమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. అంచనాలు పెంచినా ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో మాజీ మంత్రి కొప్పుల సమాధానం చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రిజర్వ్ ఫారెస్ట్ అనుమతి లేకుండానే రోళ్లవాగు ప్రాజెక్టు ప్రారంభించారని మంత్రి అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రోళ్ళవాగు ప్రాజెక్టు రిజర్వ్ ఫారెస్ట్ అనుమతులు తీసుకువచ్చి ఇందుకు సంబంధించి ఆటవీశాఖకు రూ.31 లక్షలు చెల్లించినట్లు మంత్రి తెలిపారు.నోరు ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.అక్కపెల్లి ఎత్తిపోతలకు సంబంధించి కనీసం డ్రాయింగ్ పనులు చేయించలేని కొప్పుల ఈశ్వర్ తనపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని మంత్రి అన్నారు. అక్క పెల్లి ఎత్తిపోతలకు సంబంధించి డ్రాయింగ్ పనులు పూర్తి అయ్యాయని మంత్రి తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ పై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ప్రాజెక్టుగా నామకరణం చేసి పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేస్తానని చెప్పిన మాటలు ఏమయ్యాయి అని మంత్రి ప్రశ్నించారు. మంత్రి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులతో పాటు రైతులు ఉన్నారు.

## మైనారిటీల సంక్షేమ పథకాలపై అవగాహన

మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ కుమార్ నాయుడు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ వీక్ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ కుమార్ నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ సనా ఫారూక్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముషారఫ్, పాస్టర్స్ అధ్యక్షుడు డేవిడ్, అశోక్, రాజు తదితరులు హాజరయ్యారు.సమావేశంలో మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, వాటి విస్తరణ,లబ్ధిదారులకు చేరవేతపై విస్తృతంగా చర్చించారు. వెల్ఫేర్ వీక్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఏప్రిల్ 20న ప్రజా ప్రతినిధులు,కమ్యూనిటీ పెద్దల సమక్షంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, ఏప్రిల్ 21న లబ్ధిదారులతో సమావేశాలు, మైనారిటీ మహిళలకు కుట్టు యంత్రాల పంపిణీ చేపడతారు. ఏప్రిల్ 22న యువతకు నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు టీజీఎంఆర్ సంస్థల్లో మరమ్మతుల గుర్తింపు చేపడతారు.ఏప్రిల్ 23న పేరెంట్‌టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తారు. ఏప్రిల్ 24న ముస్లిం ఫకీర్, తుర్కా కాషా క మ్యూనిటీ సభ్యులతో సమావేశాలు, చర్చిల ని ర్మాణాల పరిశీలన, ఉపాధ్యాయులకు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఏప్రిల్ 25న అర్హులైన మైనారిటీ మహిళలు, విధవలు, అనాథలతో సమావేశాలు నిర్వహించి ఆర్థిక స హాయం విస్తరణ, చర్చిలలో మరమ్మతులు, క్రీ డా శిబిరాల ప్రారంభం చేపడతారు. ఏప్రిల్ 26 న ర్యాలీలు, ఫోటో ప్రదర్శనలు నిర్వహించడం, ఎంపీడీవోలను సందర్శించి లబ్ధిదారుల ధృవీకరణ వేగవంతం చేయడం, టీజీఎంఆర్ సంస్థల్లో ఖాళీల భర్తీకి “బడి బాట” కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ అధికారి సూచించారు.




## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సమవేశమందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుండి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్‌తో కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఆనంతరం ఆయన మాట్లాడతూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుండి పలువురు ఆర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో భూసంబధిత హౌజింగ్, ఆసరా పింఛన్లు, ఇతర ఆర్జీల మొత్తం 163 వచ్చాయి. ఆర్జీ దారులకు న్యాయం చేసి తిరిగి ఆర్జీ పెట్టకుండ పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

## 45 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి : 45 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం ఫీల్డ్ సందర్శనలో భాగంగా ఐ.టీ.ఐ. పునరుద్ధరణ పనులను , మార్కెట్ యార్డ్‌లో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు.చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి కావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఐటిఐ మరియు ఇండోర్ స్టేడియం పనులను వచ్చే 45 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.పనుల అమలులో సమన్వయం పాటిస్తూ, అవసరమైన వనరులు సమయానికి అందుబాటులో ఉంచాలని, ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు,ఇంజనీరింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.

## దొంగ అరెస్ట్,రిమాండ్‌కు తరలింపు

ప్రజాపక్షం/చందుర్తి : నిద్రిస్తున్న మహిళ మెడలోంచి తెల్లవారు జామున పుస్తెలతాడు దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు చందుర్తి ఎస్ఐ జిల్లెల్ల రమేష్ సోమవారం విలేకరుల సమావేశం లో తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు మండలం లోని మర్రిగడ్డ గ్రామానికి చెందిన బైరగోని అనిత అనే మహిళ గత సంవత్సరం సెప్టెంబర్ 24 వ తేదీన తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుండి 2.5 తులాల పుస్తెలతాడు , సెల్ ఫోన్ దొంగిలించారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. సనుగుల గ్రామానికి చెందిన తన బంధువు సహాకారం తో ఓ ప్రైవేటు ఫైనాన్స్ లో తాకట్టు పెట్టి 2 లక్షల 40 వేలు లోన్ తీసుకున్నట్లు తెలిపారు.కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ రవిని ప్రత్యేకంగా అభినందించారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

ప్రజాపక్షం/గొల్లపల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఇలా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు . సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్ల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా వెల్ఫేర్ వీక్ మొదటి రోజు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం మధ్యాహ్న ,భోజన నిర్వహణను పరిశీలించారు.ఆహార నాణ్యతను స్వయం గా పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనం అం దుతున్నారా భోజన నాణ్యత ,పరిశుభ్రత ,వంటశాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు .రుచి ఎలా ఉన్నదని విద్యార్థులతో మాట్లాడి వివరంగా తెలుసుకున్నారు .భోజనం సక్రమంగా సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు .డైట్ మెనూ,వంటగది శుభ్రత ,నీటి వినియోగం,నిల్వ,వంట సామాగ్రి, కిచెన్ షెడ్,స్టాకు గదులు,స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన బియ్యం ఇతర సరుకుల నాణ్యతను ప్రత్యేకంగా పరిశీలించారు.విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వారికి భోజనం వడ్డించడంలో ఎలాంటి లోపం లేకుండా పాఠశాల యాజమాన్యం వంట సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు .వంట కోసం తాజా కూరగాయలు నాణ్యత గల సరుకులు వినియోగించాలన్నారు.వంటశాలల్లో పరిశుభ్రతను క చ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సంక్షేమ పాఠశాలల్లో మెనూ సమర్థవంతంగా అమలు కావాలని విద్యార్థులకు సురక్షితమైన, శుభ్రమైన వాతావరణంలో భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.సంక్షేమ అధికారి రాజ్ కుమార్, జిల్లా విద్యాధికారి రాము, బిసి సంక్షేమాధికారి సు నీత, తహసీల్దార్ మజీద్,ఎంపిడివో రవీందర్ రావు, మండల విద్యాధికారి చెరుకు రాజన్న ,పాఠశా ల ఉపాధ్యాయులు, అధికారులు.పాల్గొన్నారు.



## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎబివిపి జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు

ప్రజాపక్షం/జమ్మికుంట: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబివిపి జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకుండా విద్యాశాఖ కు మంత్రిని నియమించక పోవడాన్ని నిరసిస్తూ సోమవారం గాంధీ చౌరస్తా దగ్గర రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు.రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపే తం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అనారు.రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అ నేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే వి డుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో వి ద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జమ్మికుంట నగర కార్యదర్శి నిరూప్, మున్నా, శశాంక్, ఆరిఫ్, రోహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.



# లక్నోపై పంజాబ్ భారీ విజయం

ఐపిఎల్ 19లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా మట్టి కరిపిస్తున్న శ్రేయస్ అయ్యర్ సేన ఈసారి లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ పంచ్‌ను రుచి చూపింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నొల్లీ(87)ల విధ్వంసకాండతో 254 రన్స్ కొట్టిన పంజాబ్ ఆపై లక్నోను వణికించింది. ఆరంభం నుంచి తడబడిన లక్నో మర్క్రమ్(42) పోరాటంతో రన్స్‌కు పరిమితమైంది. పంజాబ్ ఖాతాలో ఐదో విజయం చేరగా.. పంత్ బృందానికి నాలుగో ఓటమి ఎదురైంది. ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్ పంజాకు లక్నో సూపర్ జెయింట్స్ విలవిలలాడింది. ఆదివారం డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ దెబ్బకు లక్నో బదులివ్వలేకపోయింది. బౌలర్ల వైఫల్యంతో భారీ స్కోర్ సమర్పించుకున్న లక్నో.. 255 పరుగుల ఛేదనలో ఏ కోశాన లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్గా వచ్చిన ఆయుశ్ బదొని(35) ఔట్ చేసి లక్నోను ఒత్తిడిలో పడేశాడు. విధ్వంసక హిట్టరైన మిచెల్ మార్ష్(40), రిషభ్ పంత్ (43)లు రాణించినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. హిట్టర్ పూరన్(9) విఫలమవ్వగా.. ఎడెన్ మర్క్రమ్(42), ముకుల్ చౌదరీ(21 నాటౌట్)లు పోరాడారు. కానీ, రన్‌రేటు అంతకంతకూ పెరిగిపోవడంతో వీరేమీ చేయలేకపోయాడు. లక్నో రెండొందలకే పరిమితవ్వగా పంజాబ్ 54 పరుగుల తేడాతో గెలుపొంది అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది.




## దంచికొట్టిన కుర్రాళ్లు...

ఐపిఎల్‌లో రికార్డుల మోతకు తెరదీసింది పంజాబ్ కింగ్స్. టోర్నీలో అజేయంగా దూసుకెళ్తున్న ఆ జట్టు ముల్లన్‌పూర్‌లో భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జెయింట్స్‌ను భయపెట్టింది. టాస్ ఓడినా పంజాబ్‌కు శుభారంభం దక్కకున్నా.. కుర్రాళ్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ ప్రభసిమన్ సింగ్(0)ను తొలి ఓవర్లోనే ఔటైనా.. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు ప్రియాన్ష్ ఆర్య(93) చుక్కలు చూపించాడు. కూపర్ కొన్నొల్లీ(87) తో కలిసి విధ్వంసకాండ రచించిన ఈ కుర్రాడు మెరుపు అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకి లేదా బౌండరీ గీత దాటించడమే లక్ష్యంగా వీరిద్దరూ చెలరేగారు. ఇద్దరూ పోటాపోటీగా బౌండరీలు బాదేయగా పంజాబ్ స్కోర్ రాకెట్ వేగంతో పరుగులు తీసింది. శతకాల దిశగా దూసుకెళ్లిన ఈ జోడీని ప్రిన్స్ యాదవ్(2–25) విడదీసి లక్నోకు ఊరటనిచ్చాడు. ఆ వెంటనే ప్రియాన్ష్‌ను సిద్దార్థ్(2–35) ఔట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(5) నిరాశపరిచాడు. అనంతరం నేహాల్ వధేరా(13), మార్కస్ స్టోయినిస్(29), శశాంక్ సింగ్(17)లు స్కోర్ బోర్డును ఉరికించారు. ఆఖరి ఓవర్‌లో చివరి బంతికి స్టోయినిస్ రనౌట వ్వగా పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది.

## అగార్కర్ పదవీకాలం పొడిగింపు




**ముంబై:** భారత క్రికెట్ జట్టుకు చీఫ్ సెలక్టర్‌గా వ్యవహరిస్తున్న అజిత్ అగార్కర్.. తన పదవిలో మరో ఏడాదిపాటు కొనసాగనున్నాడు. 2023 జులై నుంచి సీనియర్ మెన్స్ సెలక్షన్ కమిటీకి చైర్మన్‌గా ఉన్న అతడి పదవీ కాలాన్ని 2027 దాకా పొడిగించనున్నట్టు సమాచారం. వచ్చే ఏడాది జరుగబోయే వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. అగార్కర్ హయాంలో భారత జట్టు నాలుగుసార్లు ఐసిసి ట్రోఫీల ఫైనల్స్‌కు చేరి మూడు కప్పు (2024, 2025, 2026)లను సొంతం చేసుకుంది.


## బాలాజీ ద్వయానికి టైటిల్




ఢిల్లీ: భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు శ్రీరామ్ బాలాజీ, తన ఆస్ట్రేలియా సహచరుడు నీల్ ఒబర్లీట్నర్ ద్వయం పోర్చుగల్లో జరిగిన ఒయెరాస్ 3 చాలెంజర్ టోర్నీలో డబుల్స్ టైటిల్ను సొంతం చేసుకుంది. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ భారత, ఆస్ట్రేలియా జోడీ ఆదివారం జరిగిన ఫైనల్లో 67 (7/9), 6–4, 11–9తో నికోలస్ (కొలంబియా), ఎరియల్ బెహర్ (ఉరుగ్వే) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. తొలి సెట్ కోల్పోయినా తర్వాత పుంజుకున్న ఈ జోడీ.. వరుస సెట్స్‌లో ప్రత్యర్థిని నిలువరించి టైటిల్ సాధించింది.

## యువతరంగం

## మారుతున్న జాబ్ మార్కెట్ ముఖచిత్రం



సమాజంలో జరుగుతున్న ఆర్థిక మార్పులు, సాంకేతిక పరిణామాలు, విద్యా వ్యవస్థ, పరిశ్రమల అవసరాలు మరియు ప్రపంచీకరణ వంటి అంశాలు జాబ్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వీటి ఫలితం యువతపై ఎక్కువగా ఉంటుందనడంలో అనుమానం లేదు. ప్రస్తుతం భారత ఉద్యోగ మార్కెట్‌ను పరిశీలిస్తే, ఇది సాధారణ నియామకాల కథగా కాకుండా, ఒక నిర్మాణాత్మక మార్పు దశలో ఉన్న కార్మిక ప్రపంచం గాథలా గోచరిస్తుంది. ఉద్యోగ మార్కెట్ అనేది ఎప్పుడూ స్థిరంగా ఉండే వ్యవస్థ కాదు. ప్రతి దశాబ్దం కొత్తవి తెస్తుంది, పాతవాటిని మార్చుతుంది, కొన్ని వృత్తులను పూర్తిగా తొలగిస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న మార్పులకు ప్రధాన కారణం కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటల్ పరివర్తన, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితి. ఒకప్పుడు కేవలం ఐటీ రంగానికి పరిమితమైన డిజిటల్ నైపుణ్యాలు ఇప్పుడు వ్యవసాయం నుంచి బ్యాంకింగ్ వరకు ప్రతి రంగంలో అవసరమవుతున్నాయి. సంస్థలు ఉద్యోగులను వారి అనుభవ సంవత్సరాల ఆధారంగా కాకుండా, సమస్యలను ఎలా పరిష్కరిస్తారు, కొత్త సాంకేతికతలను ఎంత వేగంగా నేర్చుకుంటారు అనే ప్రమాణాల ఆధారంగా అంచనా వేయడం ప్రారంభించాయి. నేటి యువత ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నప్పుడు, వారి ప్రశ్నలు కూడా మారిపోయాయి. ఏ కోర్సు చదివితే ఉద్యోగం వస్తుంది? అనే ప్రశ్న క్రమంగా ఏ నైపుణ్యాలు నేర్చుకుంటే భవిష్యత్తులో కూడా ప్రాసంగికంగా ఉంటాను? అనేవిధంగా మారుతోంది. ఎందుకంటే ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోంది. ఒకే వృత్తిలో జీవితాంతం పనిచేయడం అనే భావన తగ్గిపోతోంది. దాని స్థానంలో నిరంతర నైపుణ్యాభివృద్ధి అనే కొత్త వాస్తవం ఏర్పడుతోంది. ఉద్యోగ వృద్ధిని ముందుకు నడిపించే ప్రధాన శక్తి టెక్నాలజీ ఆధారిత పాత్రలేనని అనేక పరిశ్రమ విశ్లేషణలు సూచిస్తున్నాయి. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం సంస్థల సాధారణ విధానంగా మారింది. అందువల్ల డేటా విశ్లేషణ, యాంత్రిక అభ్యాసం, క్లౌడ్ వ్యవస్థలు, వ్యాపార విశ్లేషణ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులకు అవకాశాలు విస్తరిస్తున్నాయి. అయితే ఇది కేవలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాదు. డిజిటల్ అవగాహనతో కూడిన ప్రాక్టికల్ పనులను చేసే కొత్త తరహా ఉద్యోగాలు కూడా పెరుగుతున్నాయి. ఒకప్పుడు బ్లూ కాలర్‌గా పరిగణించిన పనులు ఇప్పుడు సాంకేతికతతో మిళితమై అధిక విలువ పొందుతున్నాయి. పునరుత్పాదక శక్తి రంగం ఈ మార్పునకు మంచి ఉదాహరణ. సౌరశక్తి ప్రాజెక్టులు, విద్యుత్ వాహనాల విస్తరణ, శక్తి సామర్థ్యంపై ప్రభుత్వ ప్రోత్సాహకాలు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. సౌర ప్యానెల్ వ్యవస్థలను అమర్చే సాంకేతిక నిపుణులు, విద్యుత్ వాహన ఛార్జింగ్ కేంద్రాలను నిర్వహించే సిబ్బంది, నిర్మాణ భద్రత ప్రమాణాలను పర్యవేక్షించే నిపుణులు వంటి పాత్రలు వేగంగా పెరుగుతున్నాయి. ఇది కేవలం ఇంజినీర్లకు మాత్రమే కాకుండా సాంకేతిక శిక్షణ పొందిన మధ్యస్థ నైపుణ్య కార్మికులకు కూడా అవకాశాలను తెరుస్తోంది. ఇక వేగవంతమైన సరుకు పంపిణీ వ్యవస్థలు, అంటే తక్షణ డెలివరీ ఆధారిత వ్యాపార నమూనాలు, పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగంగా మారాయి. ఆన్‌లైన్ ఆర్డర్ల పెరుగుదలతో సరుకు నిల్వ, రవాణా, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. ఫ్లీట్ నిర్వహణ, గిడ్డంగి ఆటోమేషన్, డిజిటల్ ఇన్వెంటరీ నియంత్రణ వంటి పనులు కొత్త రకమైన ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. ఈ ఉద్యోగాల్లో భౌతిక శ్రమతో పాటు డిజిటల్ పరికరాల వినియోగం తప్పనిసరి అవుతోంది. ప్రస్తుత కాలంలో, తయారీ రంగం కూడా పునరుజ్జీవనం పొందుతోంది. అంతర్జాతీయ సరఫరా గొలుసుల మార్పు కారణంగా భారతదేశం ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా ఎదుగుతోంది. ఖచ్చితమైన యంత్రాల నిర్వహణ, ప్రోగ్రామింగ్, అసెంబ్లీ నైపుణ్యాలు కలిగిన కార్మికుల అవసరం పెరుగుతోంది. భవిష్యత్తులో విద్యార్హత మాత్రమే కాదు, ప్రత్యేక నైపుణ్యమే ఉద్యోగ భద్రతను నిర్ణయిస్తుందనే ఒక కఠిన వాస్తవాన్ని ఈ మార్పు సూచిస్తోంది. ఉత్పత్తి రంగంతోపాటు, సేవా రంగం కూడా మార్పును అనుభవిస్తోంది. వృద్ధ జనాభా పెరుగుదలతో ఆరోగ్య సంరక్షణ సేవలకు డిమాండ్ పెరుగుతోంది. వృద్ధుల సంరక్షణలో శిక్షణ పొందిన సహాయకులు, కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తలు వంటి పాత్రలు అవసరమవుతున్నాయి. మరోవైపు రిటైల్ రంగం సంప్రదాయ విక్రయ పద్ధతుల నుంచి అనుభవ ఆధారిత విక్రయ విధానాల వైపు మారుతోంది. దుకాణంలో కొనుగోలు చేసినా, ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసినా వినియోగదారుడికి సమాన అనుభవం కల్పించగల ఉద్యోగులను సంస్థలు కోరుకుంటున్నాయి. వ్యాపార విస్తరణతో సేల్స్, వ్యాపార అభివృద్ధి, కస్టమర్ సంబంధాల నిర్వహణ వంటి కమర్షియల్ పాత్రలు స్థిరమైన డిమాండ్‌ను కొనసాగిస్తున్నాయి. కంపెనీలు కేవలం ఉత్పత్తులను విక్రయించడం మాత్రమే కాకుండా వినియోగదారులతో దీర్ఘకాల సంబంధాలను నిర్మించడంపై దృష్టి పెట్టడం వల్ల ఈ పాత్రలకు ప్రాధాన్యం పెరిగింది. నియామకాల పరంగా కొన్ని రంగాలు భవిష్యత్తులో ముందంజలో ఉంటాయని అంచనా. అలాంటి రంగాల్లో ఆర్థిక సేవలు, ఆర్థిక సాంకేతిక రంగాలు డిజిటల్ చెల్లింపులు వంటివి ఉన్నాయి. చిన్న వ్యాపారాలకు రుణాల విస్తరణ, బీమా వినియోగం పెరగడం వల్ల వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఆరోగ్య సేవలు సంప్రదాయ ఆసుపత్రి సేవలతో పాటు డిజిటల్ ఆరోగ్య పరిష్కారాల కారణంగా విస్తరిస్తున్నాయి. పునరుత్పాదక శక్తి, విద్యుత్ వాహనాలు, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల నిర్మాణం వంటి రంగాలు కూడా భారీ ఉద్యోగ సృష్టికి దోహదపడుతున్నాయి. ప్రస్తుతం, జీతాల విషయంలో ఒక కొత్త ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఎక్కువ అనుభవం ఉన్నవారికి మాత్రమే అధిక వేతనాలు లభించేవి. ఇప్పుడు అరుదైన నైపుణ్యం కలిగినవారికి వేగంగా జీతాలు పెరుగుతున్నాయి. జీతం అనేది మార్కెట్ ఇచ్చే ప్రతిఫలం మాత్రమే. అసలు పెట్టుబడి మనం సంపాదించే నైపుణ్యమే. ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకొని, తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే అంత మంచిది.

### గడ్డుకాలం..

ప్రపంచ వ్యాప్తంగా యువత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నది. చదువుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుండగా, ఉద్యోగవేటలో అడుగడుగునా సమస్యలు తప్పడం లేదు. దొరికి ఉద్యోగం ఉంటుందా? ఊడుతుందా? అనే భయం మరోవైపు. ఇక మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోలేక, వేగవంతమైన పోటీలో ఇమడలేక అల్లాడిపోతున్న వారు ఎందరో. సాధారణ పరిస్థితులే ఇలావుంటే, నిరంతరం హింసను ఎదుర్కొంటూ, అణచివేతకు గురవుతున్న పాలస్తీనా వంటి దేశాల్లో యువత ఎదుర్కొంటున్న గడ్డు కాలాన్ని ఎంత వివరించినా తక్కువే.



## ప్రభుత్వ భూముల కబ్జాలు అరికట్టండి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ వినతి





**ప్రజాపక్షం/దుండిగల్ :** ప్రభుత్వ భూముల కబ్జాలను అరికట్టాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నంబర్ 326,307 లో ఉన్న ప్రభుత్వ భూమిని బస్సు టెర్మినాల్ కోసం, కేంద్రియ విద్యాలయం కోసం, పోలీస్ క్యాంపు కోసం కేటాయించామని ప్రభుత్వం చెపుతుంటే, గతంలో హైడ్రా కూల్చినప్పటికి మళ్ళీ అదే స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని, అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. గాజులరామారంలోని ప్రభుత్వ భూమిలో గత సంవత్సరంలో హైడ్రా కూల్చి వేసినప్పుడు కొంతకాలం కబ్జాలు ఆగిపోయినప్పటికీ మళ్లీ మొదలయ్యాయన్నారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు సిపిఐ నాయకత్వం రెవెన్యూ అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సాయిల్‌గౌడ్, మండల కార్యదర్శులు నరేంద్ర ప్రసాద్, రాములు, కృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి తరలివెళ్లిన అంగన్‌వాడీలు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 నుండి 23 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న పార్లమెంట్ ముట్టడికి ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రతినిధులు తరలివెళ్లారు. ఎఐటియుసి అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ధరడే ఛాయా, ప్రధాన కార్యదర్శి ఏ.చంద్రకళల ఆధ్వర్యంలో 30 మంది అంగన్‌వాడీలు ఆదివారం రాత్రి రైలులో ఢిల్లీకి బయలుదేరారు. వారికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరుతో అంగన్‌వాడీ వ్యవస్థను దెబ్బతీసే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. ఈ ముట్టడిలో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి అంగన్‌వాడీలు పాల్గొంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెస్రం భాస్కర్, అంగన్‌శాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ‘అంగన్‌వాడీ’లను బలోపేతం చేయాలి




### ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** సమస్యలు పరిష్కరించి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథరెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, 18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ కోరారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి సోమవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులోని నందమూరి నగర్ అంగన్‌వాడీ సెంటర్‌ను ఎఐటియుసిబృందం పర్యటించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ సారథిరెడ్డి, రేశపల్లి నవీన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో అంగన్‌వాడీ టీచర్లు మరియు హెల్పర్లకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని అంగన్‌వాడీ సెంటర్లలో హెల్పర్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్యాల రక్షణకు అధిక నిధులు కేటాయించి అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు మరియు హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో సమస్యలను తెలుసుకొని సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్, అంగన్‌వాడీ టీచర్లు మరియు హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు చిర్ర లక్ష్మి నరసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కీసర సౌమ్యశ్రీ, మెహముద, సరిత, ఎఐటియుసి నేతలు వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, తండా శ్రీనాథ్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసిని కాపాడుకునేందుకే సమ్మె

### ఎఐటియుసి ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను కాపాడుకోవడానికి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22 నుండి చేపట్టే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆసిఫాబాద్ డిపోలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రెండేళ్లు గడిచినా అమలు చేయకపోవడం వల్లే సమ్మెకు సిద్ధమయ్యామని తెలిపారు. ఇది కేవలం జీతాల కోసం చేస్తున్న పోరాటం కాదని, ప్రజల ఆస్తి అయిన ఆర్‌టిసిని ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవడానికి 45 వేల కార్మిక కుటుంబాల కోసం చేస్తున్న ఉద్యమమన్నారు. ప్రభుత్వం స్పందించి చర్చలు జరపకపోతే 22వ తేదీ మొదటి డ్యూటీ నుండి ఒక్క బస్సు కూడా బయటకు రాదని, దీనివల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్‌టిసిఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతన సమస్యలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన పోరాటానికి ప్రజలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిపో ఆర్‌టిసిజాక్ చైర్మన్ ఎల్పుల అశోక్, నాయకులు మంజుల, కవిత, ప్రవీణ్, అనిల్, సురేష్, అంజి, గోపికృష్ణ, తిరుపతి, ఖదీర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా బిల్లు పేరుతో ఇతర చట్టాలు తీసుకొచ్చి మోసం చేసిన నరేంద్రమోదీ



### మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి

**ప్రజాపక్షం/వైరా :** పార్లమెంటులో మహిళా బిల్లును అడ్డం పెట్టుకొని రాజ్యాంగ సవరణ చేయుటకు మోదీ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి విమర్శించారు. మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా మహాసభలు మే16న వైరా పట్టణంలో జరగబోతున్న సందర్భంగా సోమవారం సిపిఐ నాయకురాలు, వైరా మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో లతాదేవి మాట్లాడుతూ దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు రాజ్యాధికారంలో వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు, మాజీ ఎంపి గీతా ముఖర్జీ గతంలో అనేక సంవత్సరాలు పార్లమెంటులో పోరాటం చేశారని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా వ్యవహరించిందో ప్రస్తుతం బిజెపి కూడా అదే పద్ధతులు అవలంభిస్తుంది తప్పా చిత్తశుద్ధితోటి మహిళా రిజర్వేషన్లు తీసుకోవడం కోసం ప్రయత్నం చేయటం లేదని విమర్శించారు. రాజకీయంగా, సామాజికంగా ఎంతో చైతన్యవంతమైన వైరా పట్టణంలో జరిగే మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను అన్నివర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎన్‌ఎఫ్‌డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, నాయకులు కొండా రామకృష్ణ, అమర్లపూడి అనిల్, కోట నాగేశ్వరరావు, నల్లమోతు నరేష్, కలక పుల్లయ్య, బండారుపల్లి రవి, యామాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు తీవ్రతరం


### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు తీవ్రతరం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడే సందర్భంగా మే1న అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్మిక అడ్డాలలో కార్మిక జెండాలు ఎగరవేసి ర్యాలీలు, సభలు ఘనంగా నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండి, కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, వేతనాల పెంపు కోసం పోరాడే హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కేవీఎస్‌రెడ్డి, దొటి వెంకన్న, సహాయ కార్యదర్శులు నూనె వెంకటేశ్వర్లు, బరిగెల వెంకటేష్, కోశాధికారి దొనకొండ వెంకన్న, వి.లెనిన్, శ్రీను, ఏ.మల్లయ్య, సైదులు, పి.నాగరాజు, నీల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

-మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
-ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రధాన లక్ష్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో, పాల్వంచ మండలం ఉల్వనూరు పంచాయితీలోని కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాను చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ మంత్రి సానుకూలంగా స్పందించి తక్షణమే కొనుగోలు కేంద్రాలు మంజూరు చేశారని తెలిపారు. రైతులు తమ పంటను దళారులకు అమ్మినష్టపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, రైతులకు తూకం, నగదు చెల్లింపుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు కొలగొద్దని, అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ రైతాంగ సంక్షేమం కోసం నిరతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేహామీ ఇచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో అంగన్ వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు అందించారు. అంగన్వాడీలకు వచ్చే పిల్లలకు చక్కటి పౌష్టికాహారాన్ని అందించాలని, బాలింతలు, గర్భిణీలకు బలవర్ధకమైన ఆహారాన్ని ఇవ్వాలని చెప్పారు. పిల్లల చదువులకు అంగన్వాడీలు తొలిమెట్టు అని, ఆట పాటలతో కూడిన చదువులు అందించాలని సూచించారు. తహశిల్దార్లు శిరీష, దారా ప్రసాద్, ఎంపిడిఓ బొగ్గా నారాయణ, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీపతి,అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుర్రం వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి బరపటి వాసు, సర్పంచ్‌లు వాసం రుద్ర, కుర్సం రాములు, రాంబాబు, శేఖర్ బాబు, శ్రీనివాసరావు, వైస్ గిరి, గౌతమి కృష్ణ, యాకయ్య, శ్రీను, వజ్జా వ ఆసు, అప్పారావు, రంజిత్, రవి, సోమయ్య ప్రసాద్, స్వర్ణలత, నిమ్మగట్ట వెంకటేశ్వరరావు, లక్ష్మ ణ్, పాషా, చింటూ, గోవంద్, మిర్యాల రాము, ప్రసాద్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతుల సమస్యలను పరిష్కరించండి : దొండపాటి



**ప్రజాపక్షం/వైరా:**మొక్కజొన్న ధాన్యం రైతుల సమస్యలను పరిష్కరించండి అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అన్నారు. సోమవారం వైరాలో జరిగిన రైతు సంఘం సమావేశంలో దొండపాటి రమేష్ మాట్లాడుతూ ఎకరానికి రూ.60వేలు పెట్టుబడి పెట్టి పంటను ప్రభుత్వ మద్దతు ధరకి అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు మొక్కజొన్న రైతులు పడాల్సిన పరిస్థితి ఏర్పడటం చాలా దురదృష్టకరమని వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా విస్తారంగా మొక్కజొన్న సాగు చేసిన విషయం అధికారులకు తెలుసు అయినా ముందస్తు ప్రణాళికాబద్ధంగా మొక్కజొన్న కొనుగోలు విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే రైతుల దగ్గర నుండి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొండా రామకృష్ణ, మాచర్ల నాగభూషనం, అమర్లపూడి అనిల్, యామాల వెంకటరత్నం, కోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కోళ్ల ఫారం నుండి నాటుకోళ్లు చోరీ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:**తిప్పనపల్లిలో గల నాటుకోళ్ల ఫారం నుండి రూ 2.50లక్షలు విలువ చేసే నాటుకోళ్లు చోరీ చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పనపల్లి గ్రామానికి చెందిన కందిమళ్ల శ్రీను తనకు గల నాటుకోళ్ల ఫారంలో సుమారు వందకు పైగా నాటుకోళ్లు సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప ఊచనలను కత్తిరించి కోళ్లను ఎత్తుకెళ్లారు. ఉదయం కోళ్లకు మేత వేద్దాం అనుకున్న సమయంలో చోరీ జరిగిన విషయాన్ని గమనించి బోరున విలపించాడు. ఎత్తుకెళ్లిన నాటుకోళ్లు రెండున్నర లక్షలకు పైగా ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. అప్పు చేసి నాటుకోళ్ల పెంపకం మొదలు పెట్టామని, దొంగలు ఉన్న కోళ్లను మొత్తం ఎత్తుకెళ్లడం వల్ల అప్పులు తీరెదెట్లా అని విలపించాడు. చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.

## అన్నదానానికి నగదు వితరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్రీ విశాలక్ష్మి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే అన్నదానానికి చిన్నారి అక్కి బెన్సిక నగదు వితరణ చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి చిన్నారి అక్కి బెన్సిక తాను దాచుకున్న పాకెట్ మనీ నుంచి రూ.775 లను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసింది. చిన్న వయస్సులోనే సేవాభావాన్ని చూపించిన బెన్సిక ను ఆలయ ఛైర్మన్, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు అభినందించారు. అదేవిధంగా కొండపల్లి శ్రీధర్ రావు అన్నదానానికి రూ.6వేలు విరాళం అందజేశారు. ఈలప్రోలు నితీష్, కలు రాములు, రామకృష్ణ లు అన్నదానానికి 25 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. వీరికి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

## నాణ్యతా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**సంక్షేమ వ సతి గృహాల్లో పిల్లలకు అందించే ఆహార పదార్థాలను నాణ్యతో అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ అంకింత్ అన్నారు. స ంక్షేమ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆ యన మండలంలోని మహాత్మాగాంధీ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి ఆకస్మికంగా త నిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది పరిశీలించారు. వంటతయారీ ప్రక్రియను స్వయంగా చూ శారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించా రు. వంటకు ఉపయోగించే సరుకుల నాణ్యతపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని, ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని సూచించారు. పనికిరాకుండా ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన ఆయన కరెంటు సమస్యను పరిష్కరించి ప్లాంట్ పనికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం సంద్యా తండాలో ఉన్న ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ప్రత్యేకాధికారి శ్రీరామ్, తహశిల్దార్ వీరభద్రం, ప్రిన్సిపల్ రవీంద్ర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**ప్రజాపక్షం/సత్తుపల్లి:**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు సోమవారం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు సోమవారం ధర్నా నిర్వహించి ముట్టడి చేశారు. వి.బి.జి రాంజీ బిల్లును రద్దు చేసి, ఉపాది హామీ కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రెండు సార్లు ఫోటో విధానాన్ని రద్దు చేసి, పనిస్థలాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ మూడు నెలలుగా బిల్లులు చెల్లించక కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలపై కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.కూలీలకు 200 రోజుల పని, రోజుకు రూ.600 కూలి, కేంద్రం నుంచి ఎక్కువ నిధుల కేటాయింపు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ, వినతిపత్రాలు ఎమ్మార్వో మరియు సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మ ణరావు, వల్లెపు లక్ష్మి, వింజి భార్గవి, కారుమంచి శ్రీలక్ష్మి, మారోజు శ్యామల, గద్దల వెంకటేశ్వరరావు, బలుసుపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను తక్షణమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం:**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అంకిత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి పలు వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, పరిష్కారానికి నోటుకోని వాటిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలన్నారు.

**ఐటిడిఎలో:**భద్రాచలం ఐటిడిఏలో గిరిజన దర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల నుండి పిఓ రాహుల్ వినతులు స్వీకరించారు. అర్హులైన ప్రతీ గిరిజనులకు ప్రభుత్వం అందించే పథకాలు అందిస్తామని చెప్పారు. అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించేందుకు వీలుకానీ వాటిపై నివేదికలు వెంటనే ఇవ్వాలన్నారు.

## డ్రైనేజీ ఆక్రమణలు తొలగింపునకు చర్యలు

ప్రజాపక్షం ఎఫెక్ట్

-ప్రజాపక్షం కథనానికి స్పందించిన ఆర్అండ్‌బి శాఖ
-ప్రధాన రహదారికి ఇరువైపులా మార్కింగ్ ఇచ్చిన సిబ్బంది



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**''ఆక్రమించడం.. అద్దెకివ్వడం'' ప్రజాపక్షం దినపత్రిక కథనానికి స్పందించిన ఆర్ అండ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగింపునకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. ఆక్రమణదారులకు పంచాయతీ సిబ్బంది ఎంతో కాలంగా మూడు సార్లు నోటీసులు జారీ చేశారు. గడువులోగా ఆక్రమణదారులు స్వయంగా తమ దుకాణాలను తొలగించుకోవాలని, లేకుంటే తామే వాటిని తొలగిస్తామని అధికారులు సూచించారు. కానీ నెలలు గడుస్తున్నా అక్రమణదారుల్లో చలనం రాకపోవ్వడంతో. ఆక్రమించడం.. అద్దెకివ్వడం ప్రజాపక్షం దినపత్రిక ప్రత్యేక కథనానికి స్పందించిన జిల్లా అధికారులు వారి ఆదేశాల మేరకు ఆర్ ఆర్అండ్‌బిఇంజనీరింగ్ శాఖ అధికారులు సోమవారం వెంగన్నపాలెం పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారికి ఇరువైపులాటేపుతో కొలతలు వేసి స్వయంగా రెడ్ మార్కెట్ తో హద్దులు నిర్ణయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎంతో కాలంగా నోటీసులు ఇస్తూ ఆక్రమణ దారులను హెచ్చరించినా స్పందించడంలేదని చివరి సరిగా మార్కింగ్ పెట్టి మార్కింగ్ దాటిన వారు స్వయంగా ఆక్రమణలు తొలగించాలని తెలిపామని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించడం జరుగుతుందని తెలిపారు.

## స్మశానవాటికలో మహాప్రస్థానం ఏర్పాటు చరిత్రాత్మకం



**ప్రజాపక్షం/ మధిర:** మధిర మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం వద్ద స్మశాన వాటికలో మహాప్రస్థానం ఏర్పాటు చారిత్రాత్మకమని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం మధిర రిక్రియేషన్ క్లబ్‌లో మహాప్రస్థానం ఏర్పాటుపై జర్నలిస్టులు, కుల సంఘాలతో అభివృద్ధి కమిటీ మున్సిపాలిటీ పాలకమండలి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిరియాల రమణ గుప్తా, బెజవాడ రవిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, కమీషన్ సంపత్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టు, కుల సంఘాల అభిప్రాయం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తీసుకోమని చెప్పడంతో వారి అభిప్రాయాలను అభివృద్ధి కమిటీ తీసుకుంది. ఈ సందర్భంగా జర్నలిస్టులు కుల సంఘాలు కూడా మహాప్రస్థానం ఒక చారిత్రాత్మకమైనదని దానికి మావంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతినకుండా ఆచార సాంప్రదాయాలు పాటిస్తూ ప్రజలు అభీష్టం మేరకు మహాప్రస్థానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సుమారు 5ఎకరాల్లో మహా ఆద్భుతంగా ప్రజల మెచ్చే విధంగా భావితరాలు చెప్పుకునే విధంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మహాప్రస్థానం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు జివి. అరుణ్, నాళ్ల శ్రీనివాసరావు, బాలస్వామి, కొంగ రముళీ, నర్సింహామూర్తి, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాలు...కమిషన్ల సంగతి బిఆర్ఎస్ నేతలకే తెలుసు

మానసిక స్థితి సరిగ్గా లేని హరీష్
-సీతారామపై చిత్తశుద్ధితో రేవంత్ సర్కార్
-మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కబ్జాలు, కమిషన్ల సంగతి బిఆర్ఎస్ నేతలకు తెలిసినంతగా మరెవరికి తెలియదని కబ్జా స్థలంలోనే సమావేశం పెట్టి కబ్జాల గురించి మాట్లాడతారా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. హరీష్ మాట్లాడే తీరు చూస్తుంటే ఆయన మానసిక స్థితి సరిగ్గా లేదని అవగతమవుతుందన్నారు. సోమవారం స్థానిక ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ పదేళ్ల పాటు ఆర్థిక విధ్వంసం సృష్టించి బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు నీతులు చెబుతున్నారన్నారు. రైతుభరోసా రైతులకు సకాలంలో ఇచ్చామని ఇప్పటి వరకు రూ.25వేల కోట్లు ఖాతాల్లో జమ చేశామని కావాలంటే వివరాలు అందజేస్తామని తుమ్మల తెలిపారు. పార్టీలో హరీష్‌రావు స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని ఆయన స్థితి సరిగ్గా లేకనే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని ప్రాధాన్యత తగ్గడంతో ప్రత్యర్థులను విమర్శించడం ద్వారా ఏదో సాధించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. సీతారామ ప్రాజెక్టు తన చిరకాల స్వప్నమని ఇల్లందు నియోజక వర్గంలోని రోళ్లపాడు వద్ద శంకుస్థాపన చేస్తే ఎందుకు మార్చారని పదేళ్ల కాలంలో నిధులు కేటాయించకుండా ఎందుకు ఆపారని తుమ్మల ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామకు రూ.1500 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కబ్జాదారుడు, అవినీతి కాంట్రాక్టర్‌ను పక్కన పెట్టుకుని హరీష్‌రావు నీతులు చెబుతుండటం సరికాదన్నారు. రుణమాఫీ పై మాట్లాడే హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదని ఇక కబ్జాల విషయంలో దేశంలోనే ఏ పార్టీకి లేని చరిత్ర బిఆర్ఎస్‌కు ఉందన్నారు.రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను సరి చేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని బిఆర్ఎస్ ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూనే అదనంగా మరికొన్ని పథకాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నామని తుమ్మల తెలిపారు. మీడియా సమావేశంలో వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ బోర్డ్ యూనిట్ వద్ద కార్మికుల ఆందోళన




14వ ఎల్‌టిఎ జాప్యంపై కార్మికుల ఆగ్రహం
8గంటల నిరవధిక ధర్నా

**ప్రజాపక్షం/బూర్గంపాడు:**ఐటిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని భద్రాచలం పేపర్ బోర్డ్ యూనిట్ వద్ద కార్మికుల ఆందోళన ఉధృతమైంది. ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల పిలుపుతో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. 14వ దీర్ఘకాల వేతన ఒప్పందం(ఎల్‌టీఏ)అమలులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఎనిమిది గంటలపాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎదుట ధర్నా చేపట్టారు. తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా కార్మికులు నల్లబ్యాడ్జీలను ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో నిరసన తెలిపారు. పరిశ్రమ చరిత్రలో తొలిసారిగా అడ్మిన్ బ్లాక్ ముందు ఇంత దీర్ఘకాలిక ధర్నా నిర్వహించడం గమనార్హమైంది. ఈకార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు గోనే రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి నాయకత్వం వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ లాభాల్లో కొనసాగుతున్నప్పటికీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తీర్చడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మ్యాన్ పవర్ తగ్గించి పని భారాన్ని పెంచే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వేతన ఒప్పందంపై ఆశలు పెట్టుకున్న కార్మికులను ఇక మోసగించవద్దని గుర్తింపు సంఘాన్ని హెచ్చరించారు. గతంలో కార్మిక హక్కుల కోసం పోరాడిన సందర్భాలను గుర్తు చేసుకుని, అదే పోరాట స్ఫూర్తితో ముందుకు రావాలని సూచించారు. కార్మికులు ప్రధాన డిమాండ్లుగా కనీసం రూ 22,000 తగ్గకుండా వేతనం ఒప్పందం పూర్తి చేయాలని, కొత్త క్వార్టర్స్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, రిటైర్డ్, వైద్య, విద్య సంబంధిత సమస్యలు పరిష్కరించడం, శ్రీరామనవమికి చెల్లింపు సెలవు ఇవ్వడం, జాబ్ క్యాలెండర్, డిపార్ట్మెంట్ గ్రేడ్ల అమలు, పరిశ్రమ 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి కార్మికుడికి 10 గ్రాముల బంగారు నాణెం ఇవ్వాలన్నారు. యాజమాన్యం తక్షణమే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ఔషద నియంత్రణ ఎక్కడ ?

విచ్చల విడిగా మందుల అమ్మకాలు
కట్టడిచేసే వారే కరువు
పట్టించుకోకుంటే ప్రజారోగ్యానికి ముప్పు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:**జిల్లాలో ఔషద నియంత్రణ వ్యవస్థపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనలు గాలికొదిలేసి మందుల విక్రయాలు ఇష్టానుసారంగా జరగడం నకిలీతోపాటు నిషేదిత మందుల చలామణి పెరగడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదంగా మారుతోంది. దీంతో ఔషద నియంత్రణ ఎక్కడా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పెరుగుతున్న అక్రమాలు :**మందుల విక్రయాల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ తప్పని సరీ, అయినప్పటికీ అనేక ప్రాంతాల్లో ఈ నియమాలు పాటించడం లేదు. వైద్యుల సలహాలు లేకుండా నిత్యం లక్షల రూపాయల విలువచేసే మందుల విక్రయాలు సాగిపోతున్నాయి. అనేక మెడికల్ షాపులు వెలవడంతో నెట్ ఆధారిత సలహాలతో ప్రజలు మందులు కొంటున్నారు. షాపుల వారు కూడా ఎలాంటి మెడికల్ చీటి లేకుండానే మందులను ఇచ్చేస్తున్నారు. దీని వల్ల అవకతవకలకు చోటు చేసుకుంటున్నట్లు పలువురు నిపుణులు చెబుతున్నారు.

**నియంత్రణ అధికారుల కొరత:**ఔషద నియంత్రణ శాఖలో సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా మారింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మెడికల్ షాపులు ఉన్నప్పటికీ వాటిని పర్యవేక్షించే సిబ్బంది జిల్లాలో స్థిరంగా లేరు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఔషద నియంత్రణ అధికారి తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. వారి అసలు స్థానం కొమరం భీమా ఆసీఫాబాద్ ఇల్లా. అక్కడి నుండే ఇక్కడ పర్యవేక్షణ చేస్తున్నారు. వాస్తవానికి మారుమూల ఏజెన్సీ అటవీ ప్రాంతం అధికంగా ఉండే ఈ జిల్లాకు జిల్లా ఔషద నియంత్రణాధికారి ఇక్కడే ఉండటం అవసరం. మారుమూల ప్రాంతాలు, ఆర్ఎంపి వ్యవస్థ అధికం, నిరక్షరాస్యత ఉన్న ఈ జిల్లాలో ఔషద నియంత్రణ సరిగా లేదనే వాదనలు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా కొందరు మందుల పనితనం ముగింపు తేదీకి దగ్గర పడ్డ వాటిని తక్కువ ధరలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పుకార్లు వినవస్తున్నాయి. వాటిని గట్టు చప్పుడు కాకుండా పల్లెలు, అటవీప్రాంతాల్లోని రోగులకు అంటగడుతున్నట్లు కూడా వినికిడి.

**ప్రజారోగ్యంపై ముప్పు :** అనధికారికంగా అమ్ముతున్న మందుల వల్ల రోగులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. వైద్యుని సలహా లేకుండా ఎలాంటి మందులు వేసుకోవద్దని కూడా స్పష్టం చేస్తున్నారు.

**దృష్టి సారించడం ఎంతో అవసరం:** విచ్చల విడిగా పెరిగిపోయిన మందుల షాపులపై నిఘా పెంచడం ఎంతో అవసరం, జిల్లాలో ఔషద నియంత్రణ,సహాయ నియంత్రణ అధికారులను స్థిరంగా ఉంచాలి. అక్రమ మందుల విక్రయాలపై ప్రత్యేక దాడులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఔషదాల విషయంలో ఔషద నియంత్ర శాఖ ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు తీసుకోకుంటే ప్రజారోగ్యంపై పెను ప్రమాదం ఛాయలు అలుముకునే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## అంతా ఆయన ఇష్టమే

కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ అధికారి ఇష్టారాజ్యం
-ఆవేదనలో రైతులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్పొరేషన్‌లో ఓ ఇంజనీరింగ్ అధికారి ప్రలోభాలకు గురై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను సంతృప్తి పర్చిన వారి పట్ల ఒక రకంగా, ఇతరుల పట్ల మరో రకంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ధంసలాపురం చెరువు సమీపంలో ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని మురికి నీటిని అక్కడికి తరలించి శుద్ధి చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వం రూ. 30 కోట్లను కేటాయించింది. మురుగునీటిని తరలించే క్రమంలో కాలువలు, పైపులైన్ నిర్మాణం జరుగుతుంది. ఖమ్మం నుంచి కొత్తగూడెం అల్లిపురం వెళ్లే రోడ్డులో గంగమ్మ గుడి వద్ద నుంచి కాలువ నిర్మాణం వివాదస్పదంగా మారింది. లకారం ట్యాంకు బండ్ నుంచి చెరువు బజార్ మీదుగా మురుగు నీటిని ఎస్‌టిపి ప్లాంట్‌కు తరలించే క్రమంలో తీస్తున్న కాలువ, పైపులైన్ నిర్మాణం పాత మురుగు కాలువ ప్రాంతంలోనే జరుగుతుండగా గంగమ్మ గుడి దాటిన తర్వాత మాత్రం ఒకరిద్దరి మెప్పు కోసం కాలువను ప్రైవేటు స్థలాలపైకి తిప్పే ప్రయత్నాన్ని ప్రారంభించడంతో రైతులు అడ్డుకున్నారు. ఇది మొత్తం ఒక ఇంజనీరింగ్ అధికారి కనుసన్నల్లో జరుగుతుందని ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకరిద్దరి కోసమే కాలువ నిర్మాణ ప్రదేశాన్ని మార్చడంతో రైతులు అడ్డుకోవడంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రైతులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించినా అధికారి మాత్రం మొండి వైఖరిని విడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మించిన ఇండ్లకు కూడా నష్టం జరిగే అవకాశం ఉందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పోరేషన్ కమిషనర్‌తో పాటు ఇతర ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కాలువ నిర్మాణ పనులు, ప్లాన్ మార్పు తదితర వ్యవహారాలపై చర్చించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఒక ఉన్నత లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ఒకరిద్దరి అధికారుల ఒంటెద్దు పోకడల కారణంగా ఆగిపోకూడదని మేము అన్ని విధాలా సహకరిస్తామని రైతులు అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


## ఆదివాసుల భూ సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):** ఏజెన్సీ ప్రాంతంలో ఏండ్ల తరబడి ఆదివాసులు భూములను సాగు చేస్తూ ఉన్నప్పటికి, వాళ్ళకి ఎలాంటి హక్కు కల్పించడం లేదని అధికారులపై గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మండిపడ్డారు. సోమవారం ఐటిడిఏ కార్యాలయం నందు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ కలెక్టర్ దివాకర్‌ను కలిసి ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలపై మెమోరాండం ఇవ్వడం జరిగింది. అనంతరం జిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ వెంకటాపురం మండలం కొమరం భీం కాలనీ ఆదివాసులు ఏళ్ల తరబడి భూమిని సాగు చేస్తున్నప్పటికి ఫారెస్ట్ అధికారులు ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఈ భూమిపై గిరిజనేతరులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన వాళ్ళను ఎదుర్కొని ఈనాడు ఆ భూమిని సాగు చేసే క్రమంలో ఫారెస్టు అధికారులు ఇది మా భూమి అంటూ చెప్పడం విడ్డూరమన్నారు. వాడగూడెం(జి) సర్వే నెంబర్ 27లో దాదాపు 140 ఎకరాలు రెవెన్యూ భూమి ఉన్నప్పటికీ, ఆ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. అదే సర్వే నెంబర్ 27 భూమిలో గిరిజనేతరులకు పహాని రికార్డులు ఎంటర్ చేస్తుంటే ఫారెస్టు అధికారులు దిక్కులు చూస్తున్నారా అని ఆయన మండిపడ్డారు. ఫారెస్టు భూములలో అనేక మంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు పొందుతుంటే చోద్యం చూస్తున్నారు తప్పా వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తేల్చి చెప్పాలని సవాల్ చేశారు. కొమరం భీం కాలనీ ఆదివాసుల భూ సమస్యపై ఫారెస్టు అధికారుల వైఖరి మార్చుకోకపోతే త్వరలో ఫారెస్టు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఆదివాసికి సాగు చేసే హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తురస చంటి, కొమరం భీం కాలనీ ఆదివాసులు రమేష్ సంతోష్, లక్ష్మయ్య, రాజేష్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వర సేవలు స్ఫూర్తిదాయకం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** శ్రీ మహాత్మ బసవేశ్వర సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ యంతి కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై, మహాత్మ బసవేశ్వర జీవితం, సూత్రాలు, సమానత్వం, సామాజిక న్యాయం పై చేసిన కృషిని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, బిసి సంక్షేమ అధికారి ఇందిర, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్ బీసీ సంఘాల ప్రతినిధులు కంపాటి రాజయ్య, మాటూరి శ్రీనివాస్, రుద్రశెట్టి యుగేందర్, మాటూరి మంజుల, శివ దర్శనం, సతీష్ తదితరులు మరియు జిల్లాలోని వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్:** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా బసవ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వారి చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవ జీవితం, సూత్రాలు సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, నైతిక విలువలను ప్రోత్సహించిన ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మా బసవ ఆదర్శాలను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ఆయన సందేశాలను గ్రహించి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, జెడ్పి సీఈఓ రాంరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌పిజి అత్యవసర పరిస్థితుల నిర్వహణపై మాక్ డ్రిల్




**ప్రజాపక్షం/కమలాపూర్:** తెలంగాణ ఫ్యాక్టరీల శాఖ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హెచ్‌పిసిఎల్ కమలాపూర్ ప్లాంట్ లో ఎల్‌పిజి అత్యవసర పరిస్థితుల నిర్వహణ పై మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... అత్యవసర పరిస్థితుల్లో స్పందన, సమన్వయం, భద్రతా చర్యలను పరిక్షించడం ఈ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం హెచ్‌పిసిఎల్ కమలాపూర్ ప్లాంట్ టీమ్, ఆర్‌సి ప్రతాప్, ప్లాంట్ మేనేజర్ అభివ్ పాండే, సేఫ్టీ ఆఫీసర్ బాచలి తిరుపతి, డిప్యూటి చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం. వెంకన్న సమక్షంలో నిర్వహించారు. కమలాపూర్ ఎస్ఐ మధు, ఫైర్ ఆఫీసర్ దిలీప్, హన్మకొండ ఫైర్ బ్రిగేడ్, కమలాపూర్ పోలీస్ శాఖ, కమలాపూర్, పంగిడిపల్లి సర్పంచులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికే అత్యంత ప్రాధాన్యత



### హసన్‌పర్తిలో డిసిసిబి నూతన శాఖను ప్రారంభించిన ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు

**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో హసన్ పర్తిలో నూతన డీసీసీ బ్యాంక్ శాఖను స్థానిక శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆ దిశగా డీసీసీ బ్యాంక్ రైతులకు ఆర్థికంగా తోడ్పడుతూ తమ వంతు బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నందుకు ఎంపీ అభినందనలు తెలిపారు.వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు రూ.727 కోట్ల రుణాలు, అలాగే ఇతర విభాగాల ద్వారా రూ.2.8 కోట్ల పంట రుణాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాలను ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని, రైతులు ముందుకు వచ్చి వ్యవసాయ పరికరాల కొనుగోలుకు కూడా రుణాలను వినియోగించుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన పెరుగుతోందని తెలిపారు. వ్యవసాయ భూముల తనఖా ఆధారంగా విద్యార్థులకు రూ.50 లక్షల వరకు విద్యా రుణాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే బంగారు ఆభరణాలపై రూ.541 కోట్ల రుణాలు మంజూరు చేయడం బ్యాంక్‌పై ప్రజల నమ్మకాన్ని చూపిస్తోందన్నారు.హసన్ పర్తి శాఖలో త్వరలో మల్టీ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి రైతులకు మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో డీసీసీ బ్యాంక్ ముందంజలో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, డిసిసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, పిఏసిఎస్ హసన్ పర్తి పిఐసి జగన్ మోహన్ రావు, కిసాన్ సెల్ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాబార్డ్ డీడీఎం చైతన్య రవి, ఇతర అగ్రికల్చర్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**హసన్‌పర్తి లో సెంట్రల్ లైటింగ్ పనులు వేగవంతం**

**హసన్ పర్తి :** హన్మకొండ జిల్లా హసన్‌పర్తి 66వ డివిజన్ ప్రజల చిరకాల కోరిక అయిన రోడ్డు వెడల్పు, ఆధునిక సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పెద్ద చెరువు మూల మలుపు వద్ద తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చొరవతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. సుమారు రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టిన ఈ పనులకు ఇటీవల ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన చేయగా, సోమవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ...ప్రజల ప్రాణ భద్రతే తమ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా హసన్ పర్తి పెద్ద చెరువు మలుపు వద్ద గత రెండేళ్లుగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని విద్యార్థులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులను అత్యవసరంగా చేపట్టినట్లు తెలిపారు. "ఇకపై ఒక్క ప్రాణం కూడా రోడ్డు ప్రమాదాల్లో కోల్పోకూడదనే సంకల్పంతో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, స్థానిక డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు గొర్రె కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, విజయ్, పలువురు నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి బాలిక పాఠశాలకు వెళ్లాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** ప్రతి బాలిక పాఠశాలకు వెళ్లాలని, బడి బాటపై ప్రత్యేక దృష్టి సారించాలని, చదువే భవిష్యత్తు అని, విద్యాభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపు, కొత్త విద్యార్థుల నమోదుపై ఎంఈవోలు, సీహెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 21, 22వ తేదీలలో చేపట్టే బడిబాట ప్రత్యేక నమోదు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో గరిష్ట నమోదు సాధించేందుకు ఈ కార్యక్రమం సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేను క్రమబద్ధంగా నిర్వహించి పాఠశాలకు వెళ్లని పిల్లలు, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గౌసియా బేగం, ఎంఈవోలు, హెచ్ఎంలు, పాల్గొన్నారు.

## పెద్దమ్మ గుడి శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** వెంకటాపూర్ మండలంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 30 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ గుడి శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ స్వామి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను,గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు శ్రీను, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు,మామిడిశెట్టి కోటి,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు యూత్ నాయకులు,గ్రామస్థులు, పాల్గొన్నారు.

**చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క**

**ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో చలివేంద్రాన్ని మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మధ్యాహ్న సమయంలో ప్రజలు ఎవరు బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితిలో రావాల్సి వస్తే తగు జాగ్రత్తలు పాటించాలని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టండి

### పిల్లలతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/గూడూరు:** పిల్లల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులకు ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు రాష్ట్ర వ్యాప్తింగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలు గూడూరు మండలంఁని ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈసందర్భంగా గూడూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గోని విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వసతిగృహంలోని స్టోర్ గది తరగతి గదులు కిచెన్ డైనింగ్ హాల్ మరుగు దొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆరోగ్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని సూచించారు.ఈవారం రోజుల పాటు ప్రతి రోజు ప్రత్యేక థీమ్‌తో శుభ్రత ఆరోగ్యం మరమ్మతులు వంటి అంశాలపై కార్యక్రమాలు ,ఏపడతామని తెలిపారు.విద్యాతో పాటు క్రీడలు మానసిక వికాసం సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థుల ప్రతిభను మెరుగు పరచాలని ఆధునిక సాంకేతికతతో డిజిటల్ తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు దిశానిర్ధార్ చేశారు ఈకార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని ఎంపీడీవో సత్యనారాయణ పాటు సంబంధిత అధికారులు పాల్గోన్నారు.

## సిపిఐలో చేరిన ప్రజా సంఘాల నాయకులు



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** కమ్యూనిస్టు పార్టీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని వరంగల్ జిల్లా సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమార స్వామి అన్నారు . సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులు పరికి కోర్నేల్ ,బట్టు సాంబయ్య ,మామిండ్ల పెద్ద అయిలయ్య ,కనుకం సాల్మాన్‌లు సిపిఐ పార్టీలో చేరగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు . ఈ సందర్భంగా చింతకింది కుమార స్వామి వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ స్వాతంత్ర్య ఉద్యమంలో మహారాష్ట్ర ,వర్లీ ,ఆదివాసుల బెంగాల్ తేభాగా ,కేరళ పున్నప్రా ,వాయిలర్‌లలో తనవంతు పాత్ర పోషించిందని చెప్పారు .ప్రత్యక్ష దోపిడి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలతో పాటు ప్రపంచంలేనే ప్రఖ్యాత గాంచిన తెలంగాణ సంస్థానంలో వెట్టిచాకిరి దోపిడి వ్యతిరేకంగా పోరాటాలు సాగించిందన్నారు . నిజాం భూస్వామ్య వ్యతిరేక పోరాటం నిర్మించి బాంఛన్ దొర నీ కాల్మోక్తా అన్న సామాన్యులతో బందుక్‌లు పట్టించి సాయుధ పోరాటం గెరిల్లా యుద్దానికి సిపిఐ పార్టీ నాయకత్వం వహించందన్నారు . దున్నే వానికే భూమి నినాదం ,సంపూర్ణ స్వరాజ్యం పిలుపునిచ్చిన సిపిఐ ఈ దేశంలో పేద ప్రజల కోసమే పోరాటం చేసిందని చెప్పారు .

## పిఎం ఇంటర్న్ షిప్ పథకం గొప్ప అవకాశం

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/హనుమకొండ:** యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం" ఒక గొప్ప అవకాశం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పథకానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ పథకం ద్వారా యువతకు ప్రముఖ కంపెనీలలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. 2024– 2025 బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకం ప్రస్తుతం మూడవ దశలో కొనసాగుతున్నదని చెప్పారు.ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి 6 నెలలు లేదా 9 నెలలు ఉండగా, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9,000 స్టైపెండ్‌తో పాటు ఒకసారి చెల్లించే రూ.6,000 గ్రాంట్ అందించబడుతుందని తెలిపారు. అదేవిధంగా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనల కింద బీమా రక్షణ కూడా లభిస్తుందని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా యువతకు వాస్తవ వ్యాపార వాతావరణంలో అనుభవం, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ లేదా పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుతం డిగ్రీ లేదా పీజీ కోర్సులు (బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఫార్మా, బీఈ, బీటెక్, ఎంఏ, ఎంకాం, ఎంసీఏ, ఎంటెక్ మొదలైనవి) అభ్యసిస్తున్న వారు ఈ పథకానికి అర్హులు కారు.అభ్యర్థులు అధికారిక పోర్టల్‌లో మొబైల్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకొని, ఆధార్ ఈకేవైసీ ద్వారా ఈమెయిల్ ధృవీకరణ పూర్తి చేయాలి. మరిన్ని వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 116090 ను సంప్రదించవచ్చని, అలాగే జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌ను 9441903435 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డిఆర్ ఓ సత్య పాల్ రెడ్డి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 139 దరఖాస్తులు స్వీకరణ: అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్‌ఓ విజయలక్ష్మి , వరంగల్ ఆర్డీఓ సుమ లు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 139 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 54, పిడి హౌసింగ్‌కు 21, జీడబ్ల్యూఎంసీ (వరంగల్)కు 18 దరఖాస్తులు కాగా, మిగతా శాఖలకు సంబంధించినవి 46 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేయడం జరిగిందని, వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## మంగపేట మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమం

### కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగపేట మండలం మల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9గంటలకు, మంగపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10.30గంటలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో మంగపేట మండలంలోని మల్లూరు, మంగపేట గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. జిల్లా ఎస్పి, డిఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్‌డిఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## వసతి గృహాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

**ప్రజాపక్షం/నర్సింహులపేట:** మండలంలోని మోడల్ స్కూల్ వసతి గృహంను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని,స్టూడెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో అధికారులకు సూచించారు.ప్రజాపాలన 99ప్రణాళికలో భాగంగా మండలంలోని మోడల్ స్కూల్ వసతి గృహంను అధికారులతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా వసతి గృహంలోని గదులను పరిశీలించారు.విద్యా బోధన,హస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగితెలుసుకున్నారు.ప్రభుత్వం స్టూడెంట్ల సంక్షేమం కోసం వసతి గృహాలను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.స్టూడెంట్లను ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ,వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు.స్కూల్లో సప్లమేంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న స్టూడెంట్లతో మాట్లాడి పరీక్షల్లో మంచి మార్కులు సాదించాలని చెప్పారు.రాబోయే అకాడమిక్ ఇయర్ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీమన్నారాయణ,తహశీల్దారు రమేష్ మాము,ఎంపీడీవో రాధిక,ఎంపీవో కిన్నెర యాకయ్య స్కూల్ ప్రిన్స్‌పాల్ ఆనంద్ కృష్ణ ఉన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
21-04-2026
www.prajapaksham.in

'రఘుకుంచే టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'గేదెలరాజు'. ఈ చిత్రాన్ని మోటూరి టాకీస్ పతాకంపై రఘు కుంచె సమర్పిస్తున్న ఈ చిత్రానికి చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 24న థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది.'

# రీల్

## 'ఓం శాంతి డిస్కో శాంతి' పోస్టర్ విడుదల




ఆనందో బ్రహ్మ, సేవ్ ది టైగర్స్ వంటి ఎంటర్‌టైనర్స్ సృష్టికర్త మహి వి.రాఘవ్ నుంచి రాబోతున్న మరో సరికొత్త కామెడీ హారర్ చిత్రం 'ఓం శాంతి డిస్కో శాంతి'. 'ఆల్ రెడీ కాషన్ కియా.. ఆల్ రెడీ' క్యాప్షన్. మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించటానికి ఎవరూ ఊహించని సరికొత్త ట్విస్ట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటి వరకు దెయ్యాలు మనుషుల ని భయపెట్టాయి. కానీ ఆ దెయ్యాలకే భయం పుట్టించే వాళ్లు ఎదురైతే? అసలు భయం తెలియని పిచ్చివాళ్లు ఈ దెయ్యాల ముందుకు వస్తే.. దెయ్యాలు వర్సెస్ పిచ్చివాళ్లు మధ్య జరిగే ఓ గందరగోళమైన ఫుల్ ఫన్ రైడర్ 'ఓం శాంతి డిస్కో శాంతి'. దెయ్యాలు పిచ్చివాళ్లని భయపెట్టగలవా? లేక పిచ్చివాళ్లే తిరగబడి దెయ్యాలని భయపెడతారా?, జంప్ స్కేర్, ఫన్నీ డైలాగ్స్, ఊహించని ట్విస్టులతో ఈ స్పూకీ ఫన్ జర్నీ తెరకెక్కుతోంది. 'ఓం శాంతి డిస్కో శాంతి'.. ఆల్ రెడీ కాషన్ కియా..ఆల్ రెడీ చిత్రాన్ని సెప్టెంబర్‌లో విడుదల చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్: మహి వి.రాఘవ్, దర్శకత్వం: గోగు ఆర్.ఆర్, నిర్మాతలు: శివ మేక, సాహితి చింతలపూడి, సంగీతం: కృష్ణ కుమార్, సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వి.ఎస్, ఎడిటర్: శ్రవణ్ కథికనేని.

## మే 1న ప్రేక్షకుల ముందుకు 'ఓ తండ్రి కథ'



తండ్రి అంటే నిస్వార్థ ప్రేమకు ప్రతి రూపం, కుటుంబానికి అచంచలమైన ఆధారం& పిల్లల భవిష్యత్తు కోసం తన భావాలను దాచుకుని అహర్నిశలు శ్రమించే త్యాగమూర్తి. అలాంటి తండ్రి గొప్పతనాన్ని హృదయాన్ని తాకేలా ఆవిష్కరించిన భావోద్వేగ చిత్రం 'ఓ తండ్రి కథ'. కుటుంబ విలువలు, తండ్రి–పిల్లల మధ్య అనుబంధం, బాధ్యతల వెనుక దాగి ఉన్న త్యాగాన్ని ప్రతిబింబించే ఈ చిత్రం మే 1న థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. వైఎస్‌కె, నిహారిక చౌదరి, వరేణ్య ఆగ్రా, అశోక్ రెడ్డి లెంకల, విజయలక్ష్మి , తోట సుబ్బారావు, వి.కరుణాకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నంది వెంకట్ రెడ్డి దర్శకత్వం వహించగా, ఎల్.వి క్రియేషన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అశోక్ రెడ్డి లెంకల నిర్మించారు. తెలుగు ఫిలిం ఛాంబర్‌లో నిర్వహించిన ఆడియో, ప్రచార చిత్రాల విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శకులు వి. సముద్ర, సంజీవ్ కుమార్ మేగోటి ముఖ్య అతిథులుగా పాల్గొని ట్రైలర్, పాటలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ ప్రతి తరం మధ్య పిల్లలు–తల్లిదండ్రుల మధ్య భావోద్వేగ సంఘర్షణలు సహజం. మంచి సందేశంతో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి. తక్కువ బడ్జెట్‌లోనూ మాట నిలబెట్టుకుని సినిమా పూర్తి చేయడం వెంకట్ రెడ్డి నిబద్ధతకు నిదర్శనం అన్నారు. దర్శకుడు సంజీవ్ కుమార్ మేగోటి మాట్లాడుతూ తండ్రి విలువను చూపించే ఇలాంటి సినిమాలు తీయడం నిజంగా సాహసం. వెంకట్ రెడ్డి గారు కొద్ది సంవత్సరాల్లోనే 17 సినిమాలు పూర్తి చేయడం అభినందనీయం అని అన్నారు. నటుడు ఘర్షణ శ్రీనివాస్ మాట్లాడుతూ బంధాలు, అనుబంధాల విలువను గుర్తు చేసే మంచి కాన్సెప్ట్‌తో సినిమా రూపొందింది. ప్రతి ఒక్కరిని కదిలించే భావోద్వేగ చిత్రం ఇది అన్నారు. నిర్మాత అశోక్ రెడ్డి లెంకల మాట్లాడుతూ ఈ సినిమాను ఎంతో మనసుపెట్టి రూపొందించాం. ఈ చిత్రానికి సంగీతం: డ్రమ్స్ రాము, ఎడిటర్ : శ్రీశైలం, డిఓపి యాదగిరి, స్టంట్స్ : మధు డైమండ్

## జూలై 3న 'నాగ బంధం విడుదల'



అభిషేక్ నామా దర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో ఈ సినిమా సెకండ సింగిల్ 'సుర సుర' రిలీజ్ చేశారు. సుర సుర' సంప్రదాయ పెళ్లి వేడుకల ఆనందాన్ని ప్రజెంట్ చేసే ఒక ఫుల్‌ఫ్లెడ్జ్ సెలబ్రేషన్ సాంగ్‌గా అలరించింది. ఈ పాట అదిరిపోయే బీట్‌తో పాటు కలర్ ఫుల్ విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. భారీ స్థాయిలో చిత్రీకరించిన ఈ పాట, చిత్రంలోని సాంస్కృతిక నేపథ్యాన్ని, వైభవాన్ని ప్రజెంట్ చేస్తోంది. జునైద్ కుమార్, అభే అందించిన సంగీతం ట్రైబల్ సౌండ్స్, ఫోక్ ఎలిమెంట్స్‌ను పవర్ ఫుల్ ఆర్కెస్ట్రేషన్‌తో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ పాటలోని రిథమ్ సినిమాటిక్ గ్రాండియర్ ఎక్స్ పీరియన్స్ ఇస్తోంది. అనురాగ్ కులకర్ణి, కాలభైరవ, మంగ్లీ, సాహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ వంటి గాయకులు తమ తమ ప్రత్యేక వోకల్స్ పాటకు మరింత ఎనర్జీ అందించారు. గణేష్ ఆచార్య కొరియోగ్రఫీలో రూపొందిన ఈ పాట ఒక విజువల్ స్పెక్టకిల్‌గా నిలుస్తోంది. భారీ సెట్లు, ఆకట్టుకునే కాస్ట్యూమ్స్, ఎనర్జిటిక్ డాన్స్ మూమెంట్స్ అన్నీ కలిసి ఈ పాటను ఒక గ్రాండ్ వేడుకలా మార్చాయి. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగ బంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో 'స్లమ్ డాగ్'



విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్లమ్ డాగ్' సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూరి జగన్నాథ్ సినిమా ఇండస్ట్రీకి వచ్చి ఇరవై ఆరేళ్ళు అవుతోంది. పూరి తనదైన శైలీలో సినిమాలు నిర్మిస్తున్నారు. స్లమ్ డాగ్ సినిమాకు 33 టెంపుల్ రోడ్ డ్యాగ్ లైన్ పెట్టారు. పవన్ కళ్యాణ్‌తో బద్రి లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన పూరి జగన్నాధ్ ఈడియట్, అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి, ఇస్మార్ట్ శంకర్, వంటి పలు హిట్ సినిమాలు తీశారు. కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న పూరి పాన్ ఇండియా సినిమా తీసి కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టారు. అయినా ఎక్కడ పోగొట్టామో అక్కడే వెతుక్కోవాలనే ఉద్దేశంతో తాజాగా విజయ్ సేతుపతి తో స్లమ్ డాగ్ సినిమా తీస్తున్నారు. చార్మి సమర్పకురాలిగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాలీవుడ్ నటి టబు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తోంది. జెబిఎం మోషన్ పిక్చర్స్ పతాకంపై జేబి నారాయణ రావు కొండ్రొల్ల, పూరి కనెక్ట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## 'అగధ'లో మహాదేవిగా కామాక్షి భాస్కర్ల



'దేవి', 'శత్రువు', 'ఒక్కడు', 'వర్షం', 'మనసంతా నువ్వే', 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' వంటి కల్ట్ చిత్రాల నిర్మాత , 'డర్టీ హరి', ' మళ్లీ పెళ్లి ' చిత్రాల దర్శకుడు ఎం.ఎస్. రాజు మరో సూపర్ ఇంట్రెస్టింగ్ చిత్రంతో మీ ముందుకు వస్తున్నారు. ఆయన తాజా చిత్రం 'అగధ'లో మహాదేవి పాత్ర పరిచయం ఈ మర్మమైన, దైవిక థ్రిల్లర్‌కు కొత్త ఉత్కంఠను జోడిస్తుంది. అగధ' ఫస్ట్ లుక్‌తో రేగిన ఉత్సుకత ఇప్పుడు తదుపరి వెల్లడికి దారితీసింది. మునుపటి పోస్టర్‌లో దైవ విగ్రహం ముందు నిలబడి కనిపించిన ఆ రహస్య యువతి మరెవరో కాదు, కామాక్షి భాస్కర్ల అని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఆమె ఈ చిత్రంలో కీలక కథానాయిక మహాదేవి పాత్రను పోషిస్తున్నారు. తొలి పోస్టర్ ద్వారా ఎంఎస్ రాజు సృష్టించిన దృశ్యరూపానికి ఇప్పుడు ఒక ముఖం, శక్తివంతమైన తెరపై ఉనికి లభించాయి. త్రిశూలాలు,దీపాలు, ఎత్తైన విగ్రహంతో కూడిన ఆధ్యాత్మిక నేపథ్యం ముందు, సాంప్రదాయ నల్ల చీర కట్టుకుని గంభీరంగా కూర్చున్న కామాక్షి భాస్కర్ల రూపమే, కథనంలో ఆమె పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉందని సూచిస్తోంది. ఆమె ప్రచండమైన హావభావం, సాంప్రదాయ రూపం, ఆ పరిసరాల్లోని ఆధ్యాత్మిక వాతావరణం, మహాదేవి కేవలం ఒక సాధారణ పాత్ర కాదని, కథ యొక్క ఆధ్యాత్మిక మూలంతో గాఢంగా ముడిపడి ఉన్న వ్యక్తి అని తెలియజేస్తున్నాయి. ఫస్ట్ లుక్‌కు వస్తున్న స్పందనతో ఉప్పొంగిపోయిన ఎంఎస్ రాజు, ప్రేక్షకులు, శ్రేయోభిలాషులు, దర్శకులు, నటీనటులు అందించిన ప్రోత్సాహకరమైన మాటలకు, ప్రశంసలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఒక హృదయపూర్వక లేఖను విడుదల చేశారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా ద్వారా వెల్లువెత్తుతున్న ప్రేమ, తాను చెబుతున్న కథపై తన నమ్మకాన్ని మరింత బలపరిచిందని ఆయన పంచుకున్నారు. ఒక రచయితగా, దర్శకుడిగా, ఈ ప్రోత్సాహం తన అత్యుత్తమ ప్రతిభను కనబరచడానికి, 'అగధ'లోని ప్రతి అంశం అంచనాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి తనను ప్రేరేపిస్తుందని ఆయన అన్నారు. నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు, శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్న 'అగధ' ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రానికి రచయిత , దర్శకుడు: ఎం ఎస్ రాజు, సంగీత దర్శకుడు, రాకేష్ వేంకటాపురం, సినిమాటోగ్రఫీ: నాని చమిడిశెట్టి, ఎడిటర్: జునైద్ సిద్ధిఖీ, అదనపు స్క్రీన్ ప్లే: చైతన్య వేగి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్వీఎన్ సుబ్బరాజ్.

## విజయ్ దేవరకొండ కొత్త సినిమా



హీరో విజయ్ దేవరకొండ. హీరోగా, హాయ్ నాన్న ఫేమ్ డైరెక్టర్ శౌర్యువ్ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త సినిమా షూటింగ్ షురూ అయింది. ఈ సినిమా ప్రారంభోత్సవంలో విజయ్ దేవరకొండపై హీరో నాని క్లాప్ కొట్టారు. ఘనంగా ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్‌కు పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. ఈ సినిమాలో ఇంటర్నేషల్ టెక్నీషియన్స్ ఈ మూవీకి వర్క్ చేస్తుండటం విశేషం. వైరా బ్యానర్ నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ మూవీ అనౌన్స్ మెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ సినిమా మీద హై ఎక్స్‌పెక్టేషన్స్ క్రియేట్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, డైరెక్టర్ శౌర్యువ్ సినిమాకు హౌస్ ఆఫ్ ది డ్రాగన్, ఫాల్ ఔట్ వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన అలెజాండ్రో మార్టినెజ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గాడ్స్ ఆఫ్ ఈజిప్ట్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, స్నోపియర్సర్ చిత్రాల వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ ఎరిక్ డస్ట్ ఈ మూవీకి పనిచేస్తున్నారు. యానిమల్, ఓం శాంతి ఓం వంటి చిత్రాలకు పనిచేసిన సురేష్ సెల్వ రాజన్ ఈ సినిమా ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాల కంపోజర్ హేషమ్ అబ్దుల్ వాహాబ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇండియన్ సినిమాకు గ్లోబల్ స్థాయి క్రేజ్ తీసుకురావడంలో వారణాసి, రాకా చిత్రాల్లా విజయ్ శౌర్యువ్ మూవీ కూడా ప్రయత్నిస్తున్నారు. మైథాలజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్ లో రూపొందనున్న ఈ సినిమా ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించనుంది. ఎడిటర్ ప్రవీ ణ్ ఆంటోనీ, మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అ బ్దుల్ వాహాబ్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ అలెజాండ్రో మార్టినెజ్. స్క్రిప్ట్, డైరెక్షన్ శౌర్యువ్.

# హైదరాబాద్‌లో జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

## కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం అన్యాయం: ఎం. నరసింహా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న దాదాపు 50 వేల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం తీవ్ర అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహా అన్నారు. జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ సమీపంలోని ఉన్న జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతి పత్రం అందచేశారు. ధర్నా ఉద్దేశించి నరసింహా మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల క్రితం జిహెచ్‌ఎంసి ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచినప్పటికీ, అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి పెంపు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇళ్ల అద్దెలు, పిల్లల విద్య ఖర్చులు దృష్ట్యా కనీస వేతనాన్ని రూ. 26 వేలుగా పెంచాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో పనిచేస్తున్న కార్మికులు కనీస వేతనాలు, కార్మిక చట్టాల ప్రయోజనాలకు దూరంగా ఉన్నాయని నరసింహా విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు వర్తించే చట్టాల ప్రకారం సంవత్సరానికి 23 రోజుల సెలవులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. జిహెచ్‌ఎంసి పరిధిలో జనాభా, భవనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో పని భారం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య మాట్లాడుతూ ఎంటమలాజి విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎండల కారణంగా పని గంటలను తగ్గించాలని కోరారు. కరోనా సమయంలో నియమితులైన కార్మికులకు పెండింగ్ జీతాలు, పిఎఫ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి జీతాల పెంపుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు సంవత్సరానికి 23 రోజుల సెలవులు కల్పించడం, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఎస్‌బిఐ ద్వారా రూ. 30 లక్షల బీమా అందించే అంశాలపై కూడా హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉపప్రధాన కార్యదర్శి జి. నరసయ్యలు ప్రసంగించగా, కార్మికులు ఎ ల్. రవికుమార్, విశ్వప్రసాద్, సత్తార్, భూమేష్, సత్య, కొండల్, విక్రమ్, పరుశురాం, కాళ్యాణ్, ధర్మపురి, స్వప్న,. మహబూబా, సోమయ్య, సోమనాథ్, ఇంద్ర, శ్రీను, ఉపేందర్,పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌లో జీవన్ రెడ్డి ఒక్క రోజు వివిపి

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి ఒక్క రోజు మాత్రమే వివిపి అని, ఆయన చేరికతో బిఆర్‌ఎస్ పార్టీలో ముసలం మొదలయ్యిందనికాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవన్ రెడ్డికి కాంగ్రెస్ సముచిత స్థానం కల్పించిందని, కానీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడడం బాధకరమన్నారు. బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నేతల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో తెలంగాణ ప్రజలకు తెలుసు అని చమత్కరించారు. జీవన్ రెడ్డిని చేర్చుకుని కాంగ్రెస్ బలహీన పడిందని చెప్పే ప్రయత్నం బిఆర్‌ఎస్ చేస్తోందని విమర్శించారు. జీవన్ రెడ్డిని ఎప్పుడూ హరీష్ రావు పార్టీలోకి ఆహ్వానించలేదని, కెటిఆర్ జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్ళినప్పుడు కూడా హరీష్ రావు వెళ్ళలేదన్నారు. రెండవ సారి కెటిఆర్ జగిత్యాలకు వెళ్లినప్పుడు హరీష్ రావు ఇంటికి వెళ్లి బ్రతిమిలాడి తీసుకువెళ్లారని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ భవిష్యత్ అంధకారంలో ఉంది కాబట్టే కవిత ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి కొత్త పార్టీ పెట్టుకుంటుంటే జీవన్‌రెడ్డి అందులో చేరడం విడ్డూరంగా ఉందని చమత్కరించారు. జీవన్ రెడ్డి బిఆర్‌ఎస్ పార్టీలో చేరడం వలన లాభం కంటే నష్టం ఎక్కువ అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ సంవత్సరం తర్వాత బయటకు వస్తుంటే హరీష్ రావు ఢిల్లీ వెళ్లారని, ఆయన ఢిల్లీలో ఎవరిని కలిసి మాట్లాడారనేది త్వరలో బయటకు వస్తుందన్నారు. హరీష్ రావు భవిష్యత్ ప్రణాళికలు ఏంటి అనేది ప్రజలకు తెలుసుననీ, బిఆర్‌ఎస్ మునిగిపోయే పడవ అని కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



జూబ్లీ హిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన నార్వే రాయబారి హెచ్.ఇ. మే-ఎలిన్ స్టెనర్ ప్రతినిధి బృందం.

## పీక్కు తిన్న కుక్కలు

(మొదటి పేజీ తరువాయి)

బబ్లు, ప్రతిమల దంపతులు లేబర్ కుటుంబం కార్మికులుగా పనిచేస్తూ చేస్తూ బ్రిక్స్ బట్టి వద్దనే ఉంటున్నారు. మూడేళ్ల బాలిక చిన్నారి దివ్య బెహరా బట్టి వద్ద ఆడుకుంటూ ఉండగా కుక్కలు ఒక్కసారిగా బాలిక మీద పడి సమీప పొలాల్లో ఈడ్చుకొని వెళ్లి దాడి చేసి అవయవాలు పీక్కు తీనడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని జరిగిన వివరాలను ఆరా తీస్తున్నారు.పోస్టుమార్టం నిమిత్తం బాలికను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.భట్టిలలో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, కార్మికుల కొరకు యాజమాన్యాలు భద్రతలను ఏర్పాటు చేయకపోవడం ధనార్జనే ధ్యేయంగా యాజమాన్యాలు వ్యవహరిస్తూ కార్మికులతో వెట్టి చాకిరి చేస్తూన్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

## దొర్లిపడిన బస్సు

(మొదటి పేజీ తరువాయి)

సాధ్యమైనంత సహాయం అందిస్తామని జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హామీ ఇచ్చారు. బాధితులకు తక్షణ సహాయం, అవసరమైన మద్దతు అందించాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. 'రామ్‌నగర్ నుంచి ఉధంపూర్‌కు వెళ్తున్న ఒక బస్సు కొండ ప్రాంతంలో అదుపుతప్పి, లోయలోకి దూసుకెళ్లింది. కింద రోడ్డుపై తలక్రిందులుగా పడి ఒక ఆటోరిక్షాను ఢీకొట్టింది. ఈ ఘటనా స్థలంలోనే 15 మంది ప్రయాణికులు మృతి చెందగా, మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు' అని ఉధంపూర్‌రేసి రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివ్ కుమార్ శర్మ ఘటనా స్థలంలో విలేకరులకు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు ఉధంపూర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో, మృతుల సంఖ్య 21కి పెరిగిందని అధికారులు తెలిపారు. రెస్క్యూ సమయంలో స్థానిక నివాసితులు గణనీయమైన సహాయం అందించారని శర్మ చెప్పారు. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, రామ్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ మరియు ఇతర అధికారులతో కూడిన పోలీసు బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సైనిక సిబ్బంది కూడా సహాయం అందించగా, సంయుక్త సహాయక చర్యలు చేపట్టారు. ఉధంపూర్ నుంచి రామ్‌నగర్‌కు కాన్వాయ్‌కు నాయకత్వం వహిస్తున్న ఒక సైనికుడు, బస్సు కొండపై నుంచి దొర్లుకుంటూ కిందకు రావడం గమనించిన వెంటనే తాము రంగంలోకి దిగామని చెప్పారు. 'ఈ దుఃఖ సమయంలో ప్రభుత్వం బాధితులకు, వారి కుటుంబాలకు గట్టిగా అండగా నిలుస్తుంది. అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తోంది' అని ముఖ్యమంత్రి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

## ఖూనీ చేసిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్లను అమలు చేసే బిల్లు లోక్‌సభలో పట్టాలు తప్పిన తర్వాత, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు 'భ్రూణహత్య'కు పాల్పడ్డాయని ప్రధానమంత్రి ఆరోపించడంపై ఖర్గే మాట్లాడుతూ 'మహిళా రిజర్వేషన్ బిల్లును చంపేసింది మీరే (మోదీ); మేము డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాము కానీ మహిళా కోటా బిల్లుకు కాదు' అని అన్నారు. 2010లో యుపిఎ ప్రభుత్వం రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు సభికులకు గుర్తు చేశారు. తాము ఎల్లప్పుడూ మహిళల హక్కులు, సంక్షేమాన్ని నిర్ధారించడానికి ఆసక్తిగా ఉన్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ, సోనియా గాంధీ వంటి మహిళా నాయకులు ఉన్నారని ఆయన గుర్తుచేస్తూ, బిజెపి ఎప్పుడైనా ఒక మహిళను తమ అధ్యక్షురాలిగా చేసిందా లేదా వారిలో ఎవరినైనా ఉన్నత పదవికి ఎదిరించిందా అని ప్రశ్నించారు. 'మేము (పార్లమెంటు) 2023లో ఏకమయ్యాము, మహిళా కోటా బిల్లు ఆమోదం పొందింది. కానీ మోదీ 30 నెలల పాటు దానిపై నిద్రపోయి, పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాత్రమే మేల్కొన్నారు' అని అన్నారు. కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని దీనిని ఇంతకు ముందే అమలులోకి తీసుకురాకుండా ఏది ఆపిందోనని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పునర్విభజనను ముందుకు నెట్టి, దేశంలో త్వరగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 'మీరు (మోదీ) ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు పొడిచి, ఆ తర్వాత మహిళా సాధికారత కోసం పనిచేశామని చెప్పుకుంటారు' అని ఖర్గే అన్నారు. మోదీ 2014లో అధికారంలోకి వచ్చారని, కానీ మహిళలకు అంతకంటే చాలా ముందే ఓటు హక్కు ఉందని ఆయన అన్నారు.

## అకాల వర్షాలు బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

పాటు వడగళ్లతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం ఎండలు దంచి కొట్టడం, సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మార్పు చెంది వర్షం పడటం సర్వసాధారణంగా మారింది. ఈ అకాల వర్షాలతో కోతకు సిద్ధమైన మొక్కజొన్న, వరి పంట నేలవాలగా, రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలి వాన ధాటికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని సిరికొండ, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, ధర్పల్లి మండలాల్లో వర్షం బీభత్సానికి చేతికొచ్చిన పంట మొత్తం నేలపాలైంది. మెదక్ జిల్లా రామాయంపేటలో సాయంత్రం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లో ఈదురు గాలులకు చెట్లు నేల కూలాయి. ఝరాసంగం మండలం జీర్లపల్లి, చిలేమామిడి గ్రామాల్లో రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరి పడిపోయాయి. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, బాలానగర్ జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, సూరారం, గండమైసమ్మ ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చింతల్, పద్మనగర్‌లో వేర్లతో సహా భారీ వృక్షం నేలకొరికింది. చెట్టు ధాటికి రెండు కరెంట్ స్తంభాలు నేలకొరగడంతో, వాటి కింద ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.

**మూడు రోజులు భిన్నమైన వాతావరణం**

మరోపురాష్ట్రంలో రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల పాటు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉండగా, అదే సమయంలో ఎండల తీవ్రత కూడా ఏమాత్రం తగ్గదని స్పష్టం చేశారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం కామారెడ్డి, సంగారెడ్డి, భద్రాద్రి కొత్త గూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడ గండ్ల వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ, పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో ఎండలతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, హనుమకొండ, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రాబోయే ఐదు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదిలాబాద్‌లో 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో 36 నుంచి 40, 41 44 డిగ్రీలకు పెరిగే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్త గూడెం, హనుమకొండ జిల్లాల్లో 36 40 మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com